www.jagritiweekly.com

సంపుటి : 75 సంచిక : 50 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ భాద్రపద బహుళ తదియ

02-08 అక్టోబర్ 2023

వెల : ₹20/-



# నమో నారీశక్తి!



27 ఏళ్లుగా పడిగాపులు పడి ఉన్న బిల్లును కేవలం
48 గంటలలోనే ప్రధాని నరేంద్ర మోదీ ఆమోదింప చేశారు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# న్యూజెర్సీలో స్వామినారాయణ్ అక్షరధామ్



విదేశాలలో అనేక హిందూ దేవాలయాలు కొలువుదీరుతున్నాయి. ఆ క్రమంలో అమెరికాలోని న్యూజెర్సీలో 183 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమైన స్వామి నారాయణ్ అక్షరధామ్ అక్టోబర్ 8వ తేదీన ప్రారంభమవుతుంది. 18వ తేదీ నుంచి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. భారత్ వెలువల నిర్మితమైన అతి పెద్ద దేవాలయాల్లో ఇది రెండవది. కంబోడియాలోని అంగ్‌కోర్‌వాట్‌లో 500 ఎకరాలలో 12వ శతాబ్దంలో నిర్మితమైన హిందూ దేవాలయం ప్రపంచంలోనే అతి పెద్దదిగా వినుతికెక్కింది. ప్రస్తుత న్యూజెర్సీ ఆలయ నిర్మాణానికి సుమారు పన్నెండేళ్లు (2011-23) పట్టగా, అమెరికా వ్యాప్తంగా పన్నెండున్నర వేలకు పైగా కార్యకర్తలు ఈ క్రతువులో పాలు పంచుకున్నారు. ఈ క్షేత్రంలో ప్రధాన మందిరంతో పాటు పన్నెండు ఉప మందిరాలు, తొమ్మిది రాజగోపురాలు, తొమ్మిది పిరమిడ్‌లు ఉన్నాయి. భారతీయ ప్రాచీన సంస్కృతి ప్రతిబింబించేలా పది వేల విగ్రహాలు, నృత్యరూప శిల్పాలు, వాయిద్య పరికరాలు చెక్కారు. ఈ ఆలయ నిర్మాణంలో దాదాపు రెండు మిలియన్ క్యూబిక్ అడుగుల రాయిని ఉపయోగించారు. మన దేశం, చైనా నుంచి గ్రానైట్, ఇసుకరాయితో పాటు గ్రీస్, టర్కీ, ఇటలీ,చైనా నుంచి నుంచి మార్బుల్; యూరప్, ఆసియా, లాటిన్ అమెరికా నుంచి ఇతర అలంకరణ రాళ్లు తెప్పించారు. ★



ఇది 'జాగృతి'

# అమృతోత్సవం

75 ఏళ్ల స్వతంత్ర
భారత చరిత్రకు ఈ జాతీయ
వారపత్రిక సాక్షి!
ఆ చరిత్రనే మీ కళ్లకు కడుతూ
దీపావళి (నవంబర్ 13, 2023)
ప్రత్యేక సంచికగా
వెలువడుతోంది.




ఇదంతా మనదైన చరిత్ర.
భారతదేశ చరిత్ర.
భారతీయత చరిత్ర.
మనమే రాసుకున్న చరిత్ర.
వెలుగు చూడాల్సిన
నిజమైన చరిత్ర.

## త్వరపడండి!

అదనపు కాపీలు కావాలనుకునే
పాఠకులు, ఏజెంట్లు
అక్టోబర్ 31లోగా జాగృతి కార్యాలయానికి
9959997013 నంబరుకు ఫోన్ చేసి
లేదా వాట్సప్‌లో సంప్రదించవచ్చు.

☞ 10 నుంచి 25 కాపీలు ఆర్డరు చేసిన వారికి 30 శాతం
☞ 26 నుంచి 99 కాపీలు ఆర్డరు పెట్టుకున్న వారికి 35 శాతం
☞ 100 ఆ పైన కాపీలకు 40 శాతం డిస్కౌంట్ లభిస్తుంది.

jagritiweekly.com | facebook.com Jagriti Telugu Weekly | youtube.com/@Jagrititv | 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040–27561453/9959997013**

## చందాదారులకు విన్నపం

జాగృతి వారపత్రికలను క్రమంతప్పకుండా అందజేయుటకు తపాలశాఖ వారు ఈ మధ్యనే **'మ్యాగజైన్ పోస్ట్'** అనే పేరుతో **'ట్రాకింగ్ సిస్టం'** ప్రవేశ పెట్టారు. ట్రాకింగ్ ఉంటుంది కాబట్టి పత్రిక తప్పనిసరిగా అందుతుంది. చందాదారునికి పత్రిక పోస్ట్ చేసిన తేదీ, పత్రిక అందజేసిన విషయం ఎస్ఎంఎస్ ద్వారా తపాలా శాఖవారు తెలియజేస్తారు. జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు అదనంగా సంవత్సరానికి **రూ.624/–** (వారానికి రూ.12/–) తపాలాశాఖకు చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి ఈ సదుపాయం పాఠకులు వినియోగించుకోవాలని విన్నపం. అందుకోసం జాగృతి అకౌంట్‌కు అదనంగా రూ.624/– చెల్లించగలరు. ప్రస్తుత చందా దారులు రాబోయే వారాలకు తగిన మొత్తం (వారానికి రూ.12/– చొప్పున) పంపిన వివరాలతోపాటు తమ చందా నెంబరు వివరాలు, పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెంబరు తెలుపగలరు. ఈ వివరాలు అందిన 15 రోజుల నుండి **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పత్రిక పంపే ప్రక్రియ మొదలవుతుంది.

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust,**
**920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

**మరిన్ని వివరాలకు**

**040–27561453/9959997013** నెంబర్లలో సంప్రదించవచ్చు.

**– సర్క్యులేషన్ మేనేజర్**

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.4000** | **సంవత్సర చందా రూ.850**

**చందా పంపవలసిన చిరునామా :**

✦ 3–4–228/4/1, కాచిగూడ, హైదరాబాద్–500 027.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | |
|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ |
| సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్ : సిహెచ్. కుమార్

**మ**తం దగ్గర ఒక వర్గానిది ఉదార స్వభావం. మతం పేరెత్తితేనే ఊగిపోయే లక్షణం మరొక వర్గీయులది. మత ఉద్రిక్తతలు కొందరు మతోన్మాద మైనారిటీల దుందుడుకు చర్యల ఫలితమని సుస్పష్టంగా తేలినా మెజారిటీలపైనే నింద మోపే లక్షణం ఇక్కడి ప్రత్యేకత. చరిత్ర చెబుతున్నదీ అదే. ఈ విషయమే బీజేపీ అగ్రనేత లాల్ కృష్ణ అడ్వాని తన అయోధ్య రథయాత్ర సందర్భంలో దేశ ప్రజలకు వివరించే ప్రయత్నం అద్భుతంగా చేశారు. ఉదారవాదులు కాబట్టి ఆ సత్యం మెజారిటీలకు అర్థమయింది. మైనారిటీలు ఇంకా అర్థం చేసుకోవలసిన పరిస్థితిలోనే ఉన్నారు. అడ్వానీ విశ్లేషణ హిందువులు, ముస్లింలకు సంబంధించినది. ఆ మైనారిటీ వర్గంలోని కొందరికి, ఇప్పుడు మరొక మైనారిటీ వర్గంలో కొందరు తోడై 1947 నాటి పరిస్థితిని పునరావృతం చేయాలని చూస్తున్నారు. ఆయన రథయాత్రకు పదేళ్ల ముందు మైనారిటీ వర్గం సిక్కులలో దారితప్పిన కొందరు సృష్టించిన అవాంఛనీయ, ఆత్మహత్యా సదృశ ధోరణులే మళ్లీ ఇప్పుడు బుసలు కొడుతున్నాయి. దేశ విభజన సమయంలో ఏ వర్గం చేతిలో అయితే ఎన్ని తరాలయినా మరచిపోని విధంగా గాయపడ్డారో, అదే వర్గం చేతిలో పావులుగా ఆ క్షతగాత్రులే, అంటే సిక్కులు, మారిపోవడమే చరిత్రను దిగ్భ్రమకు గురి చేస్తున్నది. పాత గాయం సలుపును మరచిపోవడానికి కొత్త గాయం చేసుకోవాలన్న భూతవైద్యాన్ని ఆ దారితప్పిన సిక్కులు నమ్ముతున్నారు. ఖలిస్తాన్‌తో పాటు ఉర్దూస్తాన్ ఏర్పాటుకు ప్రణాళికలు వేయడం అలాంటిదే. వీళ్లే దావూద్ ఇబ్రహీంనూ అంటకాగుతున్నారు.

ఇలాంటి ప్రణాళికల రూపకర్తలకు ఆశ్రయం ఇస్తున్న కెనడాకూ, భారత్‌కూ నడుమ సంబంధాలు దెబ్బ తినడం ఆశ్చర్యపరిచే పరిణామం కాబోదు. కెనడా ఖలిస్తానీల అడ్డా. ఖలిస్తానీలను బుజ్జగించే ప్రభుత్వమే అక్కడ రాజ్యమేలుతోంది. భారత్ నుంచి పారిపోయిన సిక్కు ఉగ్రవాదులలో కొందరు అక్కడే ఆశ్రయం పొందుతున్నారు. అందులో ఒకడు గురుపత్వంత్ సింగ్ పన్ను. సిక్కు రాజ్యం ఖలిస్తాన్ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్న సిక్స్ ఫర్ జస్టిస్ అధిపతిగా ఇతడికి పేరు. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ ఉర్దూస్తాన్ పేరుతో భారతదేశంలోనే ముస్లింల

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ భాద్రపద బహుళ తదియ**

## లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం
**నమో నారీశక్తి**
6లో



జాతీయం
**నిన్న పాకిస్తాన్.. ఇవాళ కెనడా**
12లో



ధారావాహిక నవల
**మహా సంకల్పం**
– పి. చంద్రశేఖర ఆజాద్
20లో

# జాగృతి

## సంపాదకీయం

కోసం ఒక దేశాన్ని నిర్మించాలన్న ఇతడి ఆశయం ఇటీవలనే బయటపడింది. అసలు ఏ మతం వారు కోరుకుంటే ఆ మతం కోసం భారత్‌ను ఒక్కొక్క ముక్కగా చీల్చి అప్పగించాలని ఇతడి కల. ఖలిస్తాన్ కుట్రదారులు ఒక్కొక్కరుగా 'అనుమానాస్పద' స్థితిలో మరణించడం చూసి, కొద్దికాలం పత్తా లేకుండా పోయిన పన్ను, మళ్లీ వార్తలలోకి వచ్చాడు. నిజానికి కెనడాయే ఇప్పుడు వార్తలలో ఉంది కదా! అక్కడే తలదాచుకున్న ఖలిస్తానీ హరదీప్‌సింగ్ నిజ్జర్ ఆ మధ్య హత్యకు గురి కావడం, ఆ హత్యలో భారత్ ప్రమేయం ఉందని మాట తూలి దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో అభాసుపాలు కావడం తెలిసిందే.

## ఎందాక ఈ ప్రయాణం?

కెనడా గడ్డ మీద నుంచి పన్ను, ట్రూడో పలికిన బీరాలు ఇప్పుడు భారత్‌లోని ఖలిస్తానీల మూలాలకు ముప్పు తెచ్చాయి. కెనడాతో పాటు అమెరికా, దుబాయి, పాకిస్తాన్, ఆస్ట్రేలియా, బ్రిటన్‌లలో తలదాచుకుంటున్న సిక్కు ఉగ్రవాద నేతల ఆస్తుల మీద భారత్‌లో జాతీయ దర్యాప్తు సంస్థ దాడులు మొదలయ్యాయి. వీటిని జప్తు చేయబోతున్నారు. ఈ పని గురుపత్వంత్ పన్ను ఆస్తుల జప్తుతోనే ఆరంభమైనట్టు కనిపిస్తున్నది. అమృత్‌సర్, చండీగఢ్‌లలో ఉన్న ఆయన ఆస్తుల పని పట్టారు అధికారులు. ఆస్తులు జప్తు కావలసిన వాళ్ల జాబితాలో మొత్తం 19 మంది ఉన్నారు. ఇంగ్లండ్‌లో దాక్కున్న కుల్వంత్ సింగ్ మత్రా, పరంజిత్ సింగ్ పమ్మ, అమెరికాలో తిష్ట వేసిన హర్జప్ సింగ్, జే ధుల్వాల్, పాకిస్తాన్‌లో నక్కిన వాధ్వా సింగ్ బబ్బర్ వంటి వాళ్లు ఆ జాబితాలో ఉన్నారు. గురుపత్వంత్ సింగ్ పన్ను చండీగఢ్‌లో కట్టిన ఇల్లు చూస్తే చాలు, వీళ్లు ఎలాంటి జీవితాలు గడుపుతున్నారో తెలుస్తుంది. ఇప్పుడు ఉపా కింద వీరి ఆస్తులను వేలం వేస్తారు. ఇవన్నీ అనివార్య పరిణామాలే. కోరి తెచ్చుకున్నవే.

ఇంతకీ, ఒక్కొక్క మతం వారికి వారు కోరుకున్న విధంగా భారతదేశాన్ని ముక్కలు చేసి ఇచ్చే అధికారం సిక్స్ ఫర్‌జస్టిస్ లేదా మరొక వేర్పాటు, విధ్వంసక సంస్థకు ఎవరు ఇచ్చారు? దేశంలో మా మతం వారి కోసం ఒక భాగాన్ని చీల్చి ఇమ్మని కోరినవారు ఎవరు? వీళ్లందరూ తలా ఒక ముక్క కోసుకు వెళ్లిన తరువాత మిగిలిన భాగంలో మెజారిటీ హిందువులు సర్దుకోవాలి కాబోలు! ఉర్దుస్తాన్ ఏర్పాటు ఆశయం ఒక విషబీజం. చరిత్రను మరచిపోయిన ఒక అజ్ఞాని ప్రేలాపన. ఉర్దుస్తాన్ ఎవరి కోసం? ముస్లింల కోసం.

విభజన వేళ పంజాబ్ సిక్కుల పట్ల ముస్లిం మతోన్మాదులు వ్యవహరించిన తీరు ఎలాంటిది? ప్రస్తుతం పాక్ భూభాగంలో ఉన్న ప్రాంతం నుంచి వలస వచ్చిన పత్వంత్ సింగ్ పన్ను కూడా ఈ చరిత్రను మరచిపోవడమే చిత్రం. పంజాబ్‌ను సిక్కుల నెత్తురులో ముంచిన ముస్లిం మతోన్మాద మూకల చర్యలు తడి ఆరని మరకలే. ఎందరు సోదరీమణులు బలాత్కారాలకు గురైనారో గుర్తు లేదా? విభజన నేపథ్యంలో జరిగిన కాంగ్రెస్ సమావేశాలలో జేబీ కృపలానీ వంటివారు చెప్పిన విషయాలు ఒక్కసారి పరిశీలించినా అవన్నీ గుర్తుకు వస్తాయి. హిందువులు, సిక్కుల శవాలు నిండిన రైళ్లు పాకిస్తాన్ నుంచి భారత్ వచ్చాయి. ఇవన్నీ మరచిపోయి పాకిస్తాన్ అండతో మరొకసారి భారత్‌ను విడదీయాలని ఈ ఖలిస్తాన్ నాయకుల ఆశ. ఇక్కడ ఒక్కటే ప్రశ్న. అలాంటి ఆత్మహత్యాసదృశమైన నిర్ణయం వైపు నడవడానికి హిందువులు చేసిన తప్పిదం ఏమిటి? సిక్కుమతం హిందూమతం నుంచి జనించిందన్న సంగతయినా వీరికి గుర్తు లేదా? ఆ మత పెద్దలంతా ఎవరి చేతులలో దారుణ హింసతో చనిపోయారు? అంత నైచ్యానికి హిందువులు ఒడిగట్టారా? కాంగ్రెస్ వంటి విచ్ఛిన్నకర శక్తి చేసిన రాజకీయ విన్యాసాల ఫలితమే ఇదంతా అన్న స్పృహ లేకుండా మొత్తం హిందువులను ద్వేషిస్తూ ఉగ్రవాదాన్ని ఆశ్రయించడం అంటే అర్థం అవివేకం వంటి చిన్న మాటలలో దొరకదు. ★



అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

**సారంగపాణి**

– బి.వి. శివప్రసాద్





| | | |
|---|---|---|
| 'కమిషన్' చెలగాటం–అభ్యర్థుల సంకటం (తెలంగాణ) | – | 14 |
| మద్యం దందాపై మహిళా మోర్చా దండయాత్ర (వేదిక) | – | 16 |
| వరి పరిశోధనలో 'స్వాతి'ముత్యం (మహిళ) | – | 24 |
| ముగ్గురు నేతలు (ప్రత్యేక వ్యాసం) | – | 26 |
| అదే 'మోదీ' మంత్రం (అంతర్జాతీయం) | – | 28 |
| "నా దేశం– నా ప్రజలు" (సాహిత్యం) | – | 30 |
| ఆసియాడ్‌లో జోరుగా, హుషారుగా పతకాల వేట! (క్రీడ) | – | 33 |
| పాత బాటలోనే 'సప్త సాగరాలు దాటి...' (సినిమా) | – | 50 |



కొత్త పార్లమెంట్ భవంతిలో తొలి సమావేశం చరిత్రకు ఎక్కింది. ఇరవైఏడేళ్లుగా నానుతున్న మహిళా బిల్లుకు కొత్త భవనంలో జరిగిన తొలి సమావేశాలు, ప్రత్యేక సమావేశాలు ఆమోదముద్ర వేశాయి. రెండు వ్యతిరేక ఓట్లు మినహాయిస్తే, లోక్‌సభ, రాజ్యసభ మహిళా రిజర్వేషన్ బిల్లుకు జే కొట్టాయి. 27 ఏళ్లుగా పడిగాపులు పడి ఉన్న బిల్లును కేవలం 48 గంటలలోనే ప్రధాని నరేంద్ర మోదీ ఆమోదింప చేశారు. ఇందులో చాకచక్యాన్ని చూడడం, రాజకీయ వ్యూహాన్ని వెతకడం కంటే, ఆధునిక కాలానికి అవసరమైన ఒక గొప్ప సంస్కరణను దర్శించడం మంచిది. ఆ రాజకీయ చాతుర్యానికీ, వ్యూహానికీ ఒక ఆదర్శం ఉంది. అందుకే భారతీయులంతా ఈ బిల్లును, దీనిని అమలులోకి తెచ్చిన ఎన్డీయే మీద ప్రశంసలు కురిపిస్తున్నారు. ఒక మహిళ రాష్ట్రపతి పదవిలో ఉండగా ఈ బిల్లు ఆమోదానికి నోచుకోవడం మరొక ప్రత్యేక సందర్భమే. ఈ బిల్లుకు ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన పేరు నారీశక్తి వందన్ అభియాన్.



# నమో

ధర్మం, సహనాలకు ఒక బలహీనత ఏంటంటే ద్రోహానికి, వంచనకు తేలిగ్గా గురికావడం! సమానహక్కుల విషయంలో సహనమూర్తులైన స్త్రీల కు ప్రపంచ వ్యాప్తంగా జరిగిందీ...జరుగుతున్నదీ ఇదే. కానీ ఇందుకు రువాండా మినహాయింపు. దిగువసభలో 61% ప్రాతినిధ్యాన్ని కల్పించడం ద్వారా మహిళల సమాన హక్కుల విషయంలో ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలిచింది. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో ప్రస్తుత వేగంతోనే దేశాలు కోటాలు నిర్దేశిస్తూ పోతే, వారు పురుషులతో సమానస్థాయికి రావడానికి మరో 300 ఏళ్లు పడుతుందని యు.ఎన్. మహిళ నివేదిక వెల్లడిం చించినా అందుకు ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. మనదేశానికి వస్తే 27 ఏళ్ల క్రితం ప్రవేశపెట్టిన మహిళా బిల్లును పితృస్వామ్య భావజాలాన్ని వీడని రాజకీయ పార్టీలు తమ వితండవాదాలతో అడ్డుకోవడంతో ఇప్పటివరకు అమలుకు నోచలేదు. ఈ ఇరవయ్యేడేళ్ల నిరీక్షణ ఇప్పటికి ఫలించింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ మహిళా బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించడంతో మహిళాభ్యుదయ చరిత్రలో మరో అధ్యాయం ప్రారంభమైంది. లోక్‌సభలో కేవలం ఇద్దరు సభ్యులు బిల్లును వ్యతిరేకించగా, రాజ్యసభ ఏకగ్రీవంగా ఆమోదించడం మారిన పార్టీల వైఖరిని స్పష్టం చేస్తున్నది.



జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

కేంద్ర, రాష్ట్ర చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్‌ను కల్పించడానికి వీలుకల్పించే 'రాజ్యాంగ 128వ సవరణ బిల్లు–2023'ను 'నారీశక్తి వందన్ అభియాన్' అధికారిక నామంతో 'సంసద్ భవన్'లో పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ సెప్టెంబర్ 19 ప్రవేశపెట్టిన బిల్లు ఎనిమిది గంటల చర్చ తర్వాత ఆమోదం పొందింది.నూతన పార్లమెంట్ భవనం 'సంసద్ భవన్'లో ప్రవేశపెట్టిన తొలిబిల్లుగా చరిత్ర సృష్టించిన నారీశక్తి వందన్ అభియాన్‌కు అనుకూలంగా 454 మంది సభ్యులు ఓటుచేయగా ఇద్దరు వ్యతిరేకించారు. అనంతరం ఈ బిల్లును సెప్టెంబర్ 21న ప్రభుత్వం రాజ్యసభలో ప్రవేశపెట్టగా 11 గంటల చర్చ అనంతరం ఏకగ్రీవంగా ఆమోదించింది. సభకు హాజరైన 215మంది సభ్యులు అనుకూలంగా ఓటు వేయడంతో మహిళా బిల్లుకు ఉభయసభల ఆమోదం లభించింది. ఈ బిల్లు అమల్లోకి వస్తే లోక్‌సభలో మహిళల ప్రాతినిధ్యం 181కి పెరుగుతుంది. ప్రస్తుతం మొత్తం 542మంది లోక్‌సభ సభ్యుల్లో మహిళలు 78 మంది మాత్రమే! రాజ్యసభ సభ్యుల సంఖ్య 224 కాగా, మహిళా సభ్యుల సంఖ్య 24కే పరిమితమైంది. అంటే 2023 పార్లమెంట్ ఉభయసభల్లో మహిళా ప్రతినిధుల సంఖ్య 102. కొత్తగా అమల్లోకి రాబోయే ఈ మహిళా రిజర్వేషన్ చట్టం 15 సంవత్సరాల పాటు అమల్లో ఉంటుంది. షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన మహిళలకు, ఈ రిజర్వేషన్‌లోనే తగిన సీట్లు కేటాయిస్తారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చర్చ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన తర్వాత, జనగణన, నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలను కొత్త ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఈ రెండూ ముగిసిన తర్వాత మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లోకి వస్తుంది. ప్రస్తుతం విపరీతంగా పెరిగిన జనాభా నేపథ్యంలో, జనసంఖ్యకు అనుగుణంగా ఈ నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ జరుపుతారు. ఈ బిల్లు పూర్తిగా అమల్లోకి రావాలంటే 50% రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం తప్పనిసరి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే మహిళా రిజర్వేషన్ అమల్లోకి వస్తుంది.

### వ్యతిరేకించిన ఎంఐఎం

లోక్‌సభలో ఏఐఎంఐఎం పార్టీకి చెందిన అసదుద్దీన్ ఒవైసీ, ఇంతియాజ్ జలీల్‌లు ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటువేసి ఉండవచ్చునన్న వార్తలు వచ్చాయి. అసదుద్దీన్ ఒవైసీ ఈ బిల్లుపై సభలో మాట్లాడుతూ ఇది 'సవర్ణ' మహిళలకు మాత్రమే ప్రయోజనకరమని వ్యాఖ్యానించారు. పార్లమెంట్‌లో ఓబీసీ, ముస్లిం మహిళలకు తగిన కోటా ఇవ్వక పోవడం వల్ల వారి ప్రాతినిధ్యానికి బిల్లు ఎంతమాత్రం ప్రయోజనకారి కాదంటూ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. ముస్లిం మహిళలు దేశ జనాభాలో 7శాతం ఉంటే పార్లమెంట్‌లో వారి ప్రాతినిధ్యం 0.7శాతం మాత్రమేనని ఆయన వాదించారు. ఇప్పటివరకు 690 మంది మహిళలు లోక్‌సభకు ఎన్నికైతే వారిలో 25 మంది మాత్రమే ముస్లిం మహిళలని ఆయన పేర్కొన్నారు. ఓబీసీలు, మైనారిటీ మహిళల రిజర్వేషన్



# నారీశక్తి!

ప్రస్తావన లేదంటూ సన్నాయి నొక్కులు నొక్కినా, కాంగ్రెస్ సహా విపక్షాలు బిల్లుకు మద్దతివ్వడం విశేషం.

### మహిళా రిజర్వేషన్‌బిల్లు-2010

నిజానికి 27 సంవత్సరాలుగా మహిళా రిజర్వేషన్లపై దేశవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో చట్టసభల్లో 1/3వ వంతు సీట్లు మహిళలకు కేటాయించేందుకు వీలుకల్పించే 'మహిళా రిజర్వేషన్ బిల్లు' లేదా 108వ రాజ్యాంగ సవరణ బిల్లు పేరుతో మార్చి 9, 2010న నాటి యూపీఏ ప్రభుత్వం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. రొటేషన్ ప్రాతిపదికన మహిళలకు సీటు రిజర్వ్ చేసేందుకు ఈ బిల్లులో ప్రతిపాదించారు. అంటే ప్రతి మూడు వరుస సాధారణ ఎన్నికలకు ఒకసారి రొటేషన్ ప్రాతిపదికన సీటు కేటాయిస్తారు. మార్చి 9, 2010న రాజ్యసభ ఈ బిల్లుకు ఆమోదం తెలిపినప్పటికీ, లోక్‌సభలో దీనిపై ఓటింగ్ జరగకపోవడంతో పెండింగ్‌లో పడింది. ఫలితంగా 2014, 2019 సంవత్సరాల్లో ఈ బిల్లు మురిగిపోయింది. 2010లో సమాజ్‌వాదీ పార్టీ నేత ములాయం సింగ్ యాదవ్ వంటి విపక్షనేతలు తాము మహిళా బిల్లుకు వ్యతిరేకం కాదంటూనే ఓబీసీలు, మైనారిటీ మహిళలకు రిజర్వేషన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేయడంతో బిల్లు ఓటింగ్‌కు నోచుకోలేదు. నిజానికి అన్ని పాలక సంస్థల్లోనూ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని బిల్లులో పేర్కొన్నారు. కానీ స్టాండింగ్ కమిటీ కేవలం కేంద్ర పార్లమెంట్, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల అసెంబ్లీలకు ఈ సదుపాయాన్ని పరిమితం చేయాలన్న సిఫారసును ప్రభుత్వం ఆమోదించి బిల్లులో చేర్చింది.





### అరకొర ప్రాతినిధ్యం

2023 లోక్‌సభలో మొత్తం సభ్యుల్లో మహిళల సంఖ్య 15% కంటే తక్కువే! అదేవిధంగా వివిధ రాష్ట్రాల అసెంబ్లీలను పరిశీలిస్తే మహిళల పట్ల వివక్ష చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, గోవా, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, ఒడిషా, సిక్కిం, తమిళనాడు, తెలంగాణ, త్రిపుర, పుదుచ్చేరి అసెంబ్లీలలో మహిళల ప్రాతినిధ్యం 10%కంటే తక్కువ. లోక్‌సభ విషయంలో తొలినుంచి పరిశీలిస్తే, క్రమంగా మహిళల సంఖ్య పెరుగుతూ వచ్చినప్పటికీ అది తగినంత స్థాయిలో లేకపోవడం విషాదం. మొదటి లోక్‌సభలో వీరి ప్రాతినిధ్యం 1%కు మాత్రమే పరిమితం కాగా ప్రస్తుత 17వ లోక్‌సభలో 14%గా ఉంది. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా మహిళల పట్ల దేశంలో వ్యక్తమయ్యే సానుకూలత కేవలం 'మాటలకే' పరిమితమన్న సత్యాన్ని ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి. 2019 సాధారణ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా 716మంది మహిళా అభ్యర్థులు పోటీపడగా, 78మంది లోక్‌సభలోకి ప్రవేశించగలిగారు. 2014లో

లోక్‌సభలోకి అడుగిడిన 62 మంది మహిళా ప్రతినిధులతో పోలిస్తే ఇది కొంచెం నయం.

**అడ్డంకుల చరిత్ర**

1987లో అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ, నాటి కేంద్రమంత్రి మార్గరెట్ ఆల్వా నేతృత్వంలో 14మందితో కూడిన ఒక కమిటీని ఏర్పాటుచేసి, మహిళల స్థితిగతుల మెరుగుకు అవసరమైన సిఫారసులు చేయమని కోరారు. తర్వాత రాజీవ్ ప్రభుత్వం ఒక రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపాదించింది. పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్ సదుపాయం కల్పించాలన్నది ఈ బిల్లు సారాంశం. లోక్‌సభ దీన్ని ఆమోదించి నప్పటికీ, 1989లో రాజ్యసభ తిరస్కరించడంతో ఈబిల్లు అటకెక్కింది. 1993లో అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావు 73వ, 74వ రాజ్యాంగ సవరణ చట్టాలను అమల్లోకి తెచ్చారు. వీటి ప్రకారం గ్రామ పంచాయతీల్లో 1/3వ వంతు విలేజ్ కౌన్సిల్ లీడర్ లేదా సర్పంచ్ స్థానాలను మహిళలకు కేటాయించాల్సి ఉంటుంది. ఈ కేటాయింపునకు ఏ విధమైన నిబంధనలు పేర్కొనకపోయినప్పటికీ పంచాయతీ రాజ్ సంస్థల్లో మహిళలకు 33.3శాతం రిజర్వేషన్‌ను ఈ చట్టాలు తప్పనిసరి చేశాయి. తర్వాత ఇదే విధానాన్ని అసెంబ్లీలకు, లోక్‌సభకు వర్తింప జేసేందుకు ఒక దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందిం చారు. ఇదిలావుండగా హెచ్.డి. దేవెగౌడ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం మొట్టమొదటి సారి 11వ లోక్‌సభలో 81వ రాజ్యాంగ సవరణ బిల్లు పేరుతో సెప్టెంబర్ 12, 1996న మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టింది. అప్పుడు ఈ బిల్లును ఉమ్మడి పార్లమెంటరీ బోర్డు పరిశీలనకు పంపారు. రాజ్యాంగ సవరణ తర్వాత ఓబీసీ మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ సదుపాయం కల్పించవచ్చునని ఈ ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ సిఫారసు చేసినప్పటికీ 11వ లోక్‌సభ రద్దు కావడంతో ఈ బిల్లు మురిగిపోయింది. ఎట్టకేలకు నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ మహిళా బిల్లుకు లోక్‌సభ ఆమోదాన్ని పొందడంలో విజయం సాధించింది.

**1900లోనే ఉద్యమాలు**

1947కు ముందు బ్రిటిష్ ఇండియా వలస పాలనలో స్త్రీపురుషులకు ఓటు హక్కు ఉండేది కాదు. అటువంటి కాలంలోనే అంటే 1900 ప్రాంతంలోనే స్త్రీలకు ఓటు హక్కు గురించి దేశంలో ఉద్యమాలు ప్రారంభమయ్యాయంటే ఆశ్చర్యమనిపించవచ్చు కానీ ఇది నిజం. మహిళలకు రిజర్వేషన్ల కల్పన విషయంలో 1920-30 మధ్యకాలంలో నిరంతరం జరిపిన చర్చల ఫలితంగా పట్టణ ప్రాంతాల్లో మహిళలు ఓటు వేసేందుకు నాటి బ్రిటిష్ ప్రభుత్వం అంగీకరించింది. మన దేశంలో స్త్రీపురుషులకు మొట్టమొదటిసారి అధికారికంగా ఓటు హక్కు కల్పించిన ఘనత మద్రాస్ ప్రావెన్స్‌కే దక్కుతుంది. 1921లో మద్రాస్ ప్రావెన్స్‌లో అమల్లోకి వచ్చిన ఈ చట్టం ప్రకారం నాటి బ్రిటిష్ రికార్డుల్లో భూమిని ఆస్తిగా కలిగినవారు ఈ ఓటుహక్కుకు అర్హులని ఈ చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. విచిత్రమేమంటే ఈ చట్టంలో అక్షరాస్యత, భర్తలకు ఆస్తి హక్కు వంటి అంశాలపై విధించిన పరిమితుల కారణంగా దేశంలో పెద్ద సంఖ్యలో మహిళలు ఓటు హక్కుకు దూరంగానే ఉండిపోవాల్సి వచ్చింది. స్వాతంత్ర్యా నంతరం 1950లో భారత ప్రభుత్వం స్త్రీపురుషులకు అధికారికంగా ఓటు హక్కు కల్పించిన తర్వాత 1962లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 46.63% మంది మహిళలు తమ ఓటు హక్కును వినియో గించుకున్నారు. 1984 నాటికి ఇది 58.10%కి పెరిగింది. పురుషులు 1962లో 63.31% ఓటు హక్కు వినియోగించుకోగా 1984 నాటికి 68.18%కు పెరిగింది. ఈ శాతం క్రమంగా పెరుగుతూ 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించు కున్న మహిళల సంఖ్య, పురుషులను దాటిపోయింది. ఈ ఎన్నికల్లో 67.18% మహిళలు ఓటు హక్కును వినియోగించుకోగా, పురుషుల్లో ఇది 67.01% మాత్రమే. ఓటింగ్‌లో మహిళా చైతన్యానికి ఇది నిదర్శనం. ఇక అసెంబ్లీ ఎన్నికల విషయానికి వస్తే దేశంలోని 2/3 వంతు రాష్ట్రాల్లో మహిళల ఓటింగ్ పురుషుల కంటే అధికంగా నమోదు కావడం విశేషం.

## ఇప్పుడు దేశమే ఆమె కుటుంబం!

మహిళా బిల్లు ఆహ్వానించదగినదే. ఇదొక చారిత్రక ఘట్టం. ఈ హక్కును వినియోగించు కుంటూనే భారతీయ స్త్రీలు కుటుంబానికీ ప్రాముఖ్యమిస్తూ, సమయం చిక్కినప్పుడల్లా సమాజానికీ తన సహాయాన్ని అందించగలరు.

ప్రపంచంలో మిగిలిన ఏకైక ప్రకృతి ఆరాధనా సంస్కృతి సనాతన ధర్మం.

సనాతన ధర్మం భారతదేశ ఆత్మ.

ప్రకృతి ఆరాధనలో ప్రకృతి, ప్రకృతి స్వరూప మైన స్త్రీ ఆరాధన కూడా ఉంటాయి. ఒకప్పుడు ప్రపంచమంతా ప్రకృతి ఆరాధన ఉండేది.

అబ్రహాము/ ఎడారిలో కొత్త మతాలు పుట్టి ప్రకృతి ఆరాధన పద్ధతిని నాశనం చేసి తమ మతాన్ని రుద్దాయి.

అలా ప్రపంచంలో ఉన్న అన్ని ఆరాధన పద్ధతులు పోయి, ఎడారి మతాలు మాత్రమే మిగిలాయి. మహిళల వెనకబాటుతనం వీటితో జరిగిన చేటు.

భారతదేశంలో ఇంకా ప్రకృతి ఆరాధన సనాతన ధర్మ సంస్కృతి మిగిలి ఉండటానికి కారణం ఈ దేశ స్త్రీమూర్తులు. ఆ చరిత్రలో స్త్రీ అన్ని రంగాలలోను ముందంజలోనే కనిపిస్తుంది.

ఈ సంస్కృతిని కాపాడుతూ ముందు తరాలకు అందించే బాధ్యతని అలుపెరగకుండా కృషి చేస్తుంది సనాతని స్త్రీ.

యూరోప్, ఇంగ్లండ్, ఇటలీ, న్యూజీలాండ్ వంటి దేశాలు 18,19 శతాబ్ద కాలంలో మహిళల పోరాటాలు చూసి వారికి ఓట్ హక్కు ఇచ్చాయి.





**మౌనిక సుంకర**
**హైకోర్టు న్యాయవాది, తెలంగాణ**

ఆదే సమయంలో భారత్ బ్రిటిష్ అత్యాచారాలను వ్యతిరేకిస్తున్న తరుణం.

1947లో బ్రిటిష్ జాతి వెళ్లిపోయాక 1950లో భారతదేశ రాజ్యాంగ నిర్మాణం చేసుకున్నప్పుడు ఎలాంటి పోరాటాలు లేకుండానే ఈ దేశ స్త్రీలకు ఓటు హక్కు దక్కింది.

దానికి కారణం హిందూ సమాజం స్త్రీని సహజంగా దేవీ స్వరూపంగా చూడటం, ఈ సంస్కృతి ద్వారా ఆమెకు సముచిత స్థానం సమాజం ఇవ్వటమే.

అందుకే ఇందిరాగాంధీని భారతీయ సమాజం చాలా సులువుగా ప్రధానిగా ఒప్పుకుంది.

యూరోప్ వంటి దేశాల్లో ప్రకృతి ఆరాధనను అనుసరించే సమూహానికి చెందిన స్త్రీలను 'విచ్ హంటింగ్' పేరిట ఎడారి మత సిద్ధాంతులు సజీవ దహనం చేసేవారు.

అదే సమయంలో భారత్ లోని గురుకులాలలో రిషికలు ఉండేవారు, రిషిక అంటే నేటి ఉపాధ్యాయురాలు.

రిషికలు గురుకులాల్లో అన్ని అంశాలనూ బోధించేవారు.

భారత విద్యా వ్యవస్థలో విద్యార్థినుల శాతంతో పాటు శిక్షకుల శాతం కూడా ఎక్కువే.

క్షాత్రధర్మంలోనూ భారతీయ మహిళలు తమ సామర్థ్యాన్ని చూపించారు.

అవసరానికి అనుగుణంగా వంటింట గంటే తిప్పే భారతీయ స్త్రీ కలం, ఖడ్గం కూడా తిప్పగలిగే శక్తి స్వరూపిణి.

ఏ విధంగా చూసినా రాజకీయాల్లో కూడా స్త్రీలు రాణించగలరు.

కాకపోతే రాజకీయం అనేది హృదయంతో కాకుండా బుద్ధితో పనిచేయాల్సిన రంగం.

స్త్రీలు కఠిన నిర్ణయాలు తీసుకొని అందరి శ్రేయస్సు కోసం పని చేయాలి.

ఒకవేళ ప్రపంచం మొత్తం స్త్రీలే దేశాధినేతలుగా ఉంటే యుద్ధాలు జరగవు.

ఏ దేశం ఇంకో దేశం మీద యుద్ధం ప్రకటించవు గాక ప్రకటించవు.

స్త్రీల అంతరంగం కరుణతో నిండి ఉంటుంది.

పురుషుడు కరుణాంతరంగంతో ఆలోచించలేడు.

కాబట్టి క్షాత్ర ధర్మంలో స్త్రీలు ఉంటే ఆ దేశం సంపన్నంగా ఉంటుంది.

అది ప్రకృతికి అనుకూలం కూడా. ★

1974లో భారత్‌లోని 'యునైటెడ్ నేషన్స్ కమిషన్ ఆన్ ది స్టేటస్ ఆఫ్ ఉమెన్' స్థానిక సంస్థల్లో మహిళలకు పూర్తిస్థాయి రిజర్వేషన్లు కల్పించాలని కోరినప్పటికీ 1993లో నాటి పి.వి. నరసింహారావు ప్రభుత్వం 73, 74 రాజ్యాంగ సవరణలు తీసుకొచ్చే వరకు ఇది పూర్తిస్థాయిలో అమలుకాలేదు. ఈ రిజర్వేషన్ల కల్పన తర్వాత రాజకీయాల్లో అప్పటివరకు 4-5% మధ్యకే పరిమితమైన స్త్రీల భాగస్వామ్యం 25-40%కు పెరిగింది. అయితే ఆంధ్రప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కేరళ, మహారాష్ట్ర, ఒడిషా, రాజస్తాన్, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ఈ రిజర్వేషన్‌ను 50%కు పెంచడం గమనార్హం. నిజానికి 73వ రాజ్యాంగ సవరణకు ముందే మహిళలకు రిజర్వేషన్‌ను అమలు పరచిన ఘనత బిహార్ రాష్ట్రానికి దక్కుతుంది. 1992లో రాష్ట్రంలో 28,069 మంది మహిళలు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం వహించగా 1997 నాటికి వీరి సంఖ్య 28,595కు పెరగడం విశేషం. కానీ పేద మహిళలు పంచాయతీ సభ్యత్వ స్థానాలకే పరిమితం కావడం, సర్పంచ్ స్థానాల్లో అగ్రకుల మహిళలే ఉండటం ఇంకా కొనసాగుతున్నది.

**ప్రధాన పార్టీల్లో మహిళల స్థానం**

రాజకీయ భాగస్వామ్యం అంటే కేవలం 'ఓటింగ్'కు మాత్రమే పరిమితం కావడం కాదు. నిర్ణయాలు తీసుకోవడం, రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనడం, రాజకీయ చైతన్యం వంటివి కూడా ఇందులో భాగంగా ఉంటాయి. నిజం చెప్పాలంటే భారత్‌లో మహిళలు ఓటింగ్‌లో పాల్గొనడమే కాదు, వివిధ రాజకీయ పార్టీల్లో దిగువస్థాయిల్లో పురుషులతో పోలిస్తే వీరి సంఖ్యే అధికం! ఓటింగ్‌లో పాల్గొనడం, రాజకీయ చైతన్యం అనేవి మహిళలు రాజకీయాల్లో పాల్గొనడానికి బలమైన వేదికలు. దేశంలో ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లు ప్రధాన జాతీయ పార్టీలుగా కొనసాగుతున్నాయి. కమ్యూనిస్టు పార్టీలు గతంలో ప్రధాన జాతీయ పార్టీలుగా కొనసాగినా అవి తమ ప్రాభవాన్ని కోల్పోయి అవసానదశకు చేరుకున్నాయి. మహిళల విషయంలో ఈ మూడు పార్టీలు మంచి ప్రాధాన్యమిచ్చాయనే చెప్పాలి. భారతీయ జనతాపార్టీకి మహిళా మోర్చా, కాంగ్రెస్‌కు అఖిల భారత మహిళా కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాకు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ అనే పేర్లతో మహిళా విభాగాలున్నాయి. తొలినాళ్లలో కాంగ్రెస్ పేదరికంపై ప్రధానంగా దృష్టిపెట్టి సంక్షేమ పథకాలకే ప్రాధాన్యమిచ్చినప్పటికీ 2004తర్వాత పార్టీ తన పంథాను మార్చుకొని అన్ని స్థాయిల్లో 33% రిజర్వేషన్‌ను మహిళలకు అమలు చేసింది. 2009లో కాంగ్రెస్ లోక్‌సభకు తొలి మహిళా స్పీకర్‌ను నామినేట్ చేసింది. భారత తొలి మహిళా రాష్ట్రపతిగా ప్రతిభా పాటిల్ అభ్యర్థిత్వానికి మద్దతు పలికింది. ఇక భారతీయ జనతాపార్టీ వివిధ నాయకత్వ కార్యక్రమాలను అమలుపరచడం ద్వారా పార్టీలో మహిళా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించింది. 33% రిజర్వేషన్ ను అమలు చేయడమే కాకుండా పార్టీలో మహిళా నాయకులు వివిధ స్థాయిలకు పోటీ చేసేందుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని కూడా అందించింది. మత ప్రసక్తిలేని 'ఉమ్మడి పౌర చట్టానికి' మహిళల మద్దతును కూడగట్టడం బీజేపీ సాధించిన గొప్ప విజయం. ఎస్టీ వర్గానికి చెందిన ద్రౌపది ముర్ము రాష్ట్రపతి అభ్యర్థిత్వానికి మద్దతునిచ్చి, బీజేపీ దేశ చరిత్రలో ఇంకొక ఘనతకు చోటు కల్పించింది. 2007లో సుమన్ కృష్ణకాంత్ అధ్యక్షతన 'యునైటెడ్ ఉమెన్ ఫ్రంట్' ఏర్పాటైంది. పార్లమెంట్‌లో మహిళలకు 50% రిజర్వేషన్ కల్పించాలనేది ఈ వేదిక డిమాండ్.

2019 సాధారణ ఎన్నికల్లో తమిళనాడుకు చెందిన నామ్ తమిళర్ కచ్చి పార్టీ రాష్ట్రంలోని 40 లోక్‌సభ స్థానాల్లో 50శాతం సీట్లలో మహిళా అభ్యర్థులను రంగంలోకి దించి మహిళా సాధికారత పట్ల తన నిబద్ధతను చాటుకుంది. ఇంత జరిగినా ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు 1947 నుంచి ఇప్పటివరకు ప్రధానమంత్రిగా ఒకరు, రాష్ట్రపతిగా ఇద్దరు మహిళలే పనిచేయడం విషాదం.

1950 నుంచి ఇప్పటివరకు ఎన్నికల్లో పోటీచేసే మహిళల సంఖ్య ఏడురెట్లు పెరిగినప్పటికీ జనాభాపరంగా వారి ప్రాతినిధ్యం ఇంకా చాలా తక్కువే. దేశంలో మహిళా ఓటర్ల సంఖ్య పురుషుల ఓటర్లకు దాదాపు సమాన స్థాయికి చేరుకున్న తరుణంలో ఈ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందడం విశేషం. ప్రస్తుతం దేశంలో నమోదైన 950 మిలియన్ ఓటర్లలో సగం మహిళలే. గత కొన్ని దశాబ్దాలుగా పరిశీలిస్తే, ప్రతి ఎన్నికలకు మహిళా ఓటర్ల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అదీకాకుండా ఓటింగ్ విషయంలో పురుషులతో పోలిస్తే స్త్రీలు భిన్నంగా ఆలోచిస్తారు. ముఖ్యంగా పురుషులు యథాతథ స్థితి కొనసాగాలని భావిస్తే, స్త్రీలు మార్పు కోరుకుంటారు. బిహార్ వంటి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తీరును పరిశీలించిన నిపుణులు గమనించిన ప్రధాన అంశమిది.



బిహార్‌లో బీజేపీ మహిళా మోర్చా సంబరాలు

# దేశ శ్రేయస్సుకు అవసరం



**విజయభారతి**
హైకోర్టు న్యాయవాది, తెలంగాణ

నారీశక్తి వందనం పేరుతో మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందడం చాలా చాలా సంతోషకరమైన విషయం. 15 సంవత్సరాలు అమలులో ఉండే ఈ బిల్లు సెప్టెంబర్ 19న న్యాయ శాఖా మంత్రి రాం మెఘ్వాల్ మొదట లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

మన రాజ్యాంగంలో లింగ వివక్ష లేకుండా అందరికీ సమాన హక్కులు ఉండాలని స్వాతంత్రం సాధించుకున్న నాడే అనుకున్నాం. కానీ నేటికీ పార్లమెంటులో పురుషుల ఆధిపత్యమే కనిపిస్తున్నది. మహిళల సామర్థ్యం, నైపుణ్యం, మేధస్సు తన కుటుంబానికే కాదు సమాజానికీ, దేశానికీ కూడా చాలా అవసరం. పాలనాదక్షతతో రాజకీయ చతురతతో ఆర్థిక సంస్కరణలతో ఎందరో మహిళలు పరిపాలన అందించిన ఉదాహరణలు శతాబ్దాల మన చరిత్రలో ఎన్నో ఉన్నాయి. మహిళలు ఎందులోనూ వెనుకబడి లేరు. వెనక్కి ఉంచారు.

1989లో పట్టణ, స్థానిక సంస్థలలో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్‌కై పార్లమెంటులో ప్రవేశపెట్టబడిన బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందినా కింది సభలో మింగి వేశారు. రాజ్యాంగ సవరణ బిల్లు 72, 73 ద్వారా మళ్లీ ప్రవేశపెడితే గ్రామీణ పట్టణ స్థానిక సంస్థలలో 33% రిజర్వేషన్లు ఆమోదించడం జరిగింది.

ప్రస్తుతం రెండు లక్షల 50 వేల గ్రామ పంచాయతీలలో 14 లక్షల మంది మహిళా ప్రతినిధులు, 59 వేల మంది అధ్యక్షురాండ్రు ఉన్నారు. 50 శాతం మహిళలు పంచాయతీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. 75% పంచాయతీ ప్రతినిధులకు గ్రామం గురించి అవగాహన ఉన్నది. కేంద్ర ప్రభుత్వంలో 11 మంది మహిళలు మంత్రులుగా ఉన్నారు. దేశ జనాభాలో సగ భాగమైన మహిళల భాగస్వామ్యం అన్ని రంగాలలో ఉండాలి. రాజకీయాలు ఏమి అంటరానివి కాదు. విద్య వైద్య, ఆర్థిక,సాంస్కృతిక, సురక్ష రంగాలలో మహిళలకు అవగాహన ఉండదు అనేది పెద్ద పొరపాటు. అసలు ఈ రంగాలకు మహిళలే నాయకత్వం వహిస్తే దేశ పురోగతి ఇంకాస్త వేగంగా, సానుకూల దృక్పథంతో సాగుతుంది. ప్రభుత్వ ఆలోచనలు నిధులు, పథకాలు మొదలైన విషయాలు తెలుసుకోవడం, వాటి అమలుపై ఆలోచించడం, అమలు చేయించడం వంటివి మహిళలు సమర్థంగా చేయగలరు. ఈ అంశాలపై ఆందోళనలు, పోరాటాలు చేయడమే కాదు. ప్రజా చైతన్యం కూడా కలిగించే సత్తా ఉన్నవాళ్లు మహిళలు. ఇటువంటి చరిత్రాత్మకమైన బిల్లును తెచ్చిన నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఈనాటి మహిళాలోకం తన అభిమానాన్ని ప్రకటించాలి. ★

### రాజకీయ చైతన్యం

దేశంలో మహిళా సంస్థలు 1900 సంవత్సరంలోనే ప్రారంభమైనప్పటికీ వాటి పాత్ర నామమాత్రమే. 1950–70 మధ్యకాలంలో కూడా అవి నిర్వహించిన పాత్ర పరిమితమే. ఆ తర్వాతనే మహిళల్లో రాజకీయ చైతన్యం విస్తృతం కావడం గమనిస్తాం. మనదేశంలో మొట్టమొదటి మహిళా సంస్థ ‘భారత్ స్త్రీ మండల్’. ఇది 1910లో ఏర్పాటైంది. పురుషుల దాష్టీకానికి బలైన మహిళలను ఆదుకోవడమే లక్ష్యంగా అప్పట్లో నెలకొల్పారు. తొలినాళ్లలో మహిళా సంస్థలు పురుషుల సహకారంతోనే ఏర్పాటై, స్త్రీవిద్య, ఉపాధి వంటి అంశా లకు మాత్రమే పరిమితమయ్యాయి. 1927లో ఏర్పాటైన ‘ఆల్ ఇండియా ఉమెన్ కాంగ్రెస్’ (ఎఐడబ్ల్యుసి) దేశంలో ప్రముఖంగా చెప్పుకోదగ్గ మహిళా సంస్థ. ఈ సంస్థకు దేశ వ్యాప్తంగా 500 శాఖలుండేవి. శారదా చట్టం, మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ , హిందూ కోడ్ బిల్లులు అమల్లోకి రావడంలో ఈ సంస్థ కీలకపాత్ర పోషించింది. స్త్రీవిద్యకు అత్యంత ప్రాముఖ్యమిచ్చి సంస్థ తన కార్యకలాపాలు కొనసాగించడం ద్వారా1952, 1960 మధ్య కాలంలో హిందూ కోడ్ బిల్లులు అమల్లోకి రావడంలో కీలకపాత్ర పోషించింది.

1970 దశకంలో దేశంలో స్త్రీవాదం ఊపందుకుంది. 1974 లో దేశంలో మహిళల స్థితిగతులపై ఏర్పాటుచేసిన కమిటీ సమర్పించిన నివేదిక తర్వాతికాలంలో స్త్రీపురుష సమానత్వంకోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి దోహదపడింది. ముఖ్యంగా మహిళల్లో నిరక్షరాస్యత, శిశు మరణాలు,

# లింగవివక్షపై కొన్ని నిజాలు



- 2022 సెప్టెంబర్‌లో యు.ఎన్. ఉమెన్ ఒక నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం ప్రస్తుత ప్రగతి వేగంతోనే ముందుకు సాగితే, పూర్తిస్థాయి లింగ సమానత్వ సాధనకు 300 ఏళ్లు పడుతుంది!
- 2015లో ప్రపంచ లక్ష్యాలపై సంతకాలు చేసిన తర్వాత కూడా లింగ సమానత్వం విషయంలో ప్రపంచం సాధించిన ప్రగతి చాలా స్వల్పం.
- అప్పటినుంచి ప్రపంచంలోని 1/3వ వంతు దేశాల్లో ఈదిశగా సాగిన ప్రగతి శూన్యం. 18 దేశాల్లో లింగ సమానత మరింత దిగజారింది. వెనీజులా, అఫ్ఘానిస్తాన్, బెలారస్, కువైట్, ఈక్వెడార్ దేశాల్లో పరిస్థితి మరింత దారుణస్థితికి చేరుకుంది.
- 2022లో లింగ సమానత్వం విషయంలో అత్యంత అథమస్థితిలో ఉన్న దేశాలు సూడాన్, యెమెన్, అఫ్ఘానిస్తాన్, చాద్.
- ప్రపంచ వ్యాప్తంగా 380 మిలియన్ల మహిళలు దుర్భర దారిద్ర్యంలో బతుకులీడుస్తున్నారు.
- ఇప్పటికీ చాలా ప్రపంచ దేశాల్లో గర్భస్రావంపై పరిమితులుండగా, మరికొన్ని దేశాల్లో దీన్ని చట్టవిరుద్ధంగా పరిగణిస్తున్నారు. లైంగిక, ప్రత్యుత్పత్తి వ్యవస్థల ఆరోగ్యం, హక్కులు అనేది లింగ సమానత మిషన్‌కు అత్యంత కీలకం. కానీ 1.2బిలియన్ల (15–49 మధ్య వయస్కులు) మహిళలు ఇటువంటి దేశాల్లో దుర్భర జీవనం గడుపుతున్నారు. గర్భస్రావాన్ని పూర్తిగా నిషేధించిన దేశాల్లో ఉన్న మహిళల సంఖ్య 102 మిలియన్లు.
- ఏటా ప్రపంచవ్యాప్తంగా నాలుగు మిలియన్ల 18 సంవత్సరాల లోపు వయస్కులైన బాలికల వివాహాలు జరుగుతున్నాయి. ప్రపంచంలోని చాలాదేశాల్లో ఇంకా బాల్యవివాహాల పీడ వదలడంలేదు.
- 2021 ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం ప్రపంచంలో 20–24 మధ్య వయస్కులైన మహిళల్లో ప్రతి ఐదుగురిలో ఒకరు 18 సంవత్సరాల లోపు వివాహమైనవారే. బంగ్లాదేశ్ లోని ధనవంతులైన వారి కుటుంబాలకు చెందిన ఆడపిల్లలకు బలవంతంగా బాల్యవివాహాలు చేస్తున్నారు. అమెరికాలో క్రైస్తవ కుటుంబాలకు చెందిన బాలికలు బాల్యవివాహ బాధితులే. మయన్మార్‌లో నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికలను చైనాలో పెద్ద వయస్కులతో బలవంతంగా వివాహాలు జరుపుతున్నారు.
- 2030 నాటికి బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టాలంటే ప్రస్తుతం కొనసాగుతున్న ప్రగతి వేగం కంటే 17రెట్లు ఎక్కువ వేగం అవసరం.
- ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఐదు నిమిషాలకు ఒక మహిళ లేదా బాలిక హత్యకు గురవుతున్నారు.
- 2021 చివరినాటికి ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రతికూల పరిస్థితుల వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో స్వస్థలాలను వీడి మరోచోట జీవిస్తున్న మహిళల సంఖ్య 44 మిలియన్లు. ★

---

స్త్రీపురుష నిష్పత్తిలో తేడా, పేదరికం వంటి అంశాలను ఈ నివేదిక ప్రధానంగా ప్రస్తావించింది. ఈ అంశాలు తర్వాతి కాలంలో ఉమ్మడి పౌరసత్వం, మహిళా రిజర్వేషన్ బిల్లు, మహిళల పట్ల లైంగిక హింస వంటి అంశాలను ప్రధానంగా లేవనెత్తడానికి దోహదం చేసింది. 1970 నాటి చిప్కో ఉద్యమాన్ని మనదేశంలో విజయవంతమైన మహిళా ఉద్యమంగా పేర్కొంటారు. ఉత్తరాఖండ్‌లో అడవుల నరికివేతకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమం ఇది. 1972లో మధుర అత్యాచార కేసు, 1979లో తర్వీందర్ కౌర్ వరకట్న హత్య, 1987లో రూప్‌కన్వర్ సతీసహ గమనం, 1992లో భన్వారీదేవిపై జరిపిన సామూహిక అత్యాచారం, 2012లో న్యూఢిల్లీలో జరిగిన సామూహిక అత్యాచార సంఘటనల నేపథ్యంలో మహిళా ఉద్యమాలు, స్త్రీలపై జరిగే అత్యాచారాలపై ప్రధానంగా దృష్టి సారించి పోరాటం సలిపాయి.

**ప్రపంచ దేశాల్లో మహిళల స్థానం**

ప్రస్తుతం మొత్తం 15 దేశాలకు అధినేతలుగా, 16 దేశాల్లో ప్రభుత్వంలో అత్యున్నత స్థానాల్లో మహిళలు కొనసాగుతున్నారు. ఆరుదేశాల్లో మహిళల ప్రాతినిధ్యం 50% లేదా అంతకు మించి ఉంది. అవి వరుసగా రువాండా (61%), క్యూబా (53%), నికరాగువా (52%), మెక్సికో (50%), న్యూజిలాండ్ (50%), యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (50%). 23 దేశాలు 40% లేదా అంతకుమించి మహిళలకు ప్రాతినిధ్యం కల్పిస్తున్నాయి. వీటిల్లో 13 యూరప్, ఆరు ఆఫ్రికా, మూడు లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలు, ఒక ఆసియా దేశం ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా పరిశీలిస్తే రువాండా పార్లమెంట్‌లో అత్యధికంగా అంటే మొత్తం 80 స్థానాల్లో 49 మంది మహిళా సభ్యులు (61%) ఉన్నారు. దక్షిణాఫ్రికా (46.2%), ఆస్ట్రేలియా (38.4%), ఫ్రాన్స్ (37.8%), జర్మనీ (35.1%), యు.కె (34.5%), కెనడా (30.7%), యు.ఎస్ (28.7%)ల్లో మహిళా ప్రాతినిధ్యం ఫరవాలేదనుకున్నా దక్షిణ కొరియా (19.1%), బ్రెజిల్ (17.5%), జపాన్ (10%)ల్లో క్రమంగా దిగజారడం గమనార్హం.

ఇక మన పొరుగుదేశం పాకిస్తాన్ 2002లో మహిళలకు మొత్తం 357 సీట్లలో 60 (17%) రిజర్వ్ చేసింది. ఫిలిప్పీన్స్ దిగువసభలోని మొత్తం 311 సీట్లలో 85 (29%) మంది మహిళా ప్రతినిధులు న్నారు. ఆగ్నేయాసియా దేశాల్లో మహిళా ప్రాతినిధ్యం అధికంగా కలిగిన దేశం ఫిలిప్పీన్స్. ఇక బంగ్లాదేశ్ విషయానికొస్తే మొత్తం 350 స్థానాల్లో 50 సీట్లు మహిళలకు రిజర్వ్ చేశారు. బంగ్లాదేశ్ దిగువ సభ జాతీయ సంసద్‌లో ప్రస్తుతం 73 (20%) మంది మహిళా ప్రతినిధులుండటం విశేషం. 1990 ప్రాంతం లో నేపాల్, అర్జెంటీనాలు రాజకీయ పార్టీలు మహిళలకు రిజర్వ్ చేయాల్సిన కనీస కోటాను నిర్దేశించాయి. విశేషమేమంటే ఫ్రాన్స్, దక్షిణకొరియా, నేపాల్‌లు అభ్యర్థుల జాబితాలో మహిళలకు 50శాతం వరకు గరిష్ఠంగా నిర్దేశించడం విశేషం. అర్జెంటీనా, కోస్టారికా వంటి దేశాలు తమ రాజకీయ పార్టీలు మహిళలకు కేటాయించాల్సిన కోటాలను నిర్దేశించాయి. ప్రస్తుతం ఈదేశాల్లో 36శాతం మహిళల ప్రాతినిధ్యం ఉంది. దక్షిణాఫ్రికా, జర్మనీ, స్వీడన్ దేశాల్లోని రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా తమకు తామే మహిళలకు కోటాలను అమలుచేస్తూ, అత్యధిక మహిళా ప్రాతినిధ్యానికి దోహదం చేస్తున్నాయి. ఎరిట్రియా, టాంజానియా వంటి దేశాల్లో కూడా మహిళలకు నిర్దిష్ట కోటాలు కొనసాగుతున్నాయి.

2021 నాటికి 132 దేశాలు మహిళలకు కోటాను అమలుచేస్తుండగా, ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా దిగువ సభల్లో మహిళల నగటు ప్రాతినిధ్యం 26.7% శాతం కాగా స్థానిక సంస్థల్లో 35.5%. నిజానికి పార్లమెంట్‌లో మహిళా ప్రాతినిధ్యం విషయంలో అమెరికా, యు.కె. దేశాలతో పాటు భారత్‌కు కూడా ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ చరిత్ర ఏమీ లేదు. లోక్‌సభలో మహిళా ప్రాతినిధ్యం విషయంలో 185 దేశాల్లో మనదేశం స్థానం 141. ఇది చాలు స్త్రీలపట్ల మన వైఖరి ఎట్లా ఉన్నదనేది తెలుసు కోవడానికి! ఇప్పుడు 33% రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా అంతర్జాతీయంగా మనదేశ స్థానం గణనీయంగా మెరుగుపడుతుందనడంలో సందేహం లేదు. ★

# నిన్న పాకిస్తాన్..

**ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఎదుర్కొంటామని ప్రగల్భాలు పలికే దేశాలకు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డది. తాము చేస్తే ఒప్పు, ఇతరులు చేస్తే తప్పు ఎలా అవుతుందో చెప్పలేకపోతున్నాయి. తమ దేశ పౌరుని హత్యలో భారత్ ప్రమేయం ఉందని ప్రకటించి, కెనడా తాను తీసిన గొయ్యిలో తానే పడింది. ఖలిస్తానీ ఉగ్రవాదులకు కెనడా స్వర్గధామమని భారత్ ఎత్తి చూపడంతో ప్రపంచం ముందు దోషిగా నిలిచింది. భారత్‌తో పెట్టుకోవడం సింహం నోట్లో తల పెట్టడమేనని మిత్రదేశాలు స్పష్టం చేయడంతో ఇరకాటంలో పడింది. భారత్‌తో దౌత్య సంబంధాలు దెబ్బతిన్న క్రమంలో ప్రధాని జస్టిన్ ట్రూడో స్వదేశంలోనూ ప్రతిష్ట కోల్పోయారు.**

ప్రపంచం మారిపోతోంది. పాశ్చాత్య దేశాలు ఉనికిని కోల్పోతున్నాయి. భారత్ ప్రపంచ ఆర్థిక శక్తుల్లో ఒకటిగా అడుగులేస్తోంది. నిన్నటి దాకా అగ్రదేశాలు ఇప్పుడు పెత్తనాన్ని వదులుకుంటు న్నాయి. ఈ పరిణామాన్ని కొన్ని దేశాలు జీర్ణించు కోలేకపోతున్నాయి. భారత్‌కు పాకిస్తాన్, చైనా శత్రువులని సగటు భారతీయులు భావిస్తుంటారు. కానీ కెనడా వంటి గుంటనక్కలు తామూ ఉన్నామని చాటుకున్నాయి.

భారతదేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాదులను ఉసిగొల్పిన పాకిస్తాన్ పరిస్థితి ఎలా మారిందో తెలుసు. ఇప్పుడు కెనడా కూడా అదే దారిలో ఉంది. ఓటు బ్యాంకు రాజకీయాలతో ఖలిస్తాన్ ఉగ్రవాదు లకు వత్తాసు పలుకుతున్న కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో దేశాన్ని ప్రమాదంలోకి నెట్టారు. పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ ప్రోద్బలంతో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడి పారిపోయిన ఖలిస్తాన్ వాదులకు కెనడా ఆశ్రయం ఇచ్చింది. ఈ వైఖరికి అంతర్జాతీయ సమాజం నివ్వెరపోతోంది. ఖలిస్తాన్ ఉగ్రవాదులకు పాకిస్తాన్ ఐఎస్ఐతో మాత్రమే కాదు. లష్కరే తాయిబాతో కూడా సంబంధాలున్నట్లు బయటపడింది. కెనడాలో ఉంటున్న ఖలిస్తానీ ఉగ్రవాది అర్ష్‌దీప్ దల్లా (27)కు లష్కరే తాయిబాతో సంబంధాలున్నట్లు ఢిల్లీ పోలీసులు గుర్తించారు. పంజాబ్‌లో ఉన్న హిందూనేతలే లక్ష్యంగా దాడులు జరపాలని అర్ష్‌దీప్ కుట్రలు పన్నాడు.


భారత్-కెనడా మధ్య విభేదాలు ఒక్కసారిగా భగ్గుమనడానికి కారణం ఏమిటి? నిషేధిత ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ (కేటీఎఫ్) నేత హర్‌దీప్‌సింగ్ నిజ్జర్‌ను ఈ ఏడాది జూన్ 18న కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపారు. నిజ్జర్ భారత్‌లో ఉగ్రవాద చర్యలకు పాల్పడి అక్కడకు చేరినవాడే. హత్య వెనుక భారత ప్రభుత్వ ఏజెంట్ల పాత్ర ఉండొచ్చని ట్రూడో చేసిన ఆరోపణలతో భారత్, కెనడా మధ్య నెలకొన్న దౌత్యపరమైన ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో జరిగిన 78వ సర్వసభ్య సమావేశంలో ట్రూడో పాల్గొన్నారు. నిజ్జర్ హత్యలో భారత్ పాత్ర, ఈ విషయంపై భారత్ ఖండన గురించి స్పందించాలని పీటీఐ వార్తా సంస్థ కోరింది. ట్రూడో నోరు విప్పకుండానే వెళ్లిపోవడం గమనార్హం. భారత్‌తో బంధం తమకు ముఖ్యమైనదే అయినప్పటికీ తమ చట్టాలను గౌరవించడం, దేశ పౌరులను రక్షించుకోవడం తమ బాధ్యత అని కెనడా రక్షణ మంత్రి బిల్ బ్లెయిర్ అంటున్నారు. మరి కెనడా గడ్డ మీద భారత్‌కు వ్యతిరేకంగా కుట్రలు జరుగు తుంటే మనం ఎలా ఊరుకోగలం?

ట్రూడో ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమేనని దుయ్యబట్టారు కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి. ట్రూడో పార్లమెంటులో మాట్లాడిన తర్వాత అక్కడి భారత దౌత్యకార్యా లయంలో పనిచేస్తున్న ఇంటెలిజెన్స్ విభాగం అధిపతి పవన్ కుమార్‌రాయ్‌ను బహిష్కరించినట్లు ప్రకటించారు. భారత్ కూడా ఘాటుగానే స్పందిం చింది. ఇక్కడి కెనడా హైకమిషనర్ కామెరూన్ మెక్‌కేను పిలిపించి, కెనడా ఇంటెలిజెన్స్ సంస్థ అధికారి ఒలీవియర్ సిల్వెస్టర్ ఐదు రోజుల్లోగా దేశాన్ని వీడి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. భారత్‌కు వచ్చే కెనడా పౌరులకు వీసాల జారీని కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. అంతకుముందు కెనడా ప్రభుత్వం సైతం భారత్‌లో పర్యటిస్తున్న తమ దేశ పౌరులు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఈ నేపథ్యంలో భారత్ సైతం కెనడాలో ఉండే భారతీయు లకు అడ్వైజరీ జారీ చేసింది.

సెప్టెంబర్ 11, 2001న అమెరికా మీద అల్ కాయిదా దాడి చేసింది. తరువాత అమెరికా అల్ కాయిదాకు ఆశ్రయం ఇస్తున్న అఫ్ఘానిస్తాన్‌పై నాటో దళాలతో కలిసి ప్రతిదాడి చేసింది. పాకిస్తాన్‌లో ఆశ్రయం పొందిన ఒసామా బిన్ లాడెన్‌ను హత మార్చింది. మరో అల్‌ఖైదా నాయకుడు అల్ జవహరిని గుట్టుగా మట్టుపెట్టేసింది అమెరికా. ఇరాక్‌లో ఆ దేశ మిలిటరీ జనరల్ ఖాసిం సులేమాని డ్రోన్ దాడిలో చనిపోయారు. ఇదీ అమెరికా పనే. ఈ అన్ని సందర్భాల్లోనూ చెప్పిన కారణం ఆత్మరక్షణే.

# తండ్రీకొడుకులు ఇద్దరూ ఖలిస్తాన్ మద్దతుదారులే

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోది మొదటి నుంచి ఖలిస్తాన్ అనుకూల వైఖరే. ఆయన ప్రభుత్వాన్ని కాపాడు తున్నది ఖలిస్తానీ మద్దతుదారు న్యూ డెమొక్రటిక్ పార్టీ. దాని నాయకుడు జగ్మీత్ సింగ్ ధాలివాల్ (జిమ్మీ). 2021 ఎన్నికల్లో తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన మెజారిటీ ట్రూడోకు చెందిన లిబరల్ పార్టీకి రాలేదు. మొత్తం 338 స్థానాలకు 150 మాత్రమే వచ్చాయి. 24 సీట్లు దక్కించుకున్న న్యూ డెమొక్రాటిక్ పార్టీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దీనితో జగ్మీత్ పార్టీ బలమైన శక్తిగా మారింది.


పిరె ట్రూడో

జస్టిన్ ట్రూడో కాలంలో భారత్-కెనడా సంబంధాలు మునుపెన్నడూ లేనంతగా దిగజారాయని మనం భావిస్తున్నాం. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం- జస్టిన్ ట్రూడో తండ్రి పిరె ట్రూడో కూడా ఖలిస్తానీల విషయంలో ఇలాగే అనుకూల వైఖరి అవలంబిం చారు. భారత్‌తో ఇలాగే ఘర్షణ పంథాలో నడిచారు. 300 మందికిపైగా భారతీయ ప్రయాణికులతో కూడిన కనిష్క విమానాన్ని గాల్లోనే ఉగ్రవాదులు పేల్చటానికి పరోక్షంగా కారణమయ్యారు. ఆ ఘటనపై విచారణ జరిపిన జస్టిస్ జాన్ మేజర్ కమిషన్ కూడా కెనడా నిఘా విభాగాన్ని, పోలీసులను, అధికారులను తీవ్రంగా తప్పుబట్టింది.

ఈ విమానం పేల్చివేతకు కారణమైన బబ్బర్ ఖల్సా సభ్యుడు తల్వీందర్ సింగ్ పర్మార్‌ను అప్పగించాలని భారత్ చేసిన అభ్యర్థనను పిరె ట్రూడో తోసిపుచ్చారు. కనిష్క పేలుడుకు కారణమైన పర్మార్‌ను, ఇతరులనూ కెనడా ప్రభుత్వం అరెస్టు చేసింది. ఇందర్‌జిత్ సింగ్ అనేవాడికి 15 ఏళ్ల జైలుశిక్ష విధించి, మిగిలినవారిని వదిలేసింది. 1974లో పోఖ్రాన్‌లో భారత్ అణుపరీక్ష నిర్వహించ డాన్ని కూడా పిరె ట్రూడో వ్యతిరేకించారు.

# ఇవాళ కెనడా



ట్రూడో, జగ్మీత్ సింగ్

లాడెన్‌ను చంపిన ఘటనలో కెనడా కూడా పాత్రధారి. ఈ ఆపరేషన్‌ను ఇరు దేశాల అధినేతలు లైవ్‌లో తిలకించి ఆనందించారు. నిజ్జర్ కూడా ఉగ్రవాదే. కెనడాలో ఆశ్రయం పొందుతూ అక్కడి ఉగ్ర ముఠాల ఆధిపత్యపోరులో మరణించాడు. ఈ విషయంలో భారత్ మౌనం వహించింది. నిజ్జర్ విషయంలో భారత్ అలాంటి ఆత్మరక్షణ వాదన కూడా చేయటం లేదు. ఎంతో మంది హత్యలకు కారణమైన ఒక ఉగ్రవాది చనిపోతే దాన్ని భారత్‌కు ఆపాదించడం ఏమిటి? హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యపై కెనడాకు అమెరికాయే నిఘా సమాచారం అందించిందని 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక పేర్కొంది. అయితే ఇందులో భారత్ పాత్ర ఉందన్న విషయాన్ని మాత్రం కెనడా నిఘావర్గాలే కనుగొన్నాయని తెలిపింది. భారత దౌత్యవేత్తల సంభాషణల సమాచారం ఆధారంగా ట్రూడో ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చిందని ఆ కథనంలో వెల్లడించింది. మరోవైపు జీ7 దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో కూడా నిజ్జర్ హత్య నిందను భారత్‌పై రుద్దాలని కెనడా చేసిన పయత్నాలు బెడిసికొట్టాయి. ఈ సందర్భంగా విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో నిజ్జర్ హత్య అంశాన్ని ఖండించే విషయాన్ని చేర్చాలని కెనడా చేసిన లాబీయింగ్ విఫలమైంది. ప్రస్తుతం ఈ గ్రూప్‌నకు జపాన్ అధ్యక్షత వహిస్తోంది.

ట్రూడో ఆరోపణలను అమెరికా విదేశాంగశాఖ నిపుణులు ఖండించారు. కెనడా కావాలా, ఇండియా కావాలా? అనేది తేల్చుకోవాల్సి వస్తే అమెరికా కచ్చితంగా భారత్ వైపే ఉంటుందన్నారు పెంటగాన్ మాజీ అధికారి మైఖేల్ రూబిన్. ప్రధాని హోదాలో జస్టిన్ ట్రూడో ఎక్కువ కాలం కొనసాగకపోవచ్చు. ఆయన వెళ్లిపోయిన తర్వాత కెనడాతో మా బంధాన్ని పునర్నిర్మించుకుంటాం అని తెలిపారు మైఖేల్. అమెరికాలోని అత్యధిక సిక్కుల వాణికి ఖలిస్తాన్ ఉద్యమం ప్రాతినిధ్యం వహించడం లేదని 'సిక్స్ ఫర్ అమెరికా' వ్యవస్థాపకుడు జెస్సీ సింగ్ చెప్పారు. భారత్ సిక్కులు ఖలిస్తాన్‌కు అనుకూలం కాదన్నారు. ఈ నేపథ్యంలోనే కెనడాలో నివసిస్తున్న హిందువులు దేశం విడిచి వెళ్లిపోవాలని న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తున్న సిక్కు వేర్పాటువాది గుర్‌పత్వంత్ సింగ్ పన్నూ సంచలన వ్యాఖ్యలు చేశాడు. కానీ 'ఈ వీడియో అభ్యంతరకరం, విద్వేషపూరితం. అది మేం పాటించే విలువలకు విరుద్ధం. విద్వేషాలు, దురుసు చర్యలు, బెదిరింపులు, అభద్రత, భయాలకు కెనడాలో చోటు లేదు. ఇక్కడ ప్రతి ఒక్కరూ.. పరస్పరం గౌరవించుకుంటూ చట్టాలను పాటించాలి' అని కెనడా ప్రజా భద్రతా విభాగం పేర్కొంది. కెనడాతో దౌత్య సంబంధాల నిలిపివేత నేపథ్యంలో భారత్‌లో జాతీయ దర్యాప్తు సంస్థ ఖలిస్తానీ ఉగ్రవాద నేతల ఆస్తులపై దాడులు ఆరంభించింది.

ఢిల్లీలో జరిగిన జీ20 సదస్సులోను కెనడా ప్రధాని ట్రూడో వ్యవహారశైలి భిన్నంగా కనిపించింది. భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రెసిడెన్షియల్ సూట్‌లో ఉండేందుకు నిరాకరించారు. దీనిపై భారత నిఘా వర్గాలు ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. భారత రాష్ట్రపతి ఇచ్చిన విందుకు కూడా హాజరు కాలేదు. రాజ్‌ఘాట్ దగ్గర జరిగిన కార్యక్రమంలోనూ అంటీ అంటనట్లుగానే ఉన్నారు. ట్రూడో మన ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఖలిస్థానీ సానుభూతిపరుల దుశ్చర్యల పట్ల మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఖలిస్తానీ నిరసనలపై ఇద్దరం మాట్లాడుకున్నట్లు ట్రూడో కూడా మీడియాకు తెలిపారు. సదస్సు ముగిసిన తర్వాత కెనడా ప్రధాని ఆలస్యంగా స్వదేశానికి బయల్దేరారు.

భారత్‌తో వివాదం ముదురుతున్న వేళ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు స్వదేశంలో షాక్ తగిలింది. ప్రధానిగా ఆయన ప్రతిష్ఠ దారుణంగా పడిపోయింది. ప్రధానిగా ప్రతిపక్ష నేత పియరీ పొయిలివ్రే వైపు దాదాపు 40శాతం మంది కెనడా ప్రజలు మొగ్గు చూపారు. గ్లోబల్‌న్యూస్ అనే సంస్థ నిర్వహించిన పోల్స్‌లో ఈ విషయం వెల్లడైంది. కెనడాలో ఖలిస్తానీ ఉగ్రవాద కార్యకలాపాలపై చర్యలు తీసుకోకపోవ డానికి తమ పార్టీదే బాధ్యత అని ట్రూడోకు చెందిన లిబరల్ పార్టీ సభ్యులూ అంగీకరిస్తున్నారు. ఉగ్ర వాదుల బెదిరింపులతో హిందువుల్లో భయం నెలకొందని భారత సంతతికి చెందిన అధికార పార్టీ ఎంపీ చంద్ర ఆర్య వ్యాఖ్యానించారు. 'ఖలిస్థాన్ ఉద్యమం అనేది హింసతో కూడుకున్నది. 38 ఏళ్ల క్రితం జరిగిన ఎయిరిండియా బాంబు దాడి ఘటన చరిత్రలోనే అతిపెద్ద సామూహిక హత్యాకాండ. దానిని కెనడియన్లు మరచిపోయారు. ఇందిరాగాంధీ కటౌట్‌ను ఊరేగించడం లాంటి భావ ప్రకటనా స్వేచ్ఛను ఏదేశం అంగీకరిస్తుంది? హిందూ కెనడియన్లు కెనడా వీడి పోవాలంటూ గురుపత్వంత్ సింగ్ పన్నూ హెచ్చరించినప్పటికీ చర్యలు తీసుకోక పోవడం శోచనీయం' అని చంద్ర ఆర్య పేర్కొన్నారు.

తాజా వివాదాలతో భారత్– కెనడాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలకు బ్రేక్ పడింది. ఇరు దేశాల మధ్య రాజకీయ విభేదాలు పరిష్కారమైన తర్వాతే ఈ చర్చలను పునఃప్రారంభిస్తామని భారత్ స్పష్టంగా చెప్పింది. ఇరుదేశాల మధ్య దాదాపు 200 విద్యా సంస్థలు భాగస్వామ్యం కలిగి ఉన్నాయి. 3.19 లక్షల మంది భారతీయ విద్యార్థులు కెనడా విద్యాసంస్థల్లో నమోదు చేసుకున్నారు. 2021లో కెనడా ఆర్థిక వ్యవస్థకు భారతీయ విద్యార్థుల ద్వారా మొత్తం 4.9 బిలియన్ డాలర్లు (సుమారు రూ.40వేల కోట్లు) సమకూరింది.

కొన్నేళ్లుగా భారత్– కెనడాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం గణనీయంగా పెరిగింది. 2022–23 నాటికి 8.16 బిలియన్ డాలర్లకు చేరింది. కెనడాకు ఫార్మా ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు, టెక్స్‌టైల్స్ పనిముట్లను భారత్ ఎగుమతి చేస్తుంది. వీటి విలువ 4.1 బిలియన్ డాలర్లు. కాగా కెనడా నుంచి భారత్‌కు పప్పులు, కలప, కాగితం, మైనింగ్ ఉత్పత్తులు దిగుమతి అవుతాయి. మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, టెక్నాలజీ, ఆర్థిక సేవల విభాగాల్లో భారీగా పెట్టుబడులు ఉన్నాయి. ఇలా 2022 చివరి నాటికి 45 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టినట్లు అంచనా. కెనడా విదేశీ పెట్టుబడులను ఆకర్షించే నాలుగో దేశంగా భారత్ నిలుస్తోంది. అయితే జీ20 సదస్సు వేళ చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు స్వేచ్ఛా వాణిజ్య సంప్రదింపులకు బ్రేకులు వేశాయనే చెప్పొచ్చు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# 'కమిషన్' చెలగాటం అభ్యర్థుల సంకటం

**తెలంగాణ ప్రభుత్వం వేలాది మంది నిరుద్యోగులను ఇంకోసారి భంగపాటుకు గురిచేసింది. ప్రతిష్ఠాత్మకమైన గ్రూప్-1 పోటీ పరీక్ష రెండోసారి కూడా రద్దయ్యింది. రూ. లక్షలు ఖర్చుచేసి నెలలు, సంవత్సరాల పాటు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయిన అభ్యర్థులకు ఈ పరిణామం శరాఘాతమైంది. ఈ వ్యవహారం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి న్యాయస్థానం ముందు బొక్కబోర్లా పడింది.**




తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో దారుణంగా విఫలమైందని రాష్ట్ర హైకోర్టు వ్యాఖ్యానించింది, నోటిఫికేషన్‌కు విరుద్ధంగా పరీక్ష నిర్వహించారని, బయోమెట్రిక్ సహా భద్రతా ఫీచర్లన్నీ పట్టించుకోలేదని ఉన్నత న్యాయ స్థానం పేర్కొంది.

అభ్యర్థుల సంతకాల్లో తేడాలను గుర్తించడం లోనూ టీఎస్‌పీఎస్సీ విఫల మైందని, అత్యంత పకడ్బందీగా నిర్వహించాల్సిన పరీక్షల్లో 258 మంది ఓఎంఆర్ షీట్లు అదనంగా ఎలా జతచేశారని న్యాయస్థానం ప్రశ్నించింది. ఈ విషయాన్ని టీఎస్‌పీఎస్సీ కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొనకపోగా, తప్పుడు వివరాలతో కౌంటర్ దాఖలు చేసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఏడాది జూన్ 11వ తేదీన నిర్వహించిన పరీక్షను రద్దు చేస్తున్నామని, నోటిఫికేషన్ ప్రకారం పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఆదేశిస్తూ హైకోర్టు వెలువరించిన తీర్పు ప్రభుత్వానికి మరోసారి చెంపపెట్టులా పరిణమించింది.

టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలను అమలు చేయలేదని, బయోమెట్రిక్ తీసుకోకుండా పరీక్ష నిర్వహించినందున పరీక్షను రద్దు చేయాలని కోరుతూ పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై ఇరువర్గాల వాదనలను విన్న జస్టిస్ పి.మాధవీదేవి నేతృత్వంలోని ధర్మాసనం ఆగస్టు 3న రిజర్వు చేసిన తీర్పును, సెప్టెంబర్ 23న వెలువరించింది.

**ఇదీ టీఎస్‌పీఎస్సీ బండారం**

నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా బయో మెట్రిక్ తదితర సెక్యూరిటీ ఫీచర్లను అమలు చేయలేదని, పరీక్ష నిర్వహణలో టీఎస్పీఎస్సీ దారుణంగా విఫలమైందని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది గిరిధర్‌రావు, న్యాయవాది బి.నర్సింగ్ వాదనలు వినిపించారు. నోటిఫికేషన్‌ను అమలు చేయకుండా నిర్వహించిన పరీక్ష చెల్లదని, దానిని రద్దు చేయాలని కోరారు. గత ఏడాది అక్టోబరులో మొదటిసారి గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించినప్పుడు హాల్ టికెట్లపై హోలోగ్రాం వంటి సెక్యూరిటీ ఫీచర్లు ఉన్నాయని, ఆ పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా రద్దయిందని, పేపర్ లీకేజీ వ్యవహారం బయటపడ్డ తర్వాత టీఎస్‌పీఎస్సీ మరింత అప్రమత్తంగా ఉండాల్సి ఉండగా.. ఆలస్య మవుతోందని, ఖర్చు ఎక్కువ అవుతుందన్న కారణంతో భద్రతా ఫీచర్లను ఎత్తేసిందని, ఇది చెల్లదని వాదించారు. ఐడీ ప్రూఫ్‌ల తనిఖీ.. సంతకాల తనిఖీ సరిగా జరగలేదని, అంతా ఇన్విజిలేటర్లే చూసుకున్నారని చెప్పడం సరికాదని, దరఖాస్తు చేసినప్పటి అభ్యర్థుల సంతకాలకు, నామినల్ రోల్స్‌లో పెట్టిన సంతకాలకు సరిపోలేదని, ఈ విషయాన్ని ఏ ఇన్విజిలేటర్ కూడా గుర్తించలేదంటే తప్పు జరిగినట్లే అని, చిన్న తప్పు అయినా.. పెద్ద తప్పు అయినా తప్పు తప్పే అని కోర్టులో స్పష్టం చేశారు. నామినల్ రోల్స్‌లో సంతకాల వెరిఫికేషన్ విషయంలోనూ టీఎస్‌పీఎస్సీ విఫలమైందని తెలిపారు. జూన్ 11వ తేదీన (రెండోసారి) జరిగిన పరీక్షలో 2,33,248 ఓఎంఆర్ షీట్లు వచ్చాయని టీఎస్‌పీఎస్సీ పేర్కొందని, కానీ, 17 రోజుల తర్వాత జారీ చేసిన వెబ్‌నోట్‌లో 2,33,506 ఓఎంఆర్ షీట్‌లను స్కానింగ్ చేసినట్లు పేర్కొందని మరి 258 ఓఎంఆర్ షీట్‌లు అదనంగా ఎక్కడి నుంచి వచ్చాయని సందేహాలు వెలిబుచ్చారు. బయోమెట్రిక్ తీసుకుని ఉంటే ఈ తేడా వచ్చేది కాదని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఎలాంటి తప్పులు జరగలేదనడంలో అర్థం లేదని, పేపర్ లీకేజీ వ్యవహారంలో ఏ-1గా ఉన్న ప్రవీణ్‌కు పరీక్ష రాయడానికి ఎన్‌వోసీ ఇచ్చి కూడా విధుల్లో ఉంచారని గుర్తు చేశారు. ఇన్ని ఆరోపణలు, వైఫల్యాలున్న పరీక్షను రద్దు చేయకుండా ఉండటం చట్టవిరుద్ధమని.. పరీక్షను రద్దు చేయాలని కోరారు.

**సమర్థించుకునే ప్రయత్నం!**

టీఎస్‌పీఎస్సీ తరఫున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. 'మొదటిసారి నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలో లీకేజీ జరిగిందని తెలిసిన వెంటనే ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుని ఆ పరీక్షను రద్దు చేసింది. టీఎస్‌పీఎస్సీ రెండోసారి పరీక్షను పకడ్బందీగా పూర్తిచేసింది. నామినల్ రోల్స్‌లో సంతకాలు సరిపోలలేదన్న వాదనలో పస లేదు. ఒక మహిళా అభ్యర్థి వివాహం జరిగిన తర్వాత మారిన ఇంటి పేరుతో సంతకం చేశారు. బయోమెట్రిక్ స్థానంలో ఆధార్ వంటి ప్రభుత్వ గుర్తింపు కార్డు వెరిఫికేషన్ అత్యంత కచ్చితత్వంతో జరిగింది. పిటిషనర్లు తప్ప లక్షల మంది అభ్యర్థులు ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. దురుద్దేశంతో కూడిన ఈ పిటిషన్లను కొట్టేసి ఫలితాల వెల్లడికి, మెయిన్స్ పరీక్షల నిర్వహణకు అనుమతి ఇవ్వాలి' అని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేదు' అని స్పష్టం చేశారు.

**టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు ప్రశ్నల మీద ప్రశ్నలు**

మొదటిసారి నోటిఫికేషన్‌లో పేర్కొన్న భద్రతా ఫీచర్లు, నిబంధనలు అటు టీఎస్‌పీఎస్సీకి, ఇటు అభ్యర్థులకు తప్పనిసరి అని అర్థమవుతోందని ధర్మాసనం స్పష్టం చేసింది. 'స్టేట్ ఆఫ్ తమిళనాడు వర్సెస్ జి.హేమలత' కేసును ప్రస్తావిస్తూ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న సూచనల అమలు తప్పనిసరని సుప్రీంకోర్టు తీర్పును గుర్తుచేసింది. చట్టానికి ఉన్నంత శక్తి పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచనలకు ఉంటుందని, హైకోర్టు తన

సుజాత గోపగోని, 6302164068




అధికారాల ద్వారా వాటిని సవరించడం లేదా మినహాయింపులు ఇవ్వడం గానీ చేయలేదని సుప్రీంకోర్టు పేర్కొందని గుర్తుచేసింది. 'పాత నోటిఫికేషన్‌లోని నిబంధనలను సవరించే అధికారం టీఎస్‌పీఎస్సీకి ఉన్నప్పటికీ దానికి ఎలాంటి సవరణలు లేకుండానే రెండోసారి (జూన్ 11న) పరీక్ష నిర్వహించారు. బయోమెట్రిక్ సహా పాత నిబంధనలను అమలు చేయలేమని అనుకున్నప్పుడు గ్రూప్-4 తరహాలోనే అనుబంధ లేదా సవరణ నోటిఫికేషన్ జారీచేయాలి. సవరించలేనప్పుడు నోటిఫికేషన్‌ను యథాతథంగా అమలు చేయాల్సిందే. నోటిఫికేషన్‌లో పేర్కొన్న భద్రతా చర్యలను పాటించకపోవడం ద్వారా టీఎస్‌పీఎస్సీ ఇంపర్స నేషన్‌కు అవకాశం ఇచ్చింది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. టీఎస్‌పీఎస్సీ తెలిపిన ఉదాహరణల్లోనే ఒకరిద్దరి సంతకాల్లో తేడాలు ఉన్నట్లు తెలుస్తోందని, వాటిని పరీక్ష సందర్భంగా గుర్తించడంలో విఫలమయ్యారని వ్యాఖ్యానించింది. తుది తీర్పు సందర్భంగా టీఎస్‌పీఎస్సీ తప్పిదాలను ప్రస్తావించకపోతే విధి నిర్వహణలో తాము విఫలమైనట్లేనని ధర్మాసనం కఠినంగా వ్యాఖ్యా నించింది. కనీస ఆలోచన లేకుండా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారని అభిశంసించింది. పరీక్షకు ఎంతమంది అభ్యర్థులు హాజరయ్యారనే వివరాలను సరిపోల్చుకోకుండానే కౌంటర్ వేశారని పేర్కొంది. ఓఎంఆర్ షీట్ల విషయంలో పొంతనలేని వివరణలను బట్టి టీఎస్‌పీఎస్సీ అటు పరీక్ష నిర్వహణలో, ఇటు అభ్యర్థుల హాజరు డేటాను సరిపోల్చుకోవడంలో విఫలమైనట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది.

ప్రిలిమినరీ పరీక్ష స్క్రీనింగ్ పరీక్ష మాత్రమేనని, ఈ పరీక్షలో పలువురు అభ్యర్థులు అక్రమ పద్ధతుల్లో అర్హత సాధించినా, మెయిన్ పరీక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్న టీఎస్‌పీఎస్సీ వాదనను ధర్మాసనం తప్పుబట్టింది. అక్రమ పద్ధతుల్లో అర్హత సాధించిన వారి వల్ల కొంతమంది మెరిట్ కలిగిన అభ్యర్థులు మెయిన్స్‌కు ఎంపిక కాకుండా పోయే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించింది. వారికి న్యాయం జరిగేందుకు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేస్తున్నామని, బయోమెట్రిక్ సేకరణ సహా నోటిఫికేషన్‌లో పేర్కొన్న అన్ని సూచనలను పాటిస్తూ మళ్లీ పరీక్ష నిర్వహించాలని నిర్దేశించింది.

**ధనిక రాష్ట్రంలో నిధుల కొరతా!**

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో బయోమెట్రిక్ అమలు చేసేందుకు కోటి యాభై లక్షల రూపాయలు ఖర్చవుతుందని, ఇప్పటికిప్పుడు ఆ మొత్తాన్ని సమకూర్చుకోలేకే ఆ విధానాన్ని తొలగించామని టీఎస్‌పీఎస్‌సీ తరఫు న్యాయవాది హైకోర్టులో వాదనల సందర్భంగా స్పష్టంచేశారు. అయితే, న్యాయస్థానం ఈ వాదనను తీవ్రంగా ఆక్షేపించింది. దేశంలోనే సంపన్న రాష్ట్రంగా చెప్పుకునే తెలంగాణలో కొలువులు భర్తీచేసే కమిషన్ దుస్థితి ఇదన్న విమర్శలు చుట్టుముడుతున్నాయి. సంక్షేమ పథకాలకు, భారీ ప్రాజెక్టులకు వేల కోట్ల రూపాయలు ఖర్చుచేసే ప్రభుత్వం, అత్యంత కీలకమైన గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు కేవలం కోటిన్నర రూపాయలు ఇవ్వలేదా? అని ప్రశ్నలు తలెత్తుతున్నాయి.


నిజానికి, నోటిఫికేషన్లు జారీచేసినప్పుడల్లా నిధుల కొరత లేకుండా గతంలో ప్రభుత్వాలు స్పెషల్ ఫండ్ విడుదల చేసేవి. కానీ ఇప్పుడు, గ్రూప్-1 ఉద్యోగ నియామకాల ప్రకటన వెలువడిన తర్వాత సర్కారు ప్రత్యేక నిధులేమీ ఇవ్వలేదు. కనీసం గ్రూప్-1 మొదటిసారి పరీక్ష రద్దు అయ్యాక కూడా నిధుల విషయంలో జాగ్రత్తలు తీసుకోలేదు. నిధుల సమస్య తీవ్రంగా ఉన్నందునే పరీక్ష నిర్వహణకు సంబంధించిన భద్రతాపరమైన అంశాల్లో టీఎస్‌పీఎస్సీ రాజీ పడాల్సి వచ్చిందని స్పష్టమవుతోంది. పోలీసు కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు,గురుకుల ఉపాధ్యాయుల పోస్టులు, జూనియర్ లెక్చరర్ల భర్తీకి....ఇలా ప్రతి పోటీ పరీక్షకు అభ్యర్థుల నుంచి రూ. వెయ్యి వంతున రుసుం వసూలు చేస్తున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఏమీ విడుదల చేయడం లేదు. దాంతో, ఖర్చంతా దరఖాస్తు రుసుము ద్వారానే వసూలు చేస్తున్నారు. కానీ, రాష్ట్రంలోనే అత్యున్నత పరీక్షగా భావించే గ్రూప్-1 పరీక్షకు మాత్రం టీఎస్‌పీఎస్సీ రూ.200 దరఖాస్తు రుసుముగా నిర్ణయించింది.

దరఖాస్తు రుసుం అందరికీ అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుని ఉంటుంది. అయితే పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలంటే అన్ని భద్రతా చర్యలూ తీసుకోవడానికి ఒక్కొక్కరికి దాదాపు రూ.1000 వరకూ ఖర్చవుతుంది. దీని ప్రకారం, ఒక్కో దరఖాస్తుకు అదనంగా అయ్యే ఖర్చు సొమ్ము రూ. 800 టీఎస్‌పీఎస్సీకి ఎలా సమకూరుతుంది. నిజానికి, ఈ బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదే. సర్కారు తన బాధ్యతను విస్మరించినందునే గ్రూప్-1 ప్రిలిమ్స్ రెండోసారి రద్దుకు ప్రధాన కారణమని స్పష్టమవుతోంది.

**కొలువుల నినాదం ఎక్కడ?**

కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో 'కొలువులు ఇస్తాం' అంటూ ప్రధానంగా నినాదం ఎత్తుకుంది. కానీ, తొమ్మిదేళ్లు పూర్తయిన తర్వాత కానీ గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల కాలేదు. ఎట్టకేలకు, నోటిఫికేషన్ ఇచ్చినా.. తొలిసారి పేపర్ లీకేజీతో పరీక్షను రద్దు చేసింది. నిరుద్యోగ యువతతో పాటు, ఉన్న ఉద్యోగాలు వదులుకుని కొందరు, సుదీర్ఘకాలంపాటు సెలవులు పెట్టుకుని ఇంకొందరు కోచింగ్ సెంటర్లకు లక్షలాది రూపాయలు చెల్లించుకుని రాత్రింబవళ్లు పరీక్షలకు తయారైన అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఒకసారి జరిగిన పొరపాట్లను సరిద్దుకుని ముందుకు సాగాల్సిన టీఎస్‌పీఎస్సీ, జూన్ 11వ తేదీన పరీక్ష తేదీని ప్రకటించడంలోనూ దుందుడుకుతనాన్ని ప్రదర్శించింది. కొంత సమయం ఇవ్వాలని అభ్యర్థులు కోరినా, తమ నిర్ణయమే ఫైనల్ అన్నట్లు వ్యవహరించింది. ప్రభుత్వ తీరుతో ఆర్థిక, మానసిక, శారీరక క్షోభ రూపంలో తాము మూల్యం చెల్లించుకోవలసి వస్తోందని అభ్యర్థులు మండిపడుతున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



ప్రిలిమినరీ పరీక్ష స్క్రీనింగ్ పరీక్ష మాత్రమేనని, ఈ పరీక్షలో పలువురు అభ్యర్థులు అక్రమ పద్ధతుల్లో అర్హత సాధించినా, మెయిన్ పరీక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్న టీఎస్‌పీఎస్సీ వాదనను ధర్మాసనం తప్పుబట్టింది. అక్రమ పద్ధతుల్లో అర్హత సాధించిన వారి వల్ల కొంతమంది మెరిట్ కలిగిన అభ్యర్థులు మెయిన్స్‌కు ఎంపిక కాకుండా పోయే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించింది.



# మద్యం దందాపై మహిళా మోర్చా

**అధికారాన్ని అడ్డంపెట్టుకుని రాష్ట్రం మొత్తం తమ సొంత జాగీరులా భావిస్తున్న వైసీపీ ప్రభుత్వం మద్యం వ్యాపారం ద్వారా పెద్ద అవినీతికి పాల్పడుతున్నట్లు బీజేపీ మహిళా మోర్చా ఆరోపిస్తోంది. దీనిపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నాయకత్వంలో మహిళా మోర్చా రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమం ప్రారంభించింది. ఈ ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించే క్రమంలో పురందేశ్వరి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించి మద్యంపై యుద్ధం ప్రకటించారు. మహిళా మోర్చా నేతలతో కలిసి నరసాపురంలోని మద్యం షాపులను ముట్టడించారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని మద్యం తాగి అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురిని ఆమె పరామర్శించారు. మద్యం సీసాలను పగులగొట్టి నిరసన తెలిపారు.**

మహిళల పుస్తెలతో మద్యం అమ్మకాలు పెంచుతూ వైసీపీ నాయకులు జేబులు నింపుకుంటు న్నారని పురుందేశ్వరి ఆరోపించారు. రోజుకు లక్ష రూపాయలు అమ్మకాలు జరిపిన ఒక మద్యం షాపులో కేవలం 700 రూపాయలకు మాత్రమే బిల్లులు లెక్కలు చూపించారని, మద్యం అమ్మకాల ద్వారా జేబులను భారీగా నింపుకుంటున్నారనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. ఇది అతిపెద్ద అవినీతి వ్యవహారమని, దీనిని ప్రజలకు వివరించడం ద్వారా ప్రభుత్వ దోపిడీని తెలియచేస్తామన్నారు. ఈ అవినీతి, అవకతవకలను వెలికి తీసేందుకు సీబీఐతో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మద్య నిషేధంపై రాష్ట్రవ్యాప్తంగా దశల వారి ఉద్యమాన్ని చేపట్టి రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగినబుద్ధి చెబుతామని హెచ్చరించారు.

**లెక్కల్లోనూ అక్రమాలు**

రాష్ట్రంలో మద్యం పేరుతో భారీగా అవినీతి జరుగుతోందనేది బీజేపీ ఆరోపణ. రాష్ట్ర బడ్జెట్‌లో మద్యం ద్వారా రూ.20 వేల కోట్ల ఆదాయం వస్తోందని వైసీపీ ప్రభుత్వం చూపిస్తోంది. కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 15 శాతం మంది మద్యం తాగుతున్నారు. 5 కోట్ల ప్రజల్లో 15 శాతం అంటే 80 లక్షల మంది. వీరంతా ఒక్కొక్కరు సగటున రోజుకు రూ. 200 చొప్పున ఖర్చుపెడితే రోజుకు రూ.160 కోట్ల వంతున నెలకు రూ.4,800 కోట్లు, ఏడాదికి రూ.58,700 కోట్లు ఆదాయం వస్తుంది. మిగిలిన రూ.36,700 కోట్ల సొమ్ము ఎటు పోతోంది? ఇంతకన్నా పెద్ద అవినీతి ఉంటుందా? దీనిపై సీబీఐ విచారణకు ఆదేశిస్తే నిజానిజాలు వెలుగుచూస్తాయని బీజేపీ అంటోంది. దశలవారీగా మద్య నిషేధం అమలు చేస్తామని ఎన్నికల ముందు ప్రచారం చేసిన జగన్మోహన్‌రెడ్డి, తీరా అధికారంలోకి వచ్చాక ప్రభుత్వమే మద్యం విక్రయించే విధానాన్ని తెచ్చి మొత్తం వ్యాపారాన్ని అస్మదీయులకు అప్పగించి కోట్లు కొల్లగొట్టడం వాస్తవం కాదా అని బీజేపీ ప్రశ్నిస్తోంది? గతంలో అమ్మే బ్రాండ్ మద్యం లేకుండా చేసి, కొత్త రకాలు అమ్ముతున్నారని, వీటి తయారీసంస్థల్లో అత్యధిక భాగం వైసీపీ నాయకులవేనని బీజేపీ ఆరోపిస్తున్నది. 'లిక్కర్ తయారీ కంపెనీల యాజమాన్యాలను బెదిరించి, వాటిని లాక్కుని పేర్లు మార్చి నడుపు తున్నారని చెబుతోంది. కంపెనీని స్వాధీన పరిచేందుకు నిరాకరించే వారి విషయంలో ఏదో లొసుగు/అంశాన్ని పట్టుకుని ఇబ్బంది పెడుతున్నారు. తన కంపెనీని ఇవ్వాలన్న అధికార పార్టీకి చెందిన ఒక ఎంపీ మాటను కాదన్నందుకు తన కంపెనీ మద్యాన్ని రాష్ట్రంలో అమ్మనీయడం లేదని ఒక తయారీదారుడు వాపోయారు.

**నాసిరకం తయారీ ?**

నాసిరకం మద్యం తయారవుతోందని బీజేపీ ఆరోపిస్తోంది. మొలాసిస్‌కు ఈస్ట్ కలిపి ఫర్మెంటేషన్ చేస్తే దాంట్లోంచి రెక్టిఫైడ్ స్పిరిట్ వస్తుంది. ఆ స్పిరిట్‌ను డిస్టిల్ చేస్తే దానిలో హెక్సైన్, బ్యూటైన్, హిమైన్ అనే హానికారక పదార్థాలు వస్తాయి. ఈ మూడింటిని వేరుచేసి ఈ రెక్టిఫైడ్ స్పిరిట్‌లో కొంత నీరు కలిపి దుష్ప్రభావం లేకుండా ఉండేలా కంపెనీలు మద్యాన్ని తయారుచేస్తాయి. కాని రాష్ట్రంలోని కంపెనీలు ఈ మూడు హానికారక పదార్థాలను తొలగించకుండానే రూ.12 లకే రెక్టిఫైడ్ స్పిరిట్‌ను తయారుచేసి మరో రూ.3 లతో నీరు, రంగుఫ్లేవర్‌ను కలిపి లీటర్ మద్యాన్ని రూ.600 నుంచి రూ.800లకు అమ్ముతున్నారని బీజేపీ ఆరోపిస్తోంది. నాణ్యత లేని ఈ మద్యం తాగినవారి ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతోంది. పేగు సమస్యలు, ఉదర సమస్యలు, లివర్ సిర్రోసిస్, అధిక రక్తపోటు, గుండెజబ్బులు, కాలేయ సమస్యలు, ఆల్కాహాలిక్ న్యూరోపతి సమస్యలతో ఎంతో మంది





# దండయాత్ర

బాధపడుతున్నారు. కొందరు తక్కువ వయసులోనే చనిపోతున్నారు. ఈ విషయాన్ని స్వయంగా వినియోగదారులే మద్యం దుకాణాల వద్ద చెబుతూ ప్రభుత్వాన్ని దూషించడం కనిపిస్తున్న విషయమే.

రాష్ట్రంలో తయారైన మద్యం తాగి మరణించిన వారి వివరాలు బీజేపీ జిల్లాల వారీగా సేకరిస్తోంది. ఈ జాబితాలను ప్రజలకు వివరించి రాష్ట్ర ప్రభుత్వం అమ్మే మద్యం గురించి, ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై ప్రచారం చేయనుంది.

**భారీ కమిషన్**

ప్రభుత్వ పెద్దలకు కమీషన్ ముట్టచెబుతున్న కంపెనీల నుంచే ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ (ఏపీఎస్ బీసీఎల్) మద్యం కొంటోందని రాజకీయ పార్టీలు ఆరోపిస్తున్నాయి. కమీషన్ల రూపంలో ప్రభుత్వ పెద్దలకు ఏటా రూ. కోట్లు ముడుతున్నట్లు ఆరోపణ లున్నాయి. ఆ లెక్కన వెనకేసుకున్నదెంత? అనేది తేలాలి. ఏపీఎస్‌బీసీఎల్ వద్ద సుమారు 100 కంపెనీలు నమోదు చేసుకోగా... వాటిలో అధికార పార్టీ నేతలు, ప్రభుత్వ పెద్దలకు అత్యంత సన్నిహితులు, కమీషన్లు చెల్లిస్తున్న 18 కంపెనీలకే మద్యం కొనుగోళ్ల ఆర్డర్లు ఇవ్వడం ఏమిటని రాజకీయ పార్టీలు ప్రశ్నిస్తున్నాయి.

రాయలసీమలోని ఒక దివంగత నేతకు చెందిన మద్యం కంపెనీని... వైసీపీ అధికారానికి వచ్చిన వెంటనే, ప్రభుత్వంలో నెం.2గా చక్రం తిప్పుతున్న నాయకుడి కుమారుడు స్వాధీనం చేసుకోగా, ఆ కంపెనీకే ఏపీఎస్ బీసీఎల్ రెండేళ్లలో రూ.1,863 కోట్ల విలువైన 1.16 కోట్ల కేసుల మద్యం కొనడానికి ఆర్డరిచ్చిందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. మద్య నిషేధం హామీని తుంగలో తొక్కి, నాసిరకం బ్రాండ్లు మాత్రమే దొరికేలా చేసి, ధరలు విపరీతంగా పెంచేయడం ప్రజల్ని దోచుకోవడం కాదా? అని ప్రశ్నిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న మద్యం వ్యాపారాన్ని కొందరు రాజకీయ నాయకులు, అధికారులు సిండికేట్‌గా ఏర్పడి తమ అధీనంలోకి తెచ్చుకుని, మూడేళ్లలో రూ.2,000 కోట్ల లబ్ధి పొందారని ఈడీ తేల్చింది. 800 దుకాణాలున్న ఛత్తీస్‌గఢ్‌లోనే అంత పెద్ద అవినీతి జరిగితే 2,934 దుకాణాలున్న ఏపీలో, మద్యం వ్యాపారం మొత్తం తమ గుప్పిట్లో పెట్టుకున్న వైసీపీ నాయకులు, వారి అస్మదీయులు ఏ స్థాయిలో మింగేస్తూ ఉండాలి? అనేది చర్చనీయాంశం అయింది.

**అప్పులే ముఖ్యం**

మద్యంపై వచ్చే ఆదాయాన్ని సెక్యూరిటీగా చూపి అప్పులు తెచ్చుకోవడం దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే చెల్లింది. మద్యంపై వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం పెంచి కార్పొరేషన్లకు మళ్లిస్తోంది. లిక్కర్‌పై వ్యాట్ రూపంలో వచ్చే ఆదాయాన్ని తగ్గించుకుని ఆ మొత్తాన్ని ఇతర రూపాల్లో వసూలు చేసుకునే అధికారం కార్పొరేషన్‌కు కల్పించింది. ఆ రాబడిని చూపించి రూ.వేల కోట్ల అప్పులు తెచ్చేస్తోంది. అంటే రాష్ట్రంలో ప్రజలు తాగుతూ ఉండాలి. దానిపై ఆ కార్పొరేషన్లకు రాబడి వస్తూ ఉండాలి. ఆ రాబడి నుంచి ఎప్పటికప్పుడు వేల కోట్ల వడ్డీలు చెల్లిస్తూ..



వల్లూరు జయప్రకాష్ నారాయణ


ఆ అప్పులు తీరుస్తూ ఉండాలి. అంతిమంగా రాష్ట్రంలో లక్షల జీవితాలు నాశనమైపోతున్నా వైసీపీ సర్కార్ అప్పులు తెచ్చుకుంటూ ఉంటుంది. 'ఈ అప్పులు రాజ్యాంగ విరుద్ధం. ఇది చెల్లదు.. ఇది సరికాదు' అని కేంద్రం, రిజర్వుబ్యాంకు ఘోషిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకుండా రూ. వేల కోట్ల అప్పులు చేస్తోంది.

**హామీలేమయ్యాయి?**

అధికారం కోసం ప్రజలకు వైసీపీ లెక్కలేనన్ని హామీలిచ్చింది. అందులో ముఖ్యమైనది సంపూర్ణ మద్యపాన నిషేధం. 'మద్యపానం కాపురాల్లో చిచ్చు పెడుతోంది. మానవ సంబంధాలు ధ్వంసమై పోతున్నాయి. అందుకే అధికారంలోకి రాగానే మూడు దశల్లో మద్యాన్ని నిషేధిస్తాం. మద్యాన్ని 5 స్టార్ హోటళ్లకే పరిమితం చేస్తాం' – 2019 ఎన్నికల మ్యానిఫెస్టోలో జగన్ ఇచ్చిన హామీ ఇది. దాంతో మహిళలు నమ్మి ఓటేసి గెలిపించారు. కాని నాలుగున్నరేళ్లుగా జరుగుతున్నది వేరు. నిషేధం మాట అటుంచి అమ్మకాలు పెంచేశారు. ప్రభుత్వం నాసిరకం సరకును రెండు రెట్లు అధిక ధరకు అమ్ముతుందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అదికాక ఇక 20 ఏళ్లకు పైగా రాష్ట్రంలో మద్యనిషేధం అమలుకు నోచుకోకుండా ప్రభుత్వం బ్యాంకులతో అగ్రిమెంటు చేసుకుంది. మద్యం వ్యాపారాన్ని పాక్షికంగా కూడా నిషేధించమని అప్పుల కోసం బ్యాంకులకు వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అంటే ఈ ప్రభుత్వం మద్య నిషేధానికి తిలోదకా లిచ్చినట్లే. మద్యపాన నిషేధ విషయంలో జగన్ తమను మోసం చేశారని మహిళలు శాపనార్థాలు పెడుతున్నారు.

పైగా ప్రభుత్వం అమలుచేసే అమ్మఒడి, చేయూత, ఆసరా పథకాలకు అవసరమైన నిధులను బెవరేజెస్ కార్పొరేషన్ ద్వారానే సమకూర్చు కుంటున్నట్లు ప్రభుత్వం చెప్పడం అర్థరహితం. మద్యానికి అలవాటుపడి బానిసలైనవారి జేబులు ఖాళీచేసి, అనారోగ్యం కలుగచేసి ఆయా కుటుంబా లను ఛిన్నాభిన్నం చేస్తూ, ఈ పథకాల పేర్లతో ఓట్లు కొనుగోలు చేసు కోవడం దుర్మార్గమని మహిళలు విమర్శిస్తున్నారు.

వ్యాసకర్త: ఛైర్మన్,సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు,
కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ.



మద్యంపై వచ్చే ఆదాయాన్ని సెక్యూరిటీగా చూపి అప్పులు తెచ్చుకోవడం దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే చెల్లింది. మద్యంపై వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం పెంచి కార్పొరేషన్లకు మళ్లిస్తోంది. లిక్కర్‌పై వ్యాట్ రూపంలో వచ్చే ఆదాయాన్ని తగ్గించుకుని ఆ మొత్తాన్ని ఇతర రూపాల్లో వసూలు చేసుకునే అధికారం కార్పొరేషన్‌కు కల్పించింది. ఆ రాబడిని చూపించి రూ.వేల కోట్ల అప్పులు తెచ్చేస్తోంది. అంటే రాష్ట్రంలో ప్రజలు తాగుతూ ఉండాలి. దానిపై ఆ కార్పొరేషన్లకు రాబడి వస్తూ ఉండాలి.



❋ రామాయణంలోని పాత్రలు ❋

# దురహంకారమే పతన హేతువు

రామాయణంలో నాయకుడైన రాముడు ఎంత బలమైనవాడు, ఉదాత్తమైన వాడు, గొప్పవాడో, ప్రతినాయకుడు రావణాసురుడు కూడా అంతటి గొప్పవాడే. అయితే తనను మించినవాడు ఎవడూ లేడన్న అహంకారం, పరస్త్రీ వ్యామోహం, ఎవరి మాటా వినకపోవడమనే లక్షణాలే అతడి పతనానికి కారణమయ్యాయి. రామాయణం అంతకాలం పాటు నిలబడిందంటే అందుకు ప్రతి నాయకుడి పాత్ర కూడా ఒక కారణం.

రావణుడు గొప్ప రాజు, పరాక్రమవంతుడే కాదు.. మంచి శివభక్తుడు, మాతృవాక్య పరిపాలకుడు. కారణజన్ముడు కూడా. భాగవత పురాణం ప్రకారం, సనకసనందనుల శాపకారణంగా వైకుంఠంలోని ద్వారపాలకులు జయవిజయులు ఎత్తిన మూడు జన్మలలో రావణకుంభకర్ణులు రెండవజన్మ.

బ్రహ్మ మానస పుత్రుడైన పులస్త్యుని కుమారుడు విశ్వవసుకి, దైత్య రాకుమారి కైకసికి రావణాసురుడు జన్మిస్తాడు. కైకసి తండ్రి సుమాలి, తనకు అత్యంత పరాక్రమవంతుడైన మనుమడు కావాలన్న కోరికతో ఎందరో రాకుమారులను కాదని, తన కుమార్తెను మహాతపస్వి విశ్వవసు బ్రహ్మకి ఇచ్చి వివాహం చేస్తాడు. కైకసి, తండ్రి ఆజ్ఞపై అసుర సంధ్యాకాలంలో విశ్వవసు బ్రహ్మ తపస్సు చేసుకొంటుండగా ఆయన వద్దకు వెళ్లి, తపోశక్తితో తన కోరిక తెలుసుకోమని అడుగుతుంది. విశ్వవసు బ్రహ్మ విషయం తెలుసుకొని అసుర సంధ్యాకాలం చేత క్రూరులైన పుత్రులతో పాటు, ధార్మికుడైన కుమారుడు కూడా జన్మిస్తాడని చెబుతాడు. ఆ ధార్మిక పుత్రుడే విభీషణుడు. ఈ విధంగా పుట్టినవాడు రావణాసురుడు. అందువల్ల రావణాసురుడు దైత్యుడు, బ్రాహ్మణుడు.

**సర్వగుణ సంపన్నుడు**

రావణాసురుడిలో స్త్రీలోలత్వం తప్ప.. మిగతా అన్ని విషయాలలో గొప్పవాడిగా రామాయణం అభివర్ణిస్తుంది. రావణాసురుడిని మొదటిసారి చూసిన (సుందరకాండ) హనుమంతుడు 'ఆహా! ఈ రావణుని రూపం అత్యద్భుతం. ధైర్యం నిరుపమానం. సత్వం ప్రశంసార్హం. తేజస్సు అసదృశం. ఈ రాక్షసరాజు సర్వలక్షణ శోభితుడు. ఒక అధర్మానికి ఒడిగట్టకపోతే సురలోకానికి సైతం ప్రభువయ్యేవాడు!' అని అనుకున్నాడు.

**మాతృవాక్య పరిపాలకుడు**

తల్లి కైకసి ఒకానొక సందర్భంలో సముద్రపు ఒడ్డున ఇసుకతో (సైకత) లింగ ప్రతిష్ఠించి పూజించే సమయంలో సముద్రంలో అలలు ఎగసిపడడంతో ఆ లింగం సముద్రంలో కలిసిపోయింది. ఆమె కుమారుడి వద్ద దుఃఖాన్ని వ్యక్తం చేయగా, ఆమె పూజకోసం శివుడి ఆత్మ లింగమే తెచ్చి ఇస్తానంటూ తపస్సుకు పూనుకుంటాడు. పరమేశ్వరుడిని మెప్పించి, ఒక చిన్న నిబంధనపై ఆత్మలింగాన్ని సైతం సంపాదిస్తాడు. లంక చేరేవరకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మలింగాన్ని నేలనుంచకూడదన్నది నియమం. కానీ దేవతలు కుట్ర చేసి రావణాసురుడి చేత దాన్ని కింద పెట్టించడం వల్ల అది రామేశ్వర క్షేత్రం అయిందని

ఆధ్యాత్మికం

❋ పెరటి బంగారం ❋

# పథ్యానికే కాదు... నిత్య శాకం బీర

పూర్వం నుంచి జ్వరం వచ్చి తగ్గినవారికి బీరకాయ కూరతో పథ్యం పెట్టేవారు. నిజానికి కేవలం పథ్యంగానే కాకుండా ఎప్పుడూ తినతగ్గది. ఈ కాయలే కాదు, బీరపాదు మొత్తం ఔషధపూరితం అని వైద్యులూ అంటున్నారు.

సాధారణబీర, నేతి బీరకాయ... ఈ రెండు రకాల కాయల్లోనూ పీచు, విటమిన్ సి, జింక్, ఐరన్, రిబోఫ్లేవిన్, మెగ్నీషియం, థయామిన్ వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. సెల్యులోజ్ ఎక్కువగా ఉండటంతో ఇది మలబద్ధకాన్నీ, మొలల వ్యాధిని బాగా నివారిస్తుంది. కాయల్లోని పెప్టైయిడ్లు, ఆల్కలాయిడ్‌లూ రక్తంలోనూ, మూత్రంలోనూ ఉండే చక్కెర నిల్వల శాతాన్ని తగ్గించేందుకూ తోడ్పడతాయి. మాంగనీసు జీర్ణక్రియా ఎంజైముల ఉత్పత్తిని పెంచడం ద్వారా చక్కెరవ్యాధినీ నియంత్రిస్తుంది. రక్తశుద్ధికీ కాలేయ ఆరోగ్యానికీ కూడా తోడ్పడుతుంది. ఆల్కహాల్ వల్ల దెబ్బతిన్న కాలేయాన్నీ రక్షిస్తుంది.

కామెర్లు సోకినవారు బీరకాయ రసం తాగడంవల్ల మంచి ఫలితం ఉం టుందని, దీనివల్ల ఎలాంటి ఇన్ఫెక్షన్లూ రావనీ రోగనిరోధకశక్తిని పెంపొందిస్తుందని తేలింది. అల్సర్లూ మంటలతో బాధపడేవాళ్లకి ఈ కాయ మందులా పనిచేస్తుంది. కంటి కండరాల బలహీనత కారణంగా తలెత్తే అంధత్వాన్ని ఇందులోని విటమిన్ –ఎ నివారిస్తుందని నేషనల్ ఐ ఇనిస్టిట్యూట్ పేర్కొంటోంది. దీన్ని ఆరేళ్లపాటు ఆహారంలో భాగంగా చేసుకున్నవాళ్లలో కంటి కండరాల క్షీణత 25 శాతం వరకూ తగ్గిందట. ఇందులోని విటమిన్ బి5 చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందట. విటమిన్ బి 6 అనీమియాను నివారించగలదనీ తేలింది. బీరపాదు ఆకులు మెత్తగా నూరి, రసం తీసి కళ్లలో వేస్తే కళ్ల మంటలు, కంజెక్టివైటిస్ తగ్గుతాయి.

బీరకాయ అరుచిని కూడా పోగొడుతుంది. లేత బీరపొట్టు వేపుడు జ్వరం పడి లేచిన వారికి హితవుగా

**దోర్బల పూర్ణిమాస్వాతి**

ఒక కథ.

**గొప్ప పాలకుడు**

రావణుడు పాలించిన లంక సర్వాంగ శోభితమైన రాజ్యం. ఆయన పాలనలో ప్రజలు సురక్షిత జీవనం గడిపేవారు. ఇంద్రాది దేవతలను సైతం ఓడించగలిగే పరాక్రమం రావణుడిది. ముల్లోకాల్లో వీరుడిగా ధీరుడిగా పేరు ప్రఖ్యాతలు గడించినవాడు. మంచి పాలనా దక్షుడు. దూతగా వచ్చిన హనుమంతుడు ప్రాణాలతో తిరిగి వెళ్లగలిగాడంటే అది రావణాసురుడి రాజకీయ నిబద్ధత వల్లే అని చెప్పవచ్చు. వేదవేదాంగాలను అవపోశన పట్టిన వేదాంతుడు. జన్మతః బ్రాహ్మణుడు. రాక్షస స్త్రీ గర్భసంభూతుడవడం మూలంగా రాక్షసుడైనాడు. కుబేరుడిని సైతం యుద్ధంలో ఓడించి పుష్పకవిమానాన్ని కైవసం చేసుకున్నాడు.

**ఆ లోపాలే శాపాలు**


ఎంతో గొప్ప వ్యక్తిత్వం కలిగిన రావణాసురుడిలో ఉన్న ఒకటి రెండు లోపాలు అతడిని దుష్టుడిగా మిగిల్చాయి. చెప్పుడు మాటలు వినడం మొదటి లోపం. చెల్లి శూర్పణఖ చెప్పిన పితూరీలు విని ముందూ వెనుకలు ఆలోచించకుండా సీతను అపహరించి తనకు, తన రాజ్యానికి చెరపు చేసుకున్నాడు. అంతకంటే ముందు హరి తపస్సులో ఉన్న యోగిని వేదవతిని మోహించి, చెరబట్టబోయి ఆమె చావుకి కారణమై శాపగ్రస్తుడయ్యాడు. సీతాపహరణం తప్పని తెలిసినా, అహం అడ్డువచ్చి తమ్ముడు విభీషణుడి హితవును వినకుండా అహంకారిగా మిగిలిపోయాడు.

ఉత్తర భారతంలో చైత్రరథం అనే అందమైన వనం ఉందని ఎవరో చెబితే, రావణుడు అక్కడికి వెళ్లి, ఇంత అందమైన వనం తనకు లేనప్పుడు ఎవరికీ ఉండకూడదని నాశనం చేశాడు. అలాగే స్వర్గలోకంలోని నందనవనాన్ని నాశనం చేశాడు. అప్పుడప్పుడు ఆకాశంలో నిలబడి సూర్యచంద్రుల గమనాన్ని ఆపుతాడు. రావణుడు బ్రహ్మదేవుడి కోసం పది వేల సంవత్సరాలు తపస్సు చేశాడు.

ఎన్ని గొప్ప గుణాలున్నా వ్యక్తిత్వంలోని చిన్న చిన్న లోపాలను సరిచేసుకోలేక పోతే అవి పతనానికి దారితీస్తాయని రావణాసురుడి పాత్ర చెబుతుంది. గొప్ప రాజుగా, మంచి తండ్రిగా, చెల్లికి జరిగిన అవమానాన్ని సహించలేని అన్నగా, పరిపాలనా దక్షుడుగా, గొప్ప భక్తుడిగా ఎన్నో మంచి లక్షణాలు కలిగి ఉన్నప్పటికీ యుగాలుగా చెడ్డవాడిగా... అహంకారిగా... పరస్త్రీలను చెరబట్టే వాడిగా మిగిలిపోయాడు. ★



ఉంటుంది. సరైన రీతిలో వండాలేగానీ రుచికి కూడా బీరకాయ ఏమాత్రం తీసిపోదు. బీరకాయతో బజ్జీలు, పచ్చడి, దీని పొట్టుతో పచ్చడి.. ఒకటేమిటి.. బీరకాయను ఎలా తిన్నా రుచిగా ఉంటుంది. వీటిని పెంచుకోవడం కూడా చాలా సులువు. బీరపాదును ఇంటిమీదికి పాకిస్తే చూడటానికి అందంగా కూడా ఉంటుంది. దీనికి పురుగు, తెగుళ్లు కూడా తక్కువే కాబట్టి నిర్భయంగా పెంచుకోవచ్చు. ★



# అంటువ్యాధి కంటే 'భయం' కీడే ఎక్కువ

❄ తాత్వి'కత' ❄

వైశాలిని నగరంలో ఒక సంవత్సరం తీవ్రవర్షాభావం నెలకొంది. మంచినీటి తావులన్నీ తరిగిపోయి మురికి గుంటలయ్యాయి. ఆ నీటినే తాగడం వల్ల ప్రజలకు అంటువ్యాధులు సోకాయి. కలరా విజృంభించింది. వేలాది మరణాలు సంభవించాయి. రాజవీధులు శ్మశానాలయ్యాయి. శవాలను తీసేవారే లేరు. అవి కుళ్లిపోయి నగరమంతా దుర్గంధం వ్యాపించింది. కొత్త కొత్త రోగాలు వచ్చిపడ్డాయి. ప్రజలు గడపదాటి రావడానికే భయపడ్డారు. రాజకుటుంబీకులు కూడా అంతఃపురానికే పరిమితం అయ్యారు. ప్రజలని పట్టించుకునే వారే లేరు. దీంతో దొంగల బెడద పెరిగింది.

ఆ సమయంలో బుద్ధుడు మగధ రాజధాని రాజగృహ నగరంలో ఉన్నాడు. ఎవరో బాటసారులు బుద్ధునితో వైశాలి ప్రజల బాధలు చెప్పారు. ఆ రోజుల్లో జీవకుని లాంటి బౌద్ధులు పద్దెనిమిది రకాల వైద్యవిధానాలతో వైద్యం అందించేవారు. బుద్ధుడు వెంటనే ఐదువందల మంది భిక్షువుల్ని వెంట తీసుకుని వైశాలికి వెళ్లాడు. ఆకాశమంతా కారుమబ్బులు కమ్మి, కుంభవృష్టి పడింది. ఆ నీటి ప్రవాహంలో కొన్ని కళేబరాలు కొట్టుకుని పోయాయి. బుద్ధుడు తన భిక్షు సంఘంతో కలసి వీధులు శుభ్రం చేశాడు. మిగిలిన కళేబరాల్ని పొలిమేరలకు తరలించాడు. జీవకుడు మరికొందరు వైద్యులు అందించిన ఔషధాల్ని ప్రజలకు అందించారు. ఆ పరిసరాలలో దొరికిన మొక్కల నుండి రకరకాల ఔషధాల్ని తయారు చేస్తూ, నిరంతరం ప్రజలకి సరఫరా చేశారు. 'బుద్ధుడే తన సంఘంతో వచ్చి తమకు సేవ చేస్తుంటే తామెందుకు ఇళ్లలో కూర్చోవాలి' అని ఆలోచించి కొందరు ప్రజలు వచ్చి సహకరించారు.

బుద్ధుడు నగరంలో రాజు అంతఃపురానికి వెళ్లి రాజా! అంటురోగం కంటె భయం చేసే కీడే ఎక్కువ. ఇలాంటి విపత్కర పరిస్థితులల్లో మనిషికి మనిషే తోడు. ఈ విషయంలో మీరు ఆటవికుల నుండి ఎంతో నేర్చుకోవాలి. ఇలాంటి పరిస్థితుల్లో వారు ద్వేషాలన్నీ పక్కనపెట్టి శత్రుత్వాన్ని చెరిపేసుకుని, ఒక్కటిగా కలసి ఎదుర్కొంటారు. అందరూ కలసి ఉంటే అంతకుమించిన బలం ఏముంది? ప్రతి వ్యక్తి ధైర్యంగా... తనకు సంఘం అండగా ఉందనే భావనతో భయరహితుడై బతికేస్తాడు. కాబట్టి రాజా! మీరు కదలండి! ప్రజలకు కావలసిన సపర్యలు చేయండి! ఔషధాలు అందించండి" అని చెప్పగా వెంటనే రాజు తన ఉద్యోగ పరివారంతో కదలి వచ్చాడు.

అటు తరువాత కాలంలోనే వైశాలి అంటురోగాల నుండి బయట పడింది. అప్పటి వరకు బుద్ధుడు వైశాలిలోనే ఉండిపోయాడు. ★

"మీ నాన్న మీ ఇద్దరికీ సమానంగానే ఇచ్చారని నేను అనుకుంటాను. రమేష్‌కు ముందు నుండి వాళ్ల నాన్నగారి నుండి కొన్ని ఆస్తులు వచ్చాయి. పైగా కలిసి వచ్చింది. మా అక్క ఇప్పుడు లేదు. మేం ఇద్దరం ఒకేలాలేం. అయినా మా అక్క నన్ను చూసి అసూయ పడలేదు".

"అప్పటి కాలం వేరు. అప్పటి మనుషులు వేరమ్మా".

"మనం అలా ఎందుకు ఉండకూడదు అంటున్నాను".

భువన మాట్లాడలేదు.

"నా పేరుతో ఆస్తులు వున్నాయి. మీ నాన్న దగ్గర ఎన్ని వున్నాయో నాకు తెలియదు. ఒకప్పుడు ఆయన్ని కలవటం అదృష్టం అనుకునే వారు. ఇప్పుడు ఆయన ముంబయ్‌లో వుంటున్నారా?"

"తెలియదమ్మా".


"అంటే మనందరం ఆయన గురించి పట్టించుకోలేదు. ఈ ఆస్తంతా ఆయన వల్ల మనకు వచ్చింది. కొంత కాలం ఇక్కడే వున్నారు. చివరికి రాజన్ ఈ వయసులో దగ్గర వుండి మీ నాన్నను చూసుకుంటున్నాడు. మనందరం అందుకు సిగ్గుపడాలి కదా! ఏ ఆస్తులు ఇస్తామని రాజన్ ఆయన దగ్గరున్నాడు?"


ఆలోచిస్తున్నారు.

"అమ్మా నాన్నలు కూడా ఏదో ఒక సమయంలో ఎవరో ఒకరి పట్ల మొగ్గు చూపాల్సి వస్తుంది. ఇక్కడ పరిస్థితులు అలాంటివి. పోటీ అనేది మనుషుల్ని, మనస్సుల్ని పాడు చేస్తుంది భువనా...! ఇంత వుంది. మనం అదే తిండి తింటున్నాం. ఎక్కువ తింటే అరగదు. అవే కార్లు, ఖరీదు ఎక్కువ. నాకయితే రసజ్ఞ నచ్చింది. ఇప్పుడు ఫోన్ చేసి మీ ముందు మాట్లాడతాను. సరయూకి నీకూ ఆస్తి రాయాలనుకుంటున్నాను. నీకు ఏ ఆస్తి కావాలని. తనేమంటుందో వింటావా?"

"సరయూని కూడా అడుగమ్మా".

"వద్దు. నేను నా ఆస్తిని మీకు కాకుండా ఏ సంస్థలకో రాస్తాను. అప్పుడేం చేస్తారు. నాలుగు రోజులు నన్ను తిట్టుకుంటారు. లేదా బతికున్నంత కాలం, గుర్తొచ్చినప్పుడల్లా మా అమ్మ ఇలా చేసింది అనుకుంటారు. అంతకు మించి ఏం చేయగలరు?"





ఎండివై రామమూర్తి స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన

**20**



# మహా సంకల్పం



"చేసేదేముంది" అంది భువన.

"అందుకే నేను చెబుతున్నా. చిన్నదయినా మనవరాలు నా కళ్లు తెరిపించింది. తాతయ్య గురించి అడిగినప్పుడు అనుకున్నాను. ఆయన్ని ఇంకొకరు గుర్తు చేయాలా? అందులోనూ ఈ వయసులో మనకి తెలియకుండా ఎక్కడెక్కడో బతకాలా? అప్పుడు సిగ్గుతో చితికిపోయాను" అంది. ఆమె కంఠంలో బాధ ధ్వనించింది.

"ఈ ఒక్క రోజుతో మనందరం మారిపోతామని నేను అనుకోవటం లేదు. అలాగే బలవంతాన కలిసినా ఎక్కువ రోజులు ఆ బంధం వుండదు. అందుకని మన ఆలోచనలు పూర్తిగా మారిపోవాలి. అంతేకాదు. రేపు సరయూ–రసజ్ఞల మధ్య ఈ పంతాలూ, పట్టింపులు మళ్లీ మొదలవ్వవచ్చు. ఎప్పుడు ఏం జరుగు తుందో చెప్పలేం. మనం బతికి వున్నంత కాలం స్వచ్ఛంగా వుందాం" అని ప్రభాత్ ని చూస్తూ...

"బాబూ... ముందు నువ్వోసాయం చేయాలి" అంది.

"చెప్పండి అత్తయ్య గారూ".

''మీ మావయ్య ఎక్కడ వుంటున్నారో తెలుసుకో వాలి. అదేమంత కష్టమైన పని అని నేను అనుకోను".

"కనుక్కుంటాను".

"నాలుగయిదుసార్లు మనందరం కలుసుకోవాలి. ఇప్పటి దాకా మనసులో దాచుకున్న విషయాలు బయటకు చెప్పుకోవాలి. చెదిరిపోయిన గూడుని మళ్లీ ఏర్పాటు చేసుకోవాలి" అంది.

ఇద్దరూ తలలూపారు.

* * *

అదే సమయంలో వసుంధర సరయూతో మాట్లాడుతోంది.

"అమ్మమ్మ ఇండియా వచ్చింది".

"నిజమా!"

"ఇప్పుడు ముంబయిలో వుండి వుంటుంది".

"పిన్ని దగ్గరా!"

"అంత కంటే అక్కడ ఎవరున్నారు?"

"ఏంటీ సడన్ మార్పు".

"ఇదంతా రసజ్ఞ చేసింది".

"నిజమా" అంది.

"అవును. నువ్వు ఎప్పుడు వస్తున్నావు?"

"నాకు ఇప్పుడే రావటం కుదరదు. ఇక్కడ అనుకున్నంత ఈజీగా పనులు కావటం లేదు. చాలా సమస్యలు వున్నాయి. తాత ఇన్ని రకాల ప్రాబ్లమ్స్‌ని ఎలా సాల్వ్ చేసుకున్నాడా అనిపించింది".

వసుంధర నిర్ఘాంతపోయింది.

"మళ్లీ మాట్లాడుకుందాం. నాకు నిద్ర వస్తోంది" అంది.

* * *

ఉదయం శ్వేత ఆలస్యంగా లేచింది. రాత్రి చదువుతున్న నవలను మధ్యలో ఆపాలనిపించలేదు. చివరి వరకు చదివింది. నవలలో రాసినట్లు జరుగుతుందా అనేది అనుమానం. ఎక్కడైనా అరుదుగా జరగవచ్చు. ఇది రచయిత కలగన్న ఓ అందమైన ఊహ. ఇలా జరిగితే బాగుంటుంది అనిపించి వుంటుంది. అప్పుడప్పుడు ఇలాంటి పుస్తకాలు కూడా రావాలి. చదువుతున్నంతసేపూ అమ్మా నాన్న ఈ పుస్తకం చదివితే ఎంత బాగుంటుంది అనిపించింది.

అప్పటిదాకా ఆ పుస్తక ప్రభావంలో వుంది. రాత్రి జరిగిన గొడవ గుర్తు రాలేదు. ఇంత వరకు ఇంటిలో ఎలాంటి శబ్దాలు లేవు అనుకుని బయటకు వచ్చింది. అమ్మా నాన్న ఇద్దరూ కనిపించలేదు. అప్పుడు సర్వెంట్ కనిపించింది. తను రాత్రి వుండదు. ఉదయం వచ్చి అన్ని పనులూ చేసి వెళ్లిపోతుంది.

"మమ్మీ కనిపించటం లేదు గుడికి వెళ్లిందా?" అడిగింది.

"లేదమ్మా... అయ్యగారూ అమ్మగారూ ఊరు వెళ్లారు".

"ఎప్పుడు?"

"గంట అవుతుంది".

"సరే" అంది.

"కాఫీ ఇవ్వమంటారా?"

"వద్దు. ఇప్పుడే లేచాను. బ్రష్ చేసుకుని వస్తాను" అని తన గదికి వెళ్లింది.

రాత్రి నుండి ఏం జరిగి వుంటుందా అని ఆలోచించింది. ఉదయం ఇప్పటికిప్పుడు ఎక్కడికి బయలుదేరి వుంటారు. ఏదో జరగబోతోంది. ఇద్దరూ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. అప్పుడు ఆద్య గుర్తు వచ్చింది. వెంటనే తనకు ఫోన్ చేసింది.

"అక్కా ఏంటి విశేషాలు".

"చాలా వున్నాయి. నిన్న ఇంట్లో పెద్ద యుద్ధం నడిచింది".

"ఇంత వరకు నువ్వు చెప్పలేదు".

"రాత్రేగా జరిగింది. ఆ సమయంలో నిన్ను డిస్టర్బ్ చేయటం ఎందుకని వూరుకున్నాను. రాత్రి నీ దగ్గర నుండి తెచ్చుకున్న పుస్తకం పూర్తి చేసాను. ఎలా వుంది అని అడుగుతావు. ఆ పుస్తకం మనం ఏం చేయాలో చెప్పింది అనుకుంటున్నాను".

"అవునక్కా... బిట్వీన్ ది లైన్స్ ఆ పుస్తకంలో ఎన్నో విషయాలు వున్నాయి".


"ఆ విషయాలు మనం తీరిగ్గా మాట్లాడుకుందాం ఆద్యా... ఉదయం అమ్మా నాన్నలు ఊరు వెళ్లారు అని తెలిసింది. నేననుకోవటం వాళ్లు హైదరాబాద్ వచ్చి వుంటారని... నిన్ను ఇప్పుడు టార్గెట్ చేస్తారు".

"నేను అందుకు సిద్ధంగా వున్నాను అక్కా" అంది ఆద్య.

"మనం కూడా క్విక్ డెసిషన్స్ తీసుకోవలసిన సమయం వచ్చింది. నువ్వు ఇప్పటికిప్పుడు బయలుదేరి రాగలవా?"

"చెన్నైకా?"

"చెబుతాను. ఇంకో అరగటంలో ప్రోగ్రామ్ చెబుతాను. ఈ రోజు నువ్వు కాలేజీకి వెళ్లవద్దు. అవసరం అయితే మనం రెండు మూడు రోజులు



పి. చంద్రశేఖర ఆజాద్
9246573575

స్పేర్ చేయాల్సి వుంటుంది. బట్టలు తీసుకుని రా”.

“అలాగే అక్కా” అంది ఆద్య.

అప్పటి నుండి శ్వేత చకచక పనులు చేయటం మొదలు పెట్టింది. క్రైసిస్ మేనేజ్‌మెంట్ అనేది తను చేయబోయే ఉద్యోగంలో ఓ భాగం. అది తుఫాన్ కావచ్చు. సునామి కావచ్చు. అలాగే రాజకీయంగా అప్పటికప్పుడు విరుచుకుపడే పరిణామాలు కావచ్చు. శ్వేత ముఖం గంభీరంగా తయారయింది.

* * *

రిత్విక్ గోవింద్ ఎదురుగా కూర్చున్నాడు. ఆయన ముఖం గంభీరంగా వుంది.

“రామకృష్ణగారు లండన్ వెళ్దాం అంటున్నారు రిత్విక్”.

“అందుకేగా సర్. వీసా తీసుకుంది”.

“నిజానికి మన ముగ్గురం బయలుదేరి వెళ్లాలి. నేను కనీసం పది రోజులు ఆగుదాం నాకు కొన్ని



రిత్విక్ అందరినీ ఆశ్చర్యంగా చూస్తున్నాడు. గోవింద్ బుద్ధ మనవరాళ్లు తన నవల గురించి మాట్లాడటం అతను వూహించనిది. “మనం అవన్నీ మాట్లాడుకుందాం. దానికి ముందు ఒక విషయం మీకు చెప్పాలి. మన కుటుంబంలో ఘర్షణ జరిగినప్పుడు ఇలా జరగకూడదు. మీ అందరూ కలవాలి, ఎప్పటికయినా కలుస్తారు అని ముందుగా ఉత్తరం రాసింది రిత్విక్”. ఇద్దరూ రిత్విక్‌ని కృతజ్ఞతా భావంతో చూస్తున్నారు. “అప్పుడు నేను ఆ తీవ్రతలో వున్నాను. అందుకే కొంత కాలం నేను రిత్విక్‌ని దూరంగా పెట్టాను” అని...

ముఖ్యమైన పనులున్నాయి అన్నాను. అందుకు రామకృష్ణ గారు ఒప్పుకోవటం లేదు. నీ పనులు నువ్వు చూసుకో.. నేనూ రిత్విక్ వెళ్తాం అంటున్నారు”.

“ఇప్పుడేం చేద్దాం సర్”.

“రాజన్ ఇక్కడే వుంటాడు. మీరు ఇద్దరూ వెళ్లాలి. రామకృష్ణ గారి అన్ని విషయాలు నువ్వు చూసుకోవాలి”.

“ఆ విషయం గురించి మీరు ఆలోచించకండి. నాకు ఆయన తాతగారి లాంటి వారు. మా నాన్న లేరు. ఆయనకు సేవ చేసే అదృష్టం ఈ రూపంలో వచ్చింది అనుకుంటాను. రాజన్ దగ్గర నేను పెద్దాయన డైరీ అంతా రాసుకుంటాను. ఎప్పుడు ఏ మందులు ఇవ్వాలో, ఇంకా అన్ని విషయాలు”.

“నేను మీతో రాలేకపోతున్నాను. అయితే నా మనసంతా అక్కడే వుంటుంది” అన్నాడు గోవింద్.

“నన్ను మీ స్వంత మనిషి అనుకుని ఇక్కడికి పిలిచారు. ఆ గౌరవాన్ని నిలబెట్టుకుంటాను సర్”.

“నేను నా పనులు అయిన వెంటనే ఏ నిమిషంలో అయినా బయలుదేరి వస్తాను. నేను ఆఫీస్‌కి వెళ్తాను” అని గోవింద్ లేచాడు. అప్పుడు అతని కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. అతను నమ్మలేనట్లు చూస్తున్నాడు.

శ్వేత–ఆద్య నడిచి వస్తున్నారు. రిత్విక్ వారిని చూస్తున్నాడు–ఎవరి అమ్మాయిలు అనుకుంటూ!

గోవింద్‌లో పసిబిడ్డ వున్నాడు. ఆయన తన్మయత్వంలోనూ ఏడుస్తుంటాడు. ఇప్పుడు అదే జరుగుతోంది.

ఇద్దరూ వచ్చి గోవింద్ పాదాలకు నమస్కరించారు.

అప్పుడు ఇద్దరినీ లేపి హృదయంలో పొదువుకుని ఏడుస్తున్నాడు.

“నేను బతికి వున్నంత వరకు ఇలాంటిది చూస్తాననుకోలేదు. మీరు నేను చనిపోయినా చూడటానికి వస్తారనుకోలేదు” అంటున్నాడు.

“అలా అనకండి. ఇది ఎప్పుడో జరగాల్సింది. ఆలస్యం అయింది” అంది శ్వేత. అనుమానం వచ్చిందాయనకి.

“ఈ తాత కోసం ఇంటి దగ్గర తగాదాపడి వచ్చారా?”

“అవన్నీ మనం తర్వాత మాట్లాడుకుందాం తాతగారూ” అంది ఆద్య. అప్పుడు రిత్విక్ కేసి తిరిగాడు...

“రిత్విక్... నా మనవరాళ్లు... శ్వేత... ఆద్య... మై ప్రౌడ్ గ్రాండ్ డాటర్స్” అన్నాడు ఉద్వేగంగా. ఇద్దరూ రిత్విక్‌ని గుర్తు పట్టారు. ఆ పుస్తకం వెనకాల అతని ఫోటో వుంది.

“మీరు గ్రాండ్ పా మ్యూజింగ్స్ పుస్తకం రాసారు” అంది ఆద్య

“అవునమ్మా... ఆ నవలను ముందు నాకే పంపాడు. నేను ప్రచురించలేక పోయాను”.

“అదేంటి తాతగారూ...! అలాంటి నవలలు మీకు నచ్చటం మానేసాయా?” అంది శ్వేత.

“ఈ మధ్య కాలంలో పత్రిక స్వరూపం మారిపోయింది. సారీ తాతగారు ఇలా అంటున్నందుకు. ఇప్పుడు మన పత్రికలో ముఖ్యంగా మంత్లీలో నాకు మీ హృదయం కనిపించటం లేదు. వ్యాపారం. రొటీన్ స్టఫ్ కనిపిస్తోంది. మంచివి సంవత్సరానికి ఒకటి రెండు నవలలు ప్రచురిస్తే పత్రిక సర్క్యులేషన్ అంత డ్రాస్టిక్‌గా పడిపోతుందని నేను అనుకోను” అంది ఆద్య.

రిత్విక్ అందరినీ ఆశ్చర్యంగా చూస్తున్నాడు. గోవింద్ బుద్ధ మనవరాళ్లు తన నవల గురించి మాట్లాడటం అతను వూహించనిది.

“మనం అవన్నీ మాట్లాడుకుందాం. దానికి ముందు ఒక విషయం మీకు చెప్పాలి. మన కుటుంబంలో ఘర్షణ జరిగినప్పుడు ఇలా జరగకూడదు. మీ అందరూ కలవాలి, ఎప్పటికయినా కలుస్తారు అని ముందుగా ఉత్తరం రాసింది రిత్విక్”.

ఇద్దరూ రిత్విక్‌ని కృతజ్ఞతా భావంతో చూస్తున్నారు.

“అప్పుడు నేను ఆ తీవ్రతలో వున్నాను. అందుకే కొంత కాలం నేను రిత్విక్‌ని దూరంగా పెట్టాను” అని...

“మన దగ్గర నా గురుతుల్యులు వున్నారు. ముందు వారిని కలుద్దాం రండి” అని రామకృష్ణ దగ్గరకు తీసుకు వెళ్లాడు. అప్పుడాయన ఓ ఇంగ్లీష్ పుస్తకం చదువుతున్నారు.

“సర్” అని పిలిచాడు. రామకృష్ణ పుస్తకం పక్కన పెట్టి కళ్లజోడు సవరించు కున్నాడు. ముందు అస్పష్టంగా కనిపించారు. క్రమంగా ఉద్వేగంగా చూస్తున్న ఆద్య, శ్వేతని చూసాడు.

“నువ్వు శ్వేత... నువ్వు ఆద్య.. అవునా!”

ఇద్దరూ ఒకరి నొకరు చూసుకుని ఆయన పాదాలు టచ్ చేసారు. పక్కన కూర్చున్నారు. ఆయన బలవంతం మీద.

“వాటే మెమరబుల్ డే బుద్ధా” అన్నాడు తన్మయత్వంగా...

గోవింద్ కళ్లు చెమర్చుతున్నాయి.

“మీ తాతగారు మీ ఇద్దరి గురించి తలవని రోజు వుండదు. ఏమయినా మీరు ఈ రోజు మీ తాతకి మరో ఇరవై సంవత్సరాల ఆయుష్షు పెంచారు” అన్నాడు.

“బుద్ధా ఇది మనవరాళ్లు వచ్చిన సందర్భం. ఎంజాయ్ చెయ్యండి” అన్నాడు.

* * *

సముద్రపు ఒడ్డున గోవింద్, శ్వేత, ఆద్య కూర్చున్నారు.

సముద్ర కెరటాలు వారి మనసుల్లో ఉద్వేగాల్లా విరుచుకుపడుతున్నాయి.

“ఇప్పుడు చెప్పండి” అన్నాడు గోవింద్ ఇద్దరినీ చూస్తూ...

“మేం చెప్పటానికి రాలేదు. మీ నుండి వినటానికి వచ్చాం తాతగారూ” అంది శ్వేత.

“మాకు కొన్ని విషయాలు లీలగా తెలుసు. ఏం జరిగింది అన్నందుకు అందరికీ కోపం వచ్చింది. అయితే ఇందులో అమ్మమ్మ లేదు. తను మనశ్శాంతి కోసం యాత్రల్లో వుంది. మీకు కూడా చెప్పటానికి ఇష్టం లేకపోతే చెప్పండి. మనం స్నేహితులుగా వుందాం” అంది ఆద్య.


గోవింద్ బుద్ధ కళ్లు మూసుకున్నాడు కొద్ది క్షణాలు... **(సశేషం)**






**ఖ**ర్చులు చేసిన తరువాత మిగిలే మొత్తాన్ని పొదుపు చేయడం కాదు. పొదుపు చేయవలసిన మొత్తం నిర్ధారించుకున్నాక, మిగిలినదే ఖర్చు చేయాలి.

**–వారెన్ బఫెట్**



తనకు అవసరంలేని వస్తువును ఎవరైతే కొనుగోలు చేస్తాడో, వాడు తన సొమ్మును తానే దొంగతనం చేసినట్టు. **–స్వీడన్ సామెత**

నీ డబ్బు నీ చేతికి రాకుండానే ఖర్చు మొదలెట్టకు. **– థామస్ జఫర్సన్**



# రూపాయి–డాలరు మారకపు విలువ మార్పుల వేళ

**భా**రతదేశపు రూపాయి మారకపు విలువ అంతర్జాతీయంగా తగ్గటం వలన దేశీయ ఆర్థిక కార్యకలాపాలపై, స్థూల దేశీయ ఆదాయంపై, ఎగుమతులు–దిగుమతులపై, షేర్ మార్కెట్లు ట్రేడింగ్‌లో, దేశీయంగా, అంతర్జాతీయంగా ఎటువంటి ప్రభావాన్ని కలిగిస్తుందో తెలుసుకోవడం ద్వారా, రాబోవు ఆర్థిక పర్యావసానాన్ని అంచనా వేయగలిగే నైపుణ్యాలు పొందగలుగుతాము.

సంవత్సరం క్రితం వరకు డాలర్‌కు 77 రూపాయలుగా ఉన్న మారకపు విలువ నేడు సుమారు 85 రూపాయలకు పెరగడం వల్ల రూపాయి విలువ క్రమక్రమంగా తగ్గుతుంది. దీనికి అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక రంగాలలో చోటు చేసుకుంటున్న అనేక కారణాలు ఉన్నాయి.

ఎగుమతుల ద్వారా సమకూరే రాబడులు సన్నగిల్లుతూ, దిగుమతులకు ఎక్కువ మొత్తంలో చెల్లింపులు చేయవలసి రావలసిన స్థితి కలుగుతుంది. ఫలితంగా, దేశీయ ఆర్థికస్థితిలో 'ద్రవ్యోల్బణానికి' అవకాశం కలుగుతుంది. దేశీయ స్థూలఉత్పత్తి విలువ తగ్గుతుంది.

దేశీయ ఉత్పత్తులను పెంపొందించుకోవటం ద్వారా, అంతర్జాతీయ ఉత్ప త్తులపై ఎక్కువగా ఆధారపడకుండా, వాటికి సరైన ప్రత్యామ్నాయ ఉత్పత్తులను సృష్టించుకోవటం ద్వారా సుస్థిరమైన ఆర్థిక స్థితిని పొందగలుగుతాము.

**ఆధునిక ఆర్థిక వలలు**

12 శాతం వడ్డీ గ్యారెంటీలతో అనేక 'స్టార్టప్ కంపెనీ'లు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. మధ్య తరగతి వర్గం ఎక్కువగా వాటిపట్ల ఆకర్షితులై కనీసం రూ. 5,000 నుండి పది వేల వరకు డిపాజిట్లు చేస్తున్నారు.

ఇక్కడే అంతర్గతంగా అసలు సమస్య ఉంది. నూతనంగా ఆవిష్కరించిన 'కంపెనీల'కు భవిష్యత్ ఎలా ఉంటుంది? దీర్ఘకాలంగా అవి భారీ మొత్తంతో ఎదుగుతాయా? తెలియని ప్రయోగాలు, అదే 'పదివేలు' మార్కెట్టు గల పెద్ద కంపెనీలు ఒకటి లేదా ఐదు షేర్లలో పెట్టుబడిగా ఉంచితే, రెండు ప్రయోజనాలు ఉంటాయి.

వాటి 'షేర్ల'కు మార్కెట్‌లలో డిమాండ్ ఉండటం వల్ల మనం ఏ రోజైనా, మన పెట్టుబడులను తిరిగి వెనక్కు తీసుకోగలిగే "ద్రవ్యత్వం" ఉండటం.

కనుక, స్టార్టప్ కంపెనీల 12 శాతం వడ్డీ వలయంలో చిక్కుకోరాదు.

ఆర్థిక విషయాలలో ఒక నిర్ణయం తీసుకొనే ముందుగా, 'రిస్క్ రివార్డ్ కర్వు' (ఆర్.ఆర్.సి) గురించి అవగాహన ఉండాలి.

బ్యాంకులలో ఉంచే 'ఫిక్సెడ్ డిపాజిట్'లకు తక్కువ నష్టభయంతో పాటు రాబడులు కూడా అన్ని స్థాయిల్లో ఉంటాయి.

అదే 'క్రిప్టో కరెన్సీ'లలో పెట్టుబడులు అధిక నష్ట భయం కలిగి ఉన్నా, అధిక రాబడులకు అవకాశాలు మెండుగా ఉన్నాయి.

**తల్లిదండ్రుల పాత్ర - ఆర్థిక అక్షరాస్యత నిర్వహణ**

చిరుప్రాయం నుంచి పిల్లలకు డబ్బు విలువను తెలియచేస్తూ పొదుపును నేర్పించాలి. భవిష్యత్ కాలంలో బాధ్యతాయుతమైన వారి ద్రవ్య నిర్వహణ శక్తికి అది పునాదిగా మారుతుంది.

1. తల్లిదండ్రులు పిల్లలతో అన్ని సమయాలలో డబ్బు ప్రాముఖ్యత, పొదుపు ఆవశ్యకతలను గురించి నిరంతరం మాట్లాడడం ప్రారంభించాలి. ఫలితంగా వారికి 'డబ్బు' విలువ తెలుస్తుంది.

2. తల్లిదండ్రులు తమ పిల్లలకు ద్రవ్య విలువ, సంపాదన, వ్యయం, పొదుపు, పెట్టుబడులు మొదలైన అన్ని రకాల ఆర్థిక కార్యక్రమాలవల్ల జరిగే లాభ నష్టాలను అర్థమయ్యేలా బోధించాలి. దానివల్ల వారికి తగిన విషయ పరిజ్ఞానం కలిగి భవిష్యత్‌లో తగు ఆర్థిక నిర్ణయాలు తీసుకో గలుగుతారు.

3) ఉన్నత పాఠశాలలో టీనేజ్ విద్యార్థులకు ఆధునిక మనీ మేనేజ్‌మెంటు కాన్సెప్ట్‌లను వారు అర్థం చేసుకునే విధంగా బోధించాలి.

4) విద్యార్థుల కోరికలు, అవసరాలు, సౌకర్యాలు, మోసాలు మధ్య గల తేడాలను తెలియచేయాలి. అనవసరమైన వస్తు వినియోగం చేయకుండా వారిలో ఆర్థిక క్రమశిక్షణను కలిగించాలి.

(సమాప్తం)




**కె. గోపీకృష్ణ**
**విశ్రాంత ఉపన్యాసకులు**

శాస్త్రం అంటే ఏమిటో ఒకే ఒక వాక్యంలో నిర్వచించారు డాక్టర్ స్వాతి. వ్యవసాయరంగాన పేరొందిన భారతీయ శాస్త్రవేత్త ఆమె. ఈ ఏడాది (2023)కి సంబంధించి ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. ఇదే సందర్భంలో, అభినందన సదస్సులో మాట్లాడుతూ.. అంశాల క్రోడీకరణ. ప్రస్ఫుటరీతి నిర్ణయం, సూత్రీకరణ సముదాయమే శాస్త్రమన్నారు. ఇవే మూడింటినీ కలగలిపి వరి పరిశోధనకు అన్వయించారు కాబట్టే, అంతర్జాతీయ విఖ్యాతిని సొంతం చేసుకున్నారు. దేశ రాజధాని నగరంలోని ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఆర్ఆర్ఐ) విభాగ అధినేత్రి. తన విభాగమైన క్షేత్ర పరిశోధనను పురోగమింపచేయడంలో, సకాలంలో సరైన తీరులో సమన్వయించడంలో అద్భుత ప్రతిభ చూపారన్నది అవార్డు కమిటీ ప్రశంస. నలభయ్యి ఏళ్లలోపు వయస్కురాలైన స్వాతి శాస్త్రరంగంలో అద్వితీయంగా నిలిచారన్నదీ మరో కితాబు. ప్రత్యేకించి చిన్నతరహా వ్యవసాయదారులకు వెన్నుదన్ను అయ్యారని, పలువిధాల సేవా సహాయ సహకారాలతో తనదైన ఓ శాశ్వత ముద్ర వేశారనీ పురస్కృతి నిర్ణయ వ్యవస్థ 'వరల్డ్ ఫుడ్ ఫౌండేషన్' ప్రకటించింది. వీటన్నింటి వివరాలనూ పరిశీలించి చూస్తే చాలు, స్వాతి సాధించిన ఘనత ఎంత అత్యున్నతమో అవగతమవుతుంది. శాస్త్రవేత్త అనే పదానికి పర్యాయమై వెలుగుతున్నారో సంపూర్ణంగా ప్రత్యక్షమవుతుంది.



# వరి పరిశో

స్వాతి స్వస్థలం ఒడిశా. అక్కడి ఆర్థిక సుస్థితికి ప్రధాన వనరు వరి. మొత్తం జనాభాలో అరవై శాతంపైగా వ్యవసాయాధార జీవనం గడుపుతుంటారు. ప్రత్యేకించి మహానది డెల్టాలో అధికంగా ఉండేది వరే! ఎంతగానో అవగాహన, క్షేత్ర సంబంధ అనుభవమూ ఉన్న కుటుంబంలో పుట్టారు ఆమె. మొదటి నుంచీ శోధన, సాధన గురించిన మక్కువే విస్తృతంగా ఏర్పడింది. పదహారేళ్ల క్రితం హైదరాబాద్‌లోని ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి సైన్స్ డిగ్రీ స్వీకరించారు. వ్యవసాయ శాస్త్రంలో మరెన్నో అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, గట్టిపట్టు సాధించిన నేపథ్యం తనది. అనేక విస్తరణ విధానాల పరంగా లోతైన అనుశీలన కొనసాగించి, పీహెచ్‌డీ సంపాదించి డాక్టర్ అయ్యారు. అత్యాధునిక తీరు తెన్నులను పరిపూర్ణంగా ఆకళింపుచేసుకున్నారు. వాతావరణానికి అనువైన సేద్య నిర్వహణ, నాణ్యమైన విత్తనాల వినియోగం, సరికొత్త ప్రక్రియలను ఆచరణకు తేవడంలో కృతకృత్యులయ్యారు. డిగ్రీలో ఉండగానే, అంతర్జాతీయ స్థాయి శాస్త్ర విజ్ఞాన సదస్సు నిర్వహణలో కీలకపాత్ర వహించారు. పొలాల నుంచి విద్యాలయ ఆవరణలోనికి వ్యవసాయదారులను రప్పించి, వారితో సేద్యం అనుభవాలను సవివరంగా చెప్పించారు. వర్సిటీలో ఉన్న నాలుగేళ్లూ క్రియాశీలక స్థాయిని పరిపోషించారు. గ్రామీణ యాజమాన్య స్థితిపైన చూపుసారించి, పరిశోధకపత్ర సమర్పణ చేశారు. సాంకేతికత బదలాయింపుమీద దృష్టి కేంద్రీకరించారు.



**జంధ్యాల శరత్‌బాబు**

సీనియర్ జర్నలిస్ట్

### సృజన సంపన్నత

సేద్యం అనేది పుస్తకాల్లో ఉండదు. నిర్వహణమనే లక్షణం మాటలతో ఒరిగిపడేదీ కాదు. అనుభవశీలతే సత్వర ఫలితాలు ఇస్తుందన్నది స్వాతి మొదటి నుంచీ చెప్తున్న మాట. అది రాతలోకి వచ్చేలా, పుస్తక ప్రచురణ చేశారు స్వాతి. 'నేటి వరి విధానం' అంటూ సమగ్ర సమాచారంతో కూడిన వ్యాస పరంపరను వెలువరించారు. విత్తన వ్యవస్థలో సాంకేతికత, సృజనాత్మకత అంటూ పబ్లికేషన్స్ వెలయించారు.

స్వరాష్ట్రం ఒడిశాను బిహార్‌తో సరిపోలుస్తూ, అంతరాలను విశదీకరిస్తూ చర్చా పత్రాన్ని విడుదల చేశారు స్వాతి. కరవు కాటకాలను తట్టుకునే పద్ధతులను అందులో ఉదాహరణ సహితంగా వివరించారు. మేలైన, దీటైన, లాభదాయకమైన వంగడాల గురించి విశేషాలనేకం పొందుపరిచారు. 'వ్యవసాయ క్షేత్రం నుంచి విపణి సీమలోకి' అనే శీర్షికన వాస్తవ కథనాలనూ ప్రచురితం చేశారు. సామాజిక, ఆర్థిక ప్రతిబంధకాలను తొలగించుకునే మార్గాలనూ ప్రతిపాదించారు. ఇంతేకాకుండా, విత్తన ఉత్పత్తిరంగంలో సుశిక్షిత వనితా బృందాలను రూపొందించుకోవడంపై సూచనలిచ్చారు. 'విమెన్ రైస్ ఫార్మర్స్' అనేది తాను వివిధ సందర్భాల్లో ఉపయోగించిన పదబంధం. ప్రగతి పథంలో మహిళల



డాక్టర్ స్వాతి

పేరిట' రైస్ టుడే' సంచికలో అసంఖ్యాకంగా వ్యాసాలు రాశారు. ఏ పనిచేపట్టినా, సంపూర్ణత లభించేదాకా వీడని తత్వం. ఐఆర్ఆర్ఐలో రీసెర్చి డేటా మేనేజిమెంట్, కాలిఫోర్నియా వర్సిటీ పరంగా ఇంపాక్ట్ ఎవల్యూషన్, అదే విధంగా బేసిక్ సైంటిఫిక్ రైటింగ్ కోర్సుకు సంబంధించీ ప్రావీణ్యత గడించిన మహిళామణి. బహుముఖ ప్రజ్ఞాధురీణ.

### అంతటా నిపుణత

మాతృభాష ఒరియాతో పాటు తెలుగు, ఆంగ్లం, బెంగాలీ, హిందీ భాషల్లో నిపుణత డాక్టర్ స్వాతి సొంతం! మొదట్లో కొంతకాలం ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకురాలిగా బాధ్యతలు నిర్వహించారు. అనేక ప్రాజెక్టు మానిటరింగ యూనిట్లను పరిశీలించి, అధ్యయనం చేసి, కొన్నింటి స్థాపన – నిర్వహణలను చేపట్టారు. పరిపాలన, సాంకేతిక, పర్యవేక్షక విధుల నిర్వహణలో పేరు తెచ్చుకున్నారు. ప్రణాళిక, కార్యాచరణల్లో ముందు వరసన నిలిచారు. ప్రతీ దశలోనూ, వాస్తవిక



# ధనలో 'స్వాతి'ముత్యం

రీతులను పరిగణించి, ముమ్మందుకు సాగిపోయారు.

ప్రపంచ బ్యాంకు పర్యవేక్షణలో భారత ప్రభుత్వ సంయుక్త నిర్వాహకత్వంలో ఉన్న వ్యవస్థ – నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్. ఇందులో కార్యశీలత కనబరచిన స్వాతి ప్రముఖంగా.. మహిళారైతులను ప్రోత్సహించి ముందుకు నడిపించారు. వనితా రైతుల సాధికారతకు అనువుగా మార్గదర్శక సూత్రాల రూపకల్పనకు ఉపకరించారు. ప్రామాణికతను దృష్టిలో పెట్టుకుని జాతీయ, ప్రాంతీయ స్థాయుల్లో కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్జాతీయ నియమావళికి అనుబంధంగా వ్యవహరించి, వ్యవసాయ కుటుంబాల ఆత్మబంధువుగా పూర్తి అభిమానం పొందగలిగారు. ఏ దశలో కూడా రాజీ అన్నదే లేకుండా, పరిపూర్ణత నెలకొనేలా తోడూ నీడై నిలిచిన శక్తిశాలిని. వ్యావసాయిక పరిశోధన, అభివృద్ధి ప్రక్రియల్లో సరికొత్త ప్రమాణాలకు కారకురాలయ్యారు. ఆహారభద్రత, నైపుణ్య అభివృద్ధి లక్ష్యాలుగా వినూత్న పథకాల అమలుకు దోహదకారి అనిపించు కున్నారు. వరి పరిశోధనకు సంబంధించి, అంతర్జాతీయ స్థాయిలో తన ప్రత్యేకతను నిరూపించుకున్న ఆ లలన భారతీయ విలక్షణతను తేటతెల్లం చేయగలిగారు. ఆరు దశాబ్దాలకు పైగా చరిత్ర గల 'రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఎటువంటి లాభాపేక్ష లేకుండా, వ్యవసాయ పరిశోధనకు అంకితమైన సంస్థ. అందులో ప్రముఖురాలిగా డాక్టర్ స్వాతి తన స్థానాన్ని లబెట్టుకుంటున్నారు.

**విలక్షణ కృషికి పురస్కృతి**

చిన్నపాటి రైతులు సాగు చేసుకునేందుకు వీలైన వరివంగడాల రూపకల్పనే ఆమె ఘనత, విశిష్టత! అందుకనే వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ అభినందన మందారాలందించింది. ప్రపంచంలో ఆయా చోట్ల విశేష కృషి సాగించే యువ శాస్త్రజ్ఞులకు అవార్డును అందిస్తుంటుంది రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్. ఈసారి అవార్డు స్వాతికి లభించిందంటే, ఎంతో గర్వకారణం కాదా మరి? అమెరికాలోని ఒక ప్రత్యేక సదస్సు వేదికమీద అక్టోబరులో పురస్కృతి అందుకోనున్నారు ఆ శాస్త్రజ్ఞురాలు.

ఎవరి పేరుతో ఈ అవార్డు అంటే, నార్మన్ బోర్లాగ్ పేరుతో! అమెరికాలో సుప్రసిద్ధులు, ప్రపంచమంతటా శాస్త్రవేత్తలకు అభిమాన పాత్రులు ఆయన. ఆ దేశంలో హరితవిప్లవ రూపశిల్పి. నోబెల్ స్వీకర్తగా జగద్విఖ్యాతి. శాంతి బహుమతిని అందుకున్నవారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టి, అంచెలంచెలుగా, ఎదిగి అంతర్జాతీయ స్థాయిలో పేరెన్నిక గడించిన మహత్తర తత్వచింతన తనది. చీడపీడలను తట్టుకునేలా పొట్టిరకం గోధుమ వంగడాలను సృజించిన సంచలన వాది. అధిక దిగుబడినిచ్చే వాటితో ఆహారభద్రతకు భరోసానిచ్చిన శాస్త్రవేత్త. అంతటి మహనీయుని పేరిట గల బహూకృతిని భారతీయ వనితా శాస్త్రవేత్త అందుకుంటున్నారంటే, అంతకుమించిన జ్ఞాన సంపన్నత ఇంకేముంటుంది? వరి శోధన ద్వారా ఆమె సాగిస్తోందంతా ఆకలిని రూపుమాపే మహత్తర కృషి. ఆహారభద్రత సాధించేందుకు ఎంతగానో పరిశ్రమిస్తున్నందునే, ప్రతిష్ఠాత్మక అవార్డుకు అర్హురాలయ్యారు. ఒడిశాలో జన్మించి, పొరుగు రాష్ట్రమైన తెలుగునాట ఉన్నత విద్యాభ్యాసం సాగించి, ప్రసిద్ధ సంస్థల్లో వృత్తి – బాధ్యతలు నిర్వర్తిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా 'స్వాతీ! ది గ్రేట్' అని పిలిపించు కున్నారీ మగువ. నారీలోకానికి మార్గదర్శకంగా నిలుస్తూ, శాస్త్రజ్యోతిని విశ్వవ్యాప్తం చేస్తున్నారు. కలలను సాకారంచేసుకునే దారిని యువతకు నిర్దేశిస్తున్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం తోడైతే అద్భుతాలే సిద్ధిస్తాయి. వ్యవసాయ కుటుంబం నేపథ్యమున్న యువత అదే రంగాన పరమోన్నతి సంపాదించి, భారతీయతను మరింత వెలిగిస్తున్న సందర్భం ఇది. భారతీయులందరి హృదయాలూ పులకిస్తున్న ఈ శుభతరుణాన 'స్వాతీ! మీకు జేజేలు'. ★

**'కార్టూన్ పోటీ - 2023'లో సాధారణ ప్రచురణకు ఎంపికైనది**



# 'సంఘం మతోన్మాద సంస్థ కాదని పూజ్య బాపూజీ ఏనాడో చెప్పారు'

'నాకు హిందూత్వమంటే అంత పిచ్చి మమకారం లేదు' అని నేటి రాజకీయ నాయకులు ఎందరో వేదికలపై నిల్చుని ఉపన్యసిస్తూంటారు. కానీ వారి హృదయంలో హిందూత్వం అంటే అభిమానం చావలేదు; చావదు కూడాను. పైకి ఎన్ని విధాల మెరుగు రంగుల ఉపన్యాసాలిచ్చినా హృదయాంతరాళాలలో వెలుగులను గుబాళించే ఆ హిందూత్వం కోల్పోయినప్పుడు 'మనంత మననే కోల్పోతామ'ని రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ సర్ కార్యవాహ్ (ప్రధాన కార్యదర్శి) శ్రీ భయ్యాజీదానీ పూనా శాఖ విజయదశమీ మహోత్సవ సందర్భంలో ఉపన్యసించారు.

శ్రీ భయ్యాజీ ఇంకా ఇలా అన్నారు. సమాజంలో వ్యక్తికి ఎంత మహత్తు ఉన్నదో నిర్వచించి ఆచరణలో చూపిన మహామహులే మనలను జీవింపజేసిన రాష్ట్ర పురుషులు, పార్టీ కలహాలవల్ల దేశంలో వ్యాపించిన దుస్థితికి పరమౌషధం రాజకీయాలవల్ల లభించదు. మానవుని హృదయాన్ని మేల్కొలిపి పవిత్రమైన దేశభక్తిని పురిగొల్పే సంస్కృతియే వివిధ సమస్యా పరిష్కారానికి రామబాణం వంటి దివ్యౌషధం...

నేడు ఉపన్యాస వేదికలమీద నిల్చుని మహాద్భుతంగా ఉపన్యాసాలిస్తూ ప్రపంచాన్ని ఉద్ధరించాలనే మహానుభావులు ఎందరో, చాటుమాటున అవినీతికి పాల్పడి బ్లాకుమార్కెటు చేస్తూ డబ్బు సంపాదిస్తున్నారు, సిద్ధాంతాలకు, ఆచరణకు సంబంధం లేకపోవడమే దీనికి కారణం. సిద్ధాంతాలను ఉద్ఘాటించే ముందు, తానెంతవరకు వాటిని ఆచరించగలుగుతున్నాడో తెలుసుకోవాలి. దీనికి మన పరమపూజనీయ డాక్టర్జీ జీవితం ఒక మహత్తరమైన ఉదాహరణ....


సంఘం ఇన్నాళ్ళుగా సమాజసేవచేస్తున్నా రాజకీయాలకు దూరాన ఉంటూ వచ్చిందంటే కారణం కేవలం ఈనాడు రాజకీయాలల్లో కన్పడే నీచప్రవృత్తులే. అందుకే ఇకముందు కూడా రాజకీయాల్లో పాల్గొని తమ సిద్ధాంతాలకు కళంకం ఆపాదించరాదని సంఘం నిశ్చయించుకున్నది. ఈనాడు సంఘ స్వయంసేవకులను మభ్యపెట్టగల దురాశ లేదు.

ఈ దేశంలో పుట్టి పెరిగిన వర్ధిల్లిన హిందువులను సంఘటితపరచడమే సంఘం చేస్తున్న పని... మహమ్మదీయులు ఎందరో నిన్నటివరకు ఈ దేశం మాదేనని ప్రచారం చేసి ఈనాడు పాకిస్థానుకు తరలిపోయారు. కాని హిందువులు ఇక్కడే ఉన్నారు. హిందువులకు హిందూ దేశమే ఏకైక స్థానమని ఉన్నంతవరకు, హిందూస్థాన్ హిందువులదే. అంతవరకు సంఘం జీవించి ఉండక తప్పదు.

ఒకప్పుడు డాక్టర్ అసఫాలీ సంఘాన్ని గురించి 'ఇది మత విద్వేషాన్ని రెచ్చగొట్టే సంస్థ' అని వ్రాశారు. ఆ వ్యాసాన్ని మహాత్మాజీ చదివి 'సంఘం మతోన్మాదాన్ని రెచ్చగొట్టే సంస్థ కాదు. మహమ్మదీయుల పట్ల ద్వేషం రెచ్చగొట్టడం సంఘ కార్యక్రమం కాదు' అని స్వయంగా ప్రత్యుత్తరమిచ్చారు.

ఈనాడు సమాజంలో అనేక వ్యాధులు వ్యాపించి ఉన్నాయి. ప్రతి వ్యక్తీ స్వార్థంతో పదవీ వ్యామోహంలో పడి తపిస్తున్నాడు. ఇలాంటి పరిస్థితులలో మనం పథ్యం చేయకపోతే వ్యాధి ప్రబలమై సమాజ శరీరాన్ని నశింపజేసి దేశానికి అనర్థం చేకూర్చగలదు. పరమ పూజనీయ డాక్టర్జీ అన్నట్లు "దేశద్రోహులు లక్షల సంఖ్యలో ఉన్నా దేశానికి క్షేమం లేదు. దేశభక్తులు కొందరుంటే చాలు" అనే మంత్రమే మనకీనాడు మార్గం చూపగలుగుతుంది. అలాంటి ప్రయత్నం చేయడానికి మనం యత్నించి, దేశాన్ని రక్షించుకొని, అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులను పొందటానికి ప్రయత్నించాలి.

– 09.10.1949 జాగృతి నుండి



ముగ్గురు మహనీయుల జయంతి వారమిది. సెప్టెంబరు 25 దీనదయాళ్జీ జన్మదినం. అక్టోబర్ 2 గాంధీజీ, లాల్బహద్దూర్శాస్త్రిగార్ల జన్మదినం.

ముగ్గురూ ఒక తరానికి చెందినవారు కాదు. ఒక రంగానికి చెందినవారు కాదు. ఒకే పక్షానికి చెందినవారూ కాదు. దీనదయాళ్జీ స్వయంసేవకులు. గాంధీజీ సంఘసేవకులు. లాల్బహద్దూర్ రాజకీయవేత్త. శాస్త్రి ప్రధానమంత్రి అయితే – మిగిలిన ఇద్దరు ప్రభుత్వ రంగపు పొలిమేరలలో కూడా లేరు. సమాజ సేవాభావంతో బ్రహ్మ చర్యాశ్రమం స్వీకరించి జీవితాన్ని సమాజానికి అంకితం చేసిన సర్వసంగ పరిత్యాగి దీనదయాళ్జీ. వానప్రస్థంతో (అలా అనవచ్చునేమో) సర్వసంగ పరిత్యాగి గాంధీజీ. గార్హస్థమందు వారాంగనతో పోల్చదగిన రాజకీయమందుండిన గృహస్థు శ్రీ శాస్త్రి. ముగ్గురు మూడు రకాలుగా కనిపిస్తారు.

అయినా, ముగ్గురిలోను ఒక అనిర్వచనీయమైన ఏకత్వమేదో కానవస్తుంది. అంతేకాదు; జాతికీ ఈ ముప్పురికి మధ్య కూడా ఒకే సామాన్యత కనిపిస్తుంది. దానిని సగటు భారతీయత అనవచ్చునేమో. భారతీయతకు ఒక సాధారణమైన ఉదాహరణమే చూపవలసి వస్తే వీరిలో ఏ ఒక్కరినైనా చూపవచ్చు, సంస్కృతిలో, ధార్మిక విశ్వాసాల్లో నిరాడంబరతలో, జీవనంలో, దృక్పథంలో సారూప్యత, భారతీయత ప్రతిబింబిస్తుంది.


గాంధీకి నెహ్రూకు మధ్య ఆ సాన్నిహిత్యం, ఏకత్వం కానరాదు – గాంధీకి వారసుడు నెహ్రూ అని ఎన్ని ప్రచారాలు చేసినా; వారి జీవన దృక్పథాలే కలియవు; అలాగే ఇందిరకు – శాస్త్రికి మధ్య ఆ సారూప్యత కానరాదు, గాంధీ– దీన దయాళ్జీ కలిసి పనిచేసిన రంగమే లేదు– విశాల దేశం తప్ప; అదీ వేర్వేరు సమయాలలో, పైగా రాజకీయముల విషయంలో సారూప్యత కానరాదు, అయినా అనిర్వచనీయమైన జీవన సారూప్యత తాత్విక ఏకత్వం కానవస్తుంది.

ధర్మనిష్టమైన జీవన వ్యవస్థ, జాతీయమైన రాజకీయ వ్యవస్థ, వికేంద్రీకృతమైన ఆర్థిక వ్యవస్థ, సర్వసమగ్రమైన సాంఘిక న్యాయము, కారుణ్యాత్మక

# ముగ్గురు నేతలు

దృష్టి, అహింసాస్తేయాదులతో కూడిన నైతిక, ఆధ్యాత్మిక చింతన, ఆహారపానాదుల అలవాట్లు, నిరాడంబరత ఇత్యాదులన్నీ ముువ్వురిలోను సామాన్యంగా కానవస్తాయి. ప్రధానంగా భారతీయత నుండి ఆవిర్భవించిన సామాన్యత ఇది. నెహ్రూ, ఇందిర వగైరాలకు పై ముువ్వురికి మధ్య ఆ జీవన సారూప్యం, ఆ భారతీయతా సారూప్యం కానరాదు. పై ముువ్వురిలో అచ్చమైన స్వదేశీయత కానవస్తే – వీరిలో విదేశీయత కానవస్తుంది.

ముువ్వురి జీవన విజయాలు సైతం – ముువ్వురికి జాతి జీవనంలో ప్రత్యేక స్థానం కల్పిస్థాయి, వివేకానంద, తిలక్ ప్రభృతులేర్పరిచిన స్వరాజ్య, స్వతంత్ర భావనా ప్రాతిపదికపై– జాతిలో మూలమూల స్వాతంత్ర్య భావాన్ని నెలకొల్పి, సమరం సాగించిన యోధుడు, నాయకుడు! గాంధీజీ. స్వరాజ్యానంతరము నెహ్రూ హయాంలో జాతి విచిత్రమైన నిర్వీర్యతలో పడి చివరకు చైనా చేతిలో ఎన్నడు ఎరుగని పరాజయాన్ని భారత వీర సైనికుల



పొందిన దుస్థితిలో, మరొక్కమారు సైనిక ప్రతిష్ఠ పునఃప్రతిష్ఠింపబడింది శ్రీ శాస్త్రి ప్రధానమంత్రిత్వంలో. ఇక దీనదయాళ్‌జీ జీవన విజయం భవిష్యద్భారతావనికి ప్రాతిపదికలు చేసినట్టిది. ధర్మార్థ కామమోక్షదాయకమగు ఏకాత్మక మానవతా వాద సిద్ధాంతమును ప్రతిపాదించడం ద్వారా దేశానికి – ప్రపంచానికి కూడా – నూతన రాజకీయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ఘనత ఆయనది. అంతేకాదు, ఆ సిద్ధాంతాన్ని జాతి జీవనరంగంలో వాస్తవం చేయడానికి ఆవశ్యకమైన మహత్తర సంఘటనను, వ్యవస్థను, ఉద్యమాన్ని రూపొందించిన ఘనత కూడా ఆయనదే.

అదేమి చిత్రమో ముువ్వురి మరణాలున్ను ఒకే విధంగా జరిగాయి. గాంధీజీ హత్యకు గురి అయినారు. లాల్‌బహద్దూర్ మరణం తాష్కంట్‌లో సందేహాస్పద పరిస్థితుల మధ్య జరిగింది. దీనదయాళ్‌జీ కూడా హత్యకు గురి అయినారు.

సగటు భారతీయత అనదగిన జీవన విధానములు, సిద్ధాంతములు, ఆదర్శములు వారివి. జాతి నేడు కోల్పోతున్నది వీనిని. వీరి జయంతులు – గుర్తుచేసేది ఆ భారతీయతను. దానిని సాధించడంలో వారికి నిజమైన శ్రద్ధాంజలి.

**– 05.10.1970 జాగృతి సంపాదకీయం**

## 'సంఘ మిత్ర' వైద్యసేవలు






**నంద్యాల:** సంఘమిత్ర సేవాసమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24, 2023న ఐ.ఎం.ఎ మహిళా విభాగం ప్రసూతి వైద్యనిపుణులు నల్లమల అడవుల్లో ఉన్న కొట్టాల చెరువు తాండాలో మహిళా శిశు వైద్య శిబిరం నిర్వహించారు. 170 మంది మహిళలకు, శిశువులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేసి, పోషకాహారము, వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన సలహాలు ఇచ్చారు. కార్యక్రమం సంయోజకులు, సంఘమిత్ర ప్రధాన కార్యదర్శి చిలుకూరు శ్రీనివాస్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్ వినాయక మంటపం వద్ద ఆర్‌ఎస్‌ఎస్ ఘోష్



**భాగ్యనగర్:** ఖైరతాబాద్ వినాయకుని దగ్గర భాగ్యనగర్ సంభాగ్ ఘోష్ ప్రదర్శన సెప్టెంబర్ 25న జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఘోష్ ప్రముఖ్ పూర్ణానంద శర్మ, సంభాగ్ ఘోష్ ప్రముఖ్ భిక్షపతి, భాగ్యనగర్ విభాగ్ ప్రచారక్ అచ్యుత్ అలువాల తదితరులు పాల్గొన్నారు.

**పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు అనగానే, ఎవరికి వారు ఏవేవో ఊహించుకున్నారు. విశ్లేషణలు చేశారు, వ్యాఖ్యానాలు వినిపించారు. మీడియా కథలల్లితే, విపక్షాలు జరగరానిది ఏదో జరిగిపోతోందని గగ్గోలు పెట్టాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని భ్రష్టు పట్టించే భయంకర నిర్ణయం ఏదో తీసుకోబోతున్నారని అన్నారు. అందుకే, ఈ ప్రత్యేక సమావేశాలనే వాదనలు వినిపించారు. అయితే, అంతిమంగా జరగవలసిందే జరిగింది. విపక్షాలు, ఆశించిందీ, ఆకాంక్షించిందీ, ఏదీ జరగలేదు. ప్రభుత్వం ఆశించిందే జరిగింది. ప్రభుత్వ చిత్తశుద్ధి, సంకల్పం ముందు విపక్షాల ఓట్ల రాజకీయాలు, రాజకీయ ఎత్తుగడలు పని చేయలేదు. ప్రభుత్వ చిత్తశుద్ధి, సంకల్పానికి తోడు సమయ స్ఫూర్తి విజయం సాధించింది. అసాధ్యం అనుకున్నది సుసాధ్యమైంది. ఇటీవలి కాలంలో దేశం సాధించిన విజయాలలో మరో విజయం వచ్చి చేరింది. చంద్రయాన్-3, జీ-20 విజయాల సరసన మహిళా రిజర్వేషన్ బిల్లు వచ్చి చేరింది. విపక్షాల కథ మరోమారు అడ్డం తిరిగింది.**



అదలా ఉంచి, విషయానికి వస్తే, 'భారతీయ నారీశక్తి వందన్'తో కొత్త పార్లమెంట్ భవనంలో అడుగు పెట్టిన మోదీ ప్రభుత్వం, ఒకటే లక్ష్యంతో అడుగులు వేసింది. ప్రధానంగా మీడియా వంట కాలను ముట్టుకోలేదు. విపక్షాల 'ముందస్తు' భయాలను పట్టించుకోలేదు. జమిలి చిక్కుల జోలికి వెళ్లలేదు. విపక్షాల వికారాలను, మీడియా మేధావుల సూక్తి ముక్తావళిని వినిపించుకోలేదు. మిగిలిన రణగొణ ధ్వనుల జోలికి వెళ్లలేదు. గురుదేవులు ద్రోణాచార్యులు పెట్టిన ఏకాగ్రత పరీక్షలో నెగ్గిన అర్జునుని వలె, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అదే ఏకాగ్రతతో తమ అస్త్రాన్ని (మహిళా రిజర్వేషన్ బిల్లు) సంధించారు. విజయం సాధించారు. విపక్షాల కూటమికి చుక్కలు చూపించారు. ఆ విధంగా సుమారు దశాబ్దాలకు పైగా కులాల చిక్కు ముళ్లలో చిక్కుకున్న 'మహిళా రిజర్వేషన్' బిల్లుకు మోదీ ప్రభుత్వం మోక్షం ప్రసాదించింది. విపక్షాల ఉమ్మడి ఎత్తుగడలను చిత్తుచేసిన మోదీ వ్యూహంతో మహిళా రిజర్వేషన్ బిల్లు ఇంచుమించుగా ఏకగ్రీవ ఆమోదం సాధించింది. బీజేపీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన మరో వాగ్దానాన్ని మోదీ ప్రభుత్వం నిజం చేసింది.

రాజ్యసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన బిల్లు, లోక్‌సభలోనూ, ఇంచుమించుగా అదే ఫలితాన్ని సాధించింది. కొందరు కాంగ్రెస్ సభ్యులు ముఖ్యంగా, తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ముగ్గురు (రేవంత్‌రెడ్డి, ఉత్తమ కుమారరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఓటింగ్'కు దూరంగా ఉన్నారనుకోండి. ఆ విధంగా మూడు దశాబ్దాలకు పైగా 'పీరియాడికల్'గా, పార్లమెంట్'కు వచ్చిపోతున్న మహిళా రిజర్వేషన్ బిల్లు, మోదీ మంత్రంతో చట్టమై కూర్చుంది. దేశం 'ఆమె'కు వందనం చేసింది మహిళలకు మోదీ అభివందనం చేశారు.

అయితే, మూడు దశాబ్దాలుగా, వచ్చి పోయిన ప్రభుత్వాలకు సాధ్యంకాని, మహిళా రిజర్వేషన్ బిల్లు, ఇప్పుడు ఎలా ఉభయ సభల ఆమోదం పొందింది? ఈ అనూహ్య విజయం ఎలా సాధ్యమైంది? మోదీ ఏం మాయ చేశారు? ఏం మంత్రం వేశారు? ఇప్పుడు ఇలాంటి ప్రశ్నలు చాలానే మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. మేధావుల మెదళ్లను తొలిచేస్తున్నాయి. నిజానికి మోదీ ఏ మాయ చేయలేదు, ఏ మంత్రం వేయలేదు, 'చిత్తశుద్ధి' చూపారు. సంకల్ప బలంతోనే అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. అందుకే, విపక్షాలు మళ్లీ మరోమారు కులాల కుంపట్లు రాజేసే ప్రయత్నం చేసినా, ఫలితం లేకపోయింది. మోదీ ప్రభుత్వం ఏమనుకుందో, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకుంది.

మరోదారి లేక బిల్లుకు మద్దతు తెలిపిన విపక్షాలు, తమ భంగపాటును సర్ది చెప్పుకునే ప్రయత్నంలో మరోమారు, తప్పులో కాలేస్తున్నాయి తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయి. 'యూఎన్ విమెన్' సహా ప్రపంచ స్థాయిలో లింగ సమానత్వానికి కృషి చేస్తున్న పలు అంతర్జాతీయ సంస్థలు, దేశ విదేశాల మహిళనేతలు భారత ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా, విపక్ష 'ఇండీ' కూటమి నేతలు మాత్రం, బిల్లులో లోపాలను వెతికే ప్రయత్నాలు చేస్తున్నారు. మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని, రాహుల్ గాంధీ ఏడునొక్క రాగంలో గోల చేస్తున్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఈ బిల్లును పట్టించుకోక పోవడం తప్పేనని వాపోతున్నారు. అంతేకాదు.. ఇప్పటికీ కులాల కుంపట్లను రాజేసి, రాజకీయ చలి కాచుకునే కుట్రలు సాగిస్తున్నారు. విషం చిమ్ముతున్నారు.

అయితే, మోదీ ప్రభుత్వం ముందుచూపుతో, దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, తీసుకున్న చారిత్రక నిర్ణయాలను తప్పు పట్టడం విపక్షాలకు కొత్త కాదు. ఇలాంటి చారిత్రక తప్పిదాలు చేయడం వాటికి అలవాటుగా మారింది. అందుకే, అవి ప్రజలకు దూరమై ఓటమి నుంచి ఓటమికి వేగంగా అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా, అస్తమయానికి చేరువుగా ఉన్న కాంగ్రెస్ కమ్మీలు, అలాగే ప్రాంతీయ, కులతత్వ, కుటుంబ పార్టీలు... బీజేపీ, మోదీలను రాజకీయంగా ఎదుర్కోలేక, ప్రజలలో దేశం పట్ల, దేశ ప్రగతి, పట్ల విశ్వాస రాహిత్యాన్ని పెంచి, ఆత్మవిశ్వాసాన్ని, దెబ్బతీయడం ద్వారా, విదేశీ శక్తుల అండదండలతో అధికారంలోకి రావాలని కలలు కంటున్నారు.

అందుకే, విపక్షాలు విదేశీశక్తుల ఎన్జీఓ ఎజెండాను ఆసరా చేసుకుని, మోదీ ప్రభుత్వం

# ఒకటే లక్ష్యం.. ఒకటే గమ్యం..
# అదే 'మోదీ' మంత్రం



**రాజనాల బాలకృష్ణ**
**సీనియర్ జర్నలిస్ట్**

తీసుకున్న ప్రతి చారిత్రక నిర్ణయాన్ని, హ్రస్వదృష్టితో విమర్శించడం, అలవాటుగా మార్చుకున్నాయి. స్వచ్ఛ భారత్ మొదలు ఆత్మనిర్భర్ భారత్ వరకు, జీఎస్టీ వంటి యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రయత్నించి విఫలమైన సంస్కరణల విషయంలోనూ విపక్షాలు అదే ధోరణి అవలంబిస్తున్నాయి. చివరకు కొవిడ్ వాక్సిన్ విషయంలో, పాక్ ఉగ్రవాద స్థావరాలపై మన సైనికులు జరిపిన మెరుపుదాడుల విషయంలో విపక్షాలు శత్రు దేశాలకు కొమ్ము కాస్తున్నాయి.

ఇక్కడ ఒక్కసారి వెనక్కి వెళ్లి చూస్తే, దీర్ఘకాల ప్రయోజనాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా మోదీ ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని విపక్షాలు విమర్శిస్తూనే ఉన్నాయి. ప్రభుత్వం తీసుకున్న ప్రతి కీలక నిర్ణయానికి విపక్షాలు మోకాలడ్డుతూనే ఉన్నాయి. అంతేకాదు, కొత్తగా కొలువు తీరిన 'ఇండీ' చుక్కల కూటమి పెద్ద ముత్తయిదువులు, తమ పాతివ్రత్యాన్ని పణంగా పెట్టి మరీ.. మోదీనీ, ఆయన ప్రభుత్వాన్ని శపిస్తున్నారు. శాపనార్థాలు పెడుతున్నారు. అయితే, ఇటీవల విపక్షాలు తెచ్చిన అవిశ్వాస తీర్మానానికి సమాధానం ఇచ్చే సందర్భంగా, ప్రధాని మోదీ అన్నట్లుగా విపక్షాలకు రహస్య వరం ఏదో ఉన్నట్లుంది. విపక్షాల నేతలు ఎవరికి కీడు తలబెడితే వారికే మేలు జరుగుతోంది. విపక్షాలు పెట్టే శాపాలు, శాపనార్థాలు దీవెనలుగా, వరాలుగా మారుతున్నాయి. అవును... ఏకాగ్ర చిత్తంతో అడుగులు వేస్తూ, సంస్కరణల బాటలో ఆర్థిక ప్రగతిని సాధిస్తూ, మరోవంక అవినీతి రహిత పాలనతో ప్రజల సంపూర్ణ విశ్వాసాన్ని పొందుతున్న మోదీ ప్రభుత్వ విషయంలో విపక్షాల బెరుకు కూతలను ప్రజలు విశ్వసించడం లేదు.

2018 ఎన్నికలకు ముందు విపక్షాలు, మోదీపై 'రాఫెల్' బురద చల్లేందుకు చాలా చాలా ప్రయత్నించడం గుర్తుండే ఉటుంది, ముఖ్యంగా, కాంగ్రెస్ పార్టీ (అప్పటి) అధ్యక్షుడు రాహుల్ గాంధీ రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారంలో మోదీపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు చేశారు. అదే ప్రధాన అస్త్రంగా, సుప్రీం కోర్టు చేయని వ్యాఖ్యలను చేసినట్లు చిత్రించి, 'చౌకీ దార్ చోర్' నినాదంతో ఎన్నికల ప్రచారం సాగించారు. ఏమైందో చూశాం, ప్రజలు మోదీకి జై .. కొట్టారు. బీజేపీకి 303 సీట్లు ఇచ్చి 'చేతి'కి వాతలు పెట్టారు. కాంగ్రెస్‌ను రెండంకెలకు పరిమితం చేశారు. మరో వంక, సుప్రీంకోర్టులోనూ రాహుల్ గాంధీకి చుక్కెదురైంది. ఒకటికి రెండుసార్లు సుప్రీం కోర్టుకు రాహుల్ గాంధీ, లిఖిత పూర్వకంగా. 'క్షమాపణలు' చెప్పుకున్నారు.

అదొకటి అలా ఉంటే, ఈ వ్యవహారంలో, మోదీ ప్రభుత్వం అంబానీకి లాభాలు చేకూర్చేందుకు, హెచ్ఎఎల్‌ను నష్టాల్లోకి నెట్టేస్తున్నారని విపక్షాలు గగ్గోలు పెట్టాయి. హెచ్ఎఎల్ కార్మికులను రెచ్చగొట్టి, ఆందోళన సృష్టించాయి. గత యూపీఏ ప్రభుత్వ హయంలో నష్టాల్లోకి జారుకున్న హెచ్ఎఎల్ సంస్థ ఇప్పుడు లాభాల బాటలో సాగుతోంది. గడచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా అత్యధిక ఆదాయం రికార్డు చేసింది. అలాగే, విపక్ష కూటమి భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ), బ్యాంకింగ్ వ్యవస్థలను బజారుకు ఈడ్చే ప్రయత్నం చేసింది. అయితే, ఇప్పుడు, ఇటు ఎల్ఐసీ, అటు బ్యాంకింగ్ వ్యవస్థలు రెండూ రోజురోజుకు మరింతగా బలోపేతం అవుతున్నాయి. ప్రణాళికాబద్ధ, సుస్థిర ప్రగతికి బాటలు వేసే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం ప్రారంభించిన డిజిటల్ ఇండియా, స్టార్ట్ అప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి అనేక ప్రయోగాలు విజయవంతగా అమలువుతున్నాయి. స్టార్ట్ అప్ ఇండియా ప్రారంభానికి ముందు దేశంలో కేవలం ఐదంటే ఐదు ఉన్న స్టార్ట్ అప్ కంపెనీల సంఖ్య ఇప్పుడు వేలలోకి చేరింది. స్టార్ట్ అప్ కంపెనీల స్థానంలో మన దేశంలో ప్రపంచంలోనే ముందు వరసలో ఉంది. అయినా, ఈ పథకాన్ని, నీరు కార్చేందుకు విపక్షాలు ఇప్పటికీ ప్రయత్నాలు సాగిస్తానే ఉన్నాయి. డిజిటల్ లావాదేవీల విషయంలో, ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి. చిదంబరం, భారత వంటి నిరక్షరాస్య దేశంలో అదెలా సాధ్యమంటూ తమ పాండిత్యం మొత్తాన్ని ప్రదర్శించి, ప్రభుత్వ నిర్ణయాన్ని అపహాస్యం చేశారు. అయితే ఈ రోజున, దేశంలో డిజిటల్ లావాదేవీలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో చూస్తూనే ఉన్నాం.. ఆకు కూరలు అమ్మే చిరు వ్యాపారులు మొదలు కోట్లల్లో వ్యాపారాలు చేసే వారు, చిదంబరం వంటి కుబేరులు వరకు డిజిటల్ లావాదేవీలే సాగిస్తు న్నారు. డిజిటల్ లావాదేవీలు భారతదేశంలో ఒక్క నాటికీ సాధ్యం కాదని, భారతీయల సామర్థ్యాన్ని అవహేళన చేసిన చిదంబరం అండ్ కో.. ఈరోజు అదే అవహేళన ఎదుర్కొంటున్నారు.

నిజానికి ఒక చిదంబరం, ఒక రాహుల్ గాంధీ అని కాదు, బీజేపీ, మోదీ వ్యతిరేకులంతా దేశ ప్రజలు ఆమోదించిన మోదీ ఆలోచన ధోరణిని ఆమోదించలేకపోతున్నారు. అందుకే, 'యాంటీ ఇండియా, ఇండీ' కూటమి ఇలా మిగిలింది. ★




# శేషేంద్ర ఆధునిక ఇతిహాసం "నా దేశం-నా ప్రజలు"

**పూలతోటలో ఒకదానిని ఒకటి తరుము కుంటున్న సీతాకోకచిలుకల్లా భావం, భాష కవిత్వంలో ఉండాలని చెప్పుకున్న గుంటూరు శేషేంద్రశర్మ ఆధునికాంధ్ర కవిత్వంలో అత్యంత ప్రతిభావంతుడు. సంస్కృతాంధ్ర పాశ్చాత్య సాహిత్యాలను మథించి ఆపోశనపట్టిన బహుభాషా పండితుడు. 'ప్రతిభ – వ్యుత్పన్నత – అభ్యాసం' సమపాళ్లలో సముపార్జించుకున్న మహాకవి. తన కవితా ఇంద్రజాలంతో పాఠకులను మెస్మరైజ్ చేసిన విలక్షణ కవి. సరికొత్త ప్రతీకలతో, పదబంధాలతో, అభివ్యక్తితో అభ్యుదయ విప్లవ భావాలను వ్యక్తీకరించిన శేషేంద్ర ముద్ర ఆధునికాంధ్ర కవిత్వంలో విశిష్టంగా విలసిల్లింది.**

గుంటూరు శేషేంద్రశర్మ నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు గ్రామంలో 1927 అక్టోబరు 20వ తేదీన పండిత కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు అమ్మాయమ్మ, సుబ్రహ్మణ్యం. ప్రాథమిక విద్యతోపాటు చిన్నప్పుడే సంస్కృత సాహిత్యం, శాస్త్ర గ్రంథాలు స్వగ్రామంలోనే చదివారు. గుంటూరు ఏసీ కళాశాల నుండి బి.ఏ. పట్టభద్రులు. మద్రాసు విశ్వవిద్యాలయం నుండి బి.యల్.డిగ్రీ పొందారు. పిఠాపురంలో డిప్యూటీ పంచాయితీ అధికారిగా ప్రారంభమైన ఆయన ఉద్యోగ జీవితం హైదరాబాదు కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా, మునిసిపల్ శాఖ కార్యదర్శిగా పదవీ విరమణతో ముగిసింది.

**శేషేంద్రరచనలు - కవితా విశేషాలు**

శేషేంద్ర కవిత్వం పద్య రచనతో ప్రారంభమైంది. పద్యరచనలో కూడా సామాజిక స్పృహ ఉండేది. వచన కవిత్వానికి కొత్త శిల్పపు అందాలు సమకూర్చి దానిని మహోన్నత స్థానంలో నిలిపారు. ఆయన ప్రయోగించిన ప్రతీకలు, పదచిత్రాలు, వాక్యనిర్మాణం మొదలైన వాటిల్లో నైపుణ్యం ప్రదర్శించారు. అభివ్యక్తిలో వింత పోకడలు చూపించాడు.



శేషేంద్ర రచనలను స్థూలంగా నాలుగు విధాలుగా వర్గీకరించి విశ్లేషిం చవచ్చు. 1. వచన కవితా సంపుటాలు, 2. ఆధునిక మహా కావ్యాలు (ఆధునిక మహా భారతం, జనవంశం), 3. విమర్శగ్రంథాలు (షోడశి: రామాయణ రహస్యాలు, సాహిత్య కౌముది) 4. కథలు (విహ్వల కథాసంపుటి)

వచన కవితా సంపుటాలు 1. సొరాబు, 2. చంపూ వినోదిని, 3. ఋతు ఘోష, 4. శేషజ్యోత్స్న, 5. మండేసూర్యుడు, 6. నా దేశం–నా ప్రజలు, 7. నీరై పారిపోయింది, 8. గెరిల్లా, 9. సముద్రం–నా పేరు. 10. ప్రేమలేఖలు, 11. రక్తరేఖ, 12. కవిసేన మేనిఫెస్టో, 13. అరుస్తున్న ఆద్మీ మొదలైనవి. 'ఈ నగరం జాబిల్లి' గజల్ మీద గొప్ప విశ్లేషణ.

శేషేంద్ర కవిగా, విమర్శకుడిగా సవ్యసాచిలా రాణించాడు. కవిగా ఎంత లబ్ధప్రతిష్ఠుడో, విమర్శ కుడిగా కూడా అంత ప్రసిద్ధుడయ్యాడు. ఆయన కవితా సంపుటాలకు కేంద్ర సాహిత్యం అకాడెమీ అవార్డు లభించింది. ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం శేషేంద్ర కవితా ప్రతిభను ప్రశంసిస్తూ 'విశ్వనాథ, శ్రీశ్రీల్లాగా సమకాలీన తెలుగు సాహిత్యంలో శేషేంద్ర నిస్సంశయంగా జీనియస్. 'మండే సూర్యుడిగా' పిడికిలెత్తినప్పటి నుంచీ తెలుగులో వచన కవిత్వం శేషేన్ మార్కు, భావచిత్రాల పట్టు శాలువా కప్పుకోవడం నేర్చుకొంది. అభివ్యక్తి శిల్పంతో వేడి వెన్నెలలు వెదజల్లటం ప్రారంభించింది. రాజకీయం వెంబడి అనుసరిస్తున్న కవిత బ్రతుకు మార్చి జీవితాన్నంతా తన వెంట నడుపుకోగలిగిన శక్తిగా దాన్ని మలిచి శిల్ప శంఖంగా పూరింపజేశాడు'అని ఆయన కవితా ప్రతిభను, విశిష్టమైన భావచిత్రాలను, శిల్పాన్ని అద్భుతంగా మెచ్చుకున్నాడు.

శ్రీశ్రీ శేషేంద్ర కవితా ప్రతిభకు పరవశించి "శేషన్ శేషేన్! నీ పోయెమ్స్ చూసేన్ పసందు చేసేన్ / నీది మంచి పద్యమా! లేక ఫ్రెంచి మద్యమా!" అంటూ చేసిన స్తవంలో వాస్తవం ఉంది.

'గురజాడ కవిత్వం' ఆకులందున మన కవిత కోకిల అణగిమణగి కూయవలెనోయ్' అంటూ ధ్వనిపూర్వకంగా కవిత్వం ఉండాలని చెప్పాడు. శేషేంద్ర కూడా కవిత్వం ఆలోచనాత్మకంగా ఉండాలన్నాడు. కవితా శిల్పానికి ప్రాధాన్యం అవసరమన్నాడు. ఆయన దృష్టిలో కవిత్వం 'ఎప్పుడూ సూటిగా వస్తువును సూచించకూడదు. కవి ఇచ్చే భావచిత్రాల ద్వారా కావ్య వస్తువును దర్శించాలేగానీ నగ్నంగా కాదు. ఈ సిద్ధాంతం మీదనే ఆయన వచన కవిత అంతా సాగింది' అన్న టి.యల్.కాంతారావు వివరణ సమంజసంగా ఉంది.

శేషేంద్ర రచించిన 'నా దేశం–నా ప్రజలు' కావ్య విశేషాలను వివరించడమే ప్రస్తుత వ్యాస ముఖ్యోద్దేశం.

భారతదేశం అంధకార బంధురంగా, స్వేచ్ఛా రహితంగా ఉన్న ఎమర్జెన్సీ కాలంలో (1975) శేషేంద్ర 'నా దేశం – నా ప్రజలు' కావ్యాన్ని




**డా॥పి.వి.సుబ్బారావు**
**9849177594,**
**విశ్రాంత అధ్యాపకుడు**


రచించాడు. తెలుగు సాహిత్యంలో తొలిసారిగా ఈ కావ్యానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ, తమిళ, కన్నడం మొదలైన భాషల్లోకి అనూదితమైంది. శేషేంద్ర దీనిని ఆధునిక ఇతిహాసంగా పేర్కొంటూ ఆముఖం రచించాడు. తన వాదాన్ని ఎన్నో ఉపపత్తులతో నిరూపించాడు. పాశ్చాత్య సాహిత్యంలోని 'ఎపిక్' అనే సాంకేతిక పదానికి సమానార్థకంగా 'ఇతిహాసం' అనే పదం ఎంతో ఔచిత్యంగా ఉంది. కాని, కనీసం పద్దెనిమిది పర్వాలు నిడివైనా లేనిది ఇతిహాసం ఎలా అవుతుంది? అని సంప్రదాయ విమర్శకులు ఆక్షేపించారు. అయితే ప్రముఖ విమర్శకులు డా॥ ఆవంత్స సోమసుందర్ ఇతిహాస పదాన్ని సమర్థిస్తూ టి.యస్.ఇలియట్ రాసిన 'వేస్ట్‌ల్యాండ్' కావ్యం సరిగ్గా నాలుగు వందల ముప్పై పాదాలు మాత్రమే ఉన్నా ఆంగ్ల విమర్శకులు దాన్ని 'ఎపిక్'గా పేర్కొన్నారు. మయ్‌కోవిస్కీ రచించిన 'ఎ క్లౌడ్ ఇన్ ట్రౌజర్స్' పరిమాణంలో చిన్నదైనా రష్యన్ విమర్శకులంతా ముక్తకంఠంతో 'ఎపిక్'గా పేర్కొన్నారు. దీంతో 'వీరగాథా సంహిత' (ఎపిక్) అనే ప్రాచీనార్థానికి కాలదోషం పట్టిందన్న మాటే కదా! ఏకాక్షర ఏకపద పాదాలు సహా 775 పాదాల పరిమాణంలో ఉన్న 'నా దేశం–నా ప్రజలు' కావ్యం పైన పేర్కొన్న రెండు కావ్యాల కంటే బృహత్తరం, రసవత్తరమైంది. కనుక ఈ కావ్యాన్ని ఇతిహాసంగా పేర్కొనవచ్చునన్న సోమసుందర్ అభిప్రాయం సహేతుకంగా ఉంది.

ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య ఈ కావ్యౌన్నత్యాన్ని, శేషేంద్ర ప్రతిభను ప్రశంసిస్తూ చిన్న విమర్శ గ్రంథం రాశారు. అందులో 'స్వభావతః శేషేంద్ర మార్క్సిస్టు పీడకు'ల దౌర్జన్యాన్ని కవిత్వాయుధంతో, ఆయనలా ఖండించినవాళ్లు అరుదు. కాలం యొక్క మర్మం కవికి తెలుసు. అన్నింటికి మించి ఈ కవికి కరుణగల గుండె ఉంది. తెలుగు కావ్యానికి జాతీయ స్థాయి కలిగించిన కావ్యం 'నా దేశం – నా ప్రజలు' అంటూ దీనిని విప్లవ కావ్యంగా పేర్కొన్నారు.

'నేనెప్పుడు గొంతెత్తినా నా కోసం కాదు. ఇది కోట్లమంది కోసమూ కాదు. ఏభై కోట్లమంది కోసం గొంతెత్తుతాను. (అప్పటి భారతదేశపు జనాభా దాదాపు 50 కోట్లు) నేను పడుతున్న బాధలే నా దేశమంతా పడుతోంది" – అనడంలో శేషేంద్ర కవితా హృదయం గోచరిస్తుంది. ఈ కావ్యంలో అభ్యుదయ, విప్లవ సామాజిక దృక్పథాలు స్పష్టమవుతున్నాయి.


### 'నా దేశం - నా ప్రజలు' కావ్యంలో విశిష్ట కవితా రీతులు

ఈ కావ్యంలో ప్రధానంగా 1. శ్రామిక శక్తి ప్రశంస, 2. ప్రకృతి సౌందర్య పిపాస, 3. దేశభక్తి తత్పరత, 4. శ్రామికుడి నిర్వేదం, 5. గత చారిత్రక నిరసనం, 6. కాలచక్ర గమనం అధిక్షేపణ, 7. కవితా చైతన్యస్ఫూర్తి– అంతర్జాతీయ స్పృహ, 8. కవి ఆదర్శ సమాజ కాంక్ష– ప్రకృతి వనరుల మమేకం వంటి కవితారీతులున్నాయి. వాటిని పరిశీలిద్దాం.

**1. శ్రామిక శక్తి ప్రశంస:** ఈ కావ్యంలో నాయకుడు కవి. కవి తనకీ, శ్రామికుడికీ అభేదాన్ని చెప్పుకున్నాడు. శ్రామికవర్గ చైతన్యాన్ని ప్రబోధించాడు. కవిదృష్టిలో ఉత్పత్తికే కారకుడైన కర్షకుడు, కవి, సాలెవాడు, వడ్డెరవాడు, సైనికుడు, శిల్పి మొదలైనవాళ్లంతా శ్రామికులే. లలిత కళాకారుల కోవకు చెందిన కవినీ, శిల్పినీ శ్రామికులుగా పేర్కొనటం శేషేంద్ర విలక్షణత. కేవలం ధాన్యం పండించేవే పొలాలు కాదు. ఉత్పత్తికి మూలమైందల్లా పొలమే. ఉత్పాదించినవాడల్లా శ్రామికుడే.

**"లేస్తోంది ఉషఃకాంతుల్లోంచి ఒక హస్తం**

ఆ హస్తం కాలం అనే నిరంతర శ్రామికుడు




సమస్తం" ఉషఃకాంతుల్లోంచి హస్తం పుట్టి లేచింది. కాబట్టి వెలుతురు పుదుతుందన్నది వాస్తవం. ఆ హస్తం శ్రామికుడి సమస్తం. హస్తాన్ని కవి శ్రమశక్తికి ప్రతీకగా ప్రయోగించాడు. శ్రామికుడి శ్రమశక్తి వల్లనే ఉషఃకాంతులు వెలువడుతున్నాయన్న కవి భావన శ్రామికుడి ఉత్కర్షను వ్యక్తం చేస్తుంది. పొలాల్లో స్రవించే చెమటలో, రక్తంలో ఆ హస్తం మునిగి తేలుతుంది. అది దూరతీర ప్రాంతాలకు సిందూరపు కాంతులు వెదజల్లుతుందని ప్రశంసించాడు.

**2. ప్రకృతి సౌందర్య పిపాస:** కవి ఉషోదయంతో కళ్లు తెరిచి ఆవులిస్తూ కిటికీలోంచి పక్షులకు, మేఘాలకు సుప్రభాతం చెప్పి తన ప్రకృతి సౌందర్య పిపాసను "సూర్యుడిచ్చిన ప్రియమైన కానుక నా దినం" అని చాటుకుంటాడు. పక్షులతో, మేఘాలతో కలిసి ప్రకృతి సౌందర్యాన్ని పంచుకుంటానంటాడు.

నా దేశపు స్త్రీలకు రంగురంగుల కలలుకనే నూలుతో కోకలల్లి సీతాకోక చిలుకలను చేస్తానంటాడు. మన దేశంలో విలువైన రంగురంగుల కోకలు నేయగల నేత పని వాళ్లున్నారు. కవి నేతపని వాళ్లతో మమేకమై రంగు రంగుల కోకలను నేసి జీవన వనసీమల్లో ఎగరేస్తానంటాడు.

**3. దేశభక్తి తత్పరత:** కవి తన ఊహల్లో ఆదర్శ సమాజం అందంగా ఉండేందుకు రస్తాలు వేస్తానంటాడు. మబ్బుల్లో అందమైన భవనాలు నిర్మిస్తానంటాడు. దేశభక్తి తత్పరతతో "ప్రాణాలతో నా దేశపు సరిహద్దుకు డ్యాంలు లేపుతానంటాడు. పొరుగు దేశాలతో జరుగుతున్న యుద్ధాలన్నీ సరిహద్దు కలహాల వల్లే జరుగుతున్నాయి. చైనా, పాకిస్తాన్ యుద్ధాలు ఆ విధంగానే జరి గాయి. అందుకే తన ప్రాణాలను ఫణంగా పెట్టి దేశ సరిహద్దుల గోడలను నిర్మిస్తానంటాడు. శత్రువుల గుండెలను చీల్చి చెండాడుతానంటాడు. నావలు చేసి వాటిలో జాతీయ జెండాలు నాటి సముద్రాల్లోకి విడుస్తానంటాడు. తన దేశం భక్తితత్పరతను దేశదేశాలకు చాటి చెపుతానంటాడు.

**4. శ్రామికుడి నిర్వేదం:** కవి శ్రామికుడితో మమేకం చెంది దోపిడీ సమాజంలో జరుగుతున్న దౌర్జన్యాన్ని నిరసిస్తాడు. తరతరాలుగా దాన్ని వినియోగించేందుకు, కళాత్మక సౌందర్యాన్ని సృష్టించేందుకు అవకాశాలు లభించడం లేదు. అందుకే ఈ చేత్తో ఏ అందాన్నీ సృష్టింపలేక పోయానని చింతించాడు. చేసేందుకు పనిలేక చేయి ఖాళీగానే ఉండిపోయింది శాశ్వతంగా. అందుకే పొట్టలు కూడా ఖాళీగానే ఉన్నాయి. ప్రజల సుఖజీవనానికి 'డ్యాము'లెన్నో నిర్మిస్తున్నారు. పొలాలను దున్ని పంటలు పండిస్తున్నారు. కాని శ్రామికుడి శ్రమ నిష్ఫలమై చివరకు ఆవేదన మిగులుతుంది. అతడి బ్రతుకొక సున్నాగా అనిపిస్తుంది. అయినా నిర్వేదంతో సాగుతున్నాడు. అతడికన్నా చెట్టు నయమని కవి భావన. శ్రామికుడికీ చెట్టుకీ అభేదం చెప్పాడు. చెట్టుకి సంవత్సరానికొక



శేషేంద్రకు అసమ సమాజంపై కసి ఉంది. అందుకే తన మనసులో సముద్ర గర్భంలో ఉన్నంత అశాంతి ఉంది. వ్యవస్థపై తిరుగుబాటు చేయాలన్న కసి వల్ల ఝంఝా మారుతం లాంటి ఆవేశంతో చలించి పోతున్నాడు. ఆదర్శ సమాజం కవి కల. శ్రామికులకు సముచిత స్థానం, గౌరవ దక్కేది సమ సమాజంలోనే. కవి తన ఆదర్శ సమాజమనే కలను కాగితంపై లోకానికి రాసిస్తానంటాడు. తన ఊపిరితో సంతకం చేస్తానంటాడు. ఆదర్శ సమాజం కోసం అవసరమైతే కవి ప్రాణ త్యాగం చేస్తాడన్న భావన స్ఫురిస్తుంది.

వసంత శోభ దక్కుతుంది. తాను మనిషైనందుకు వసంత శోభ కోల్పోయానని నిస్పృహతో నిర్వేదం చెందాడు. నాగరికత ప్రభావంతో తన శ్రమశక్తి వల్ల పల్లెలూ, పట్నాలూ సుందరంగా ముస్తాబైనా తాను మాత్రం రిక్తహస్తాలతో దేశంకాని దేశంలో తనకేమీలేని ప్రదేశంలో ఉన్నానని నిర్వేదం చెందాడు.

**5. గత చారిత్రక నిరసనం:** గత చరిత్రంతా ధనికులూ, భూస్వాములూ, బూర్జువాల ప్రాధాన్యంతో సాగింది. అందులో శ్రామికుడికి స్థానం లేదు. మార్క్సిస్టు దృక్పథంతో కవిత్వం రాసిన అభ్యుదయ కవులు శ్రీశ్రీ, అనిసెట్టి, దాశరథి, ఆరుద్ర వంటి వాళ్లంతా గత చరిత్ర గమనాన్ని నిరసించారు. 'గత చరిత్రలో శ్రామికుడి శ్రమఫలం దోపిడీకి గురైంది. దుర్మార్గానికీ, బలైపోయింది' అని శ్రామికుడితో తనకు అభేదం చెప్పుకున్న శేషేంద్ర గత చరిత్రలో తనకు తావు లేదని అధిక్షేపించాడు. వర్తమాన చరిత్రలో కూడా శ్రమ దోపిడీ జరుగు తోంది. అవినీతి, అక్రమాలు అందలమెక్కాయి. నీతిగా చెమటోడ్చి బ్రతుకే శ్రామికుడికి గుర్తింపులేదు. భవిష్యత్తుల్లో ఉంటుందన్న ఆశలేదు. అందుకే నిస్పృహతో చరిత్ర గమనాన్ని నిరసించాడు.

**6. కాలచక్రగమనం అధిక్షేపణ :** కాలచక్ర గమనంలో వసంతం చక్రభ్రమణం లాంటిది. క్షణాలు కాలాన్ని గుడ్డిగా అనుసరించే పరివారం కాదు. క్షణాలు శ్రామిక స్ఫూర్తికి సంకేతంగా కవి ప్రయోగించాడు. అందుకే కొన్ని క్షణాలు మానవ చరిత్రను మార్చగల మహత్తు కలవని అంటాడు. చైతన్య స్ఫూర్తితో తనను చేయెత్తి పిలుస్తున్న క్షణాన్ని వట్టి నిట్టూర్పులకు వదిలేయమంటాడు. కొండలతో, సముద్రాలతో కలిసి బ్రతికే తనకు తుపానులు లెక్కలోవి కావు. క్షుద్ర బాధలు ఈగల్లా ఎగిరి పోతాయంటాడు. శ్రమశక్తిని అణగదొక్కే కాలపు వెన్నెముకను ముక్కలుగా విరగ్గొడతానంటాడు. అసమ సమాజపు దిగంత రేఖలను చింపేస్తానని అధిక్షేపించాడు.

**7. కవితా చైతన్య స్ఫూర్తి–అంతర్జాతీయ స్పృహ:** అంతర్జాతీయ స్పృహ నిద్రావస్థలో ఉన్న గ్రామాలు అశాంతితో అలమటిస్తున్నాయి. ఉద్రిక్తత రక్తపాతంలో ఉరకలు వేస్తుంది. అందుకే ప్రజల్లో తాను పద్యాల స్ఫూర్తితో చైతన్యాన్ని రగిలిస్తానంటాడు. తన మాట భావితరాలకు వారసత్వంగా సంక్రమిస్తుందన్న విశ్వాసంతో నా పద్యాలను పొందే అర్హత భూగోళం మీద జాతులకు దేశాలకీ ఉంటుందన్న" మానవతా దృక్పథం గల కవితాస్ఫూర్తిలో అంతర్జాతీయ భావన ఉంది. ప్రపంచంలో ఎక్కడ శ్రామికశక్తి దోపిడీకి గురవుతుందో అక్కడ తన కవితా స్ఫూర్తి గుబాళిస్తుందని శ్రామిక పక్ష సానుభూతిని ప్రకటించాడు.

**8. కవి ఆదర్శ సమాజం కాంక్ష – ప్రకృతి వనరుల మమేకం:** శేషేంద్రకు అసమ సమాజంపై కసి ఉంది. అందుకే తన మనసులో సముద్ర గర్భంలో ఉన్నంత అశాంతి ఉంది. వ్యవస్థపై తిరుగుబాటు చేయాలన్న కసివల్ల ఝంఝా మారుతం లాంటి ఆవేశంతో చలించి పోతున్నాడు. ఆదర్శ సమాజం కవి కల. శ్రామికులకు సముచిత స్థానం, గౌరవ దక్కేది సమ సమాజంలోనే. కవి తన ఆదర్శ సమాజమనే కలను కాగితంపై లోకానికి రాసిస్తానంటాడు. తన ఊపిరితో సంతకం చేస్తానంటాడు. ఆదర్శ సమాజం కోసం అవసరమైతే కవి ప్రాణత్యాగం చేస్తాడన్న భావన స్ఫురిస్తుంది. శ్రమ దోపిడీ చేసే దుర్మార్గపు కాలం వెన్నెముక విరగ్గొట్టి నూతన శకాన్ని స్థాపిస్తానంటాడు.

వసంత రుతు శోభతో దేశం శరీరంమీద ప్రభాత పూర్వ స్వప్నంలా ప్రకృతి సంపదలైన అడవులను కప్పుకొని నడుస్తానంటాడు. కవి కల ఫలించి ప్రకృతి వనరులు తమ అధీనమైతే తాను ఆశించిన ఆదర్శ సమాజం సిద్ధిస్తుంది. అప్పుడు నిరుపయోగంగా పడి వున్న పొలాలను సస్యశ్యామలంగా మారుస్తానంటాడు. రూప రహితంగా పడివున్న స్థాణువులైన పర్వతాలను చైతన్యం, స్ఫూర్తి గల సింహాలుగా, చలన శీలమైన ఏనుగులుగా, ఒంటెలుగా వాటిని మకుటాల్లాంటి ఇతిహాస గాథలుగా మలచదలుచుకున్నాడు. వాటికి మాటలు నేర్పుతానంటాడు. శ్రమశక్తి వెలుగులో చైతన్య స్ఫూర్తికి సంకేతమైన సూర్యుడు అసంఖ్యాకమైన కిరణాలతో ప్రకాశిస్తున్నాడు.

కవి ఆదర్శ సమాజం కలను గూర్చి మొదట కన్నీరు కార్చిన చెట్టు ఇప్పుడు సంతోషంతో అభినందన పూర్వకంగా పూలజల్లు కురిపిస్తుందని చెప్పాడు. శేషేంద్ర 'నా దేశం–నా ప్రజలు' కావ్యంలో శ్రామికవర్గ చైతన్యాన్ని గొప్పగా ప్రబోధించాడు. అందుకే ఈ కావ్యం పెక్కు భాషల్లోకి అనువదితమై కవికి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని కలిగించింది. ఇంత గొప్ప కావ్యాన్ని రచించిన శేషేంద్ర ధన్యజీవి– భౌతికంగా ఆయన మన మధ్య లేకున్నా, కవితాప్రియుల హృదయాల్లో చిరంజీవి. ★



చాప్పరపు కృష్ణారావు




**చైనా వేదికగా ప్రారంభమైన 19వ ఆసియా క్రీడల మొదటి రెండు రోజుల పోటీలలోనే భారత్ జోరుగా, హుషారుగా పతకాలవేట ప్రారంభించింది. రెండు స్వర్ణాలు సహా మొత్తం 11 పతకాలు సాధించడం ద్వారా పతకాల పట్టిక 5వ స్థానంలో నిలిచింది.**

# ఆసియాడ్‌లో జోరుగా, హుషారుగా పతకాల వేట!

కరోనా దెబ్బతో ఏడాది ఆలస్యంగా జరుగుతున్న హాంగ్జు ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ల పతకాలవేట జోరందుకొంది. పోటీల మొదటి రెండు రోజుల్లోనే షూటింగ్, రోయింగ్, మహిళా క్రికెట్ అంశాలలో భారత క్రీడాకారులు 2 స్వర్ణ, 3 రజత, 6 కాంస్యాలు సహా మొత్తం 11 పతకాలు సాధించడం ద్వారా పతకాల పట్టిక 5వ స్థానంలో భారత్‌ను నిలిపారు. మొత్తం 14 రోజుల పాటు జరిగే ఈ క్రీడల్లో 651 మంది అథ్లెట్లతో 38 రకాల క్రీడాంశాలలో భారత్ పతకాల వేటకు దిగింది.

**షూటింగ్ లో బంగారు బోణీ....**

క్రీడల రెండోరోజు పోటీలలో భాగంగా జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో రుద్రాంక్ష బాలాసాహెబ్ పాటిల్, దివ్యాంశ సింగ్ పన్వార్, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్‌లతో కూడిన భారత జట్టు ప్రపంచ రికార్డుతో బంగారు పతకం అందుకొంది. ప్రస్తుత క్రీడల్లో భారత్‌కు ఇదే తొలి స్వర్ణం. ఇదే విభాగం వ్యక్తిగత అంశంలో భారత్‌కే చెందిన ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ రజత పతకం దక్కించుకొన్నాడు.

పురుషుల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో భారత్‌కు కాంస్య పతకమే దక్కింది. ఆదర్శసింగ్, అనీశ్ బన్వాలా, విజయ్ వీర్ సిద్దులతో కూడిన జట్టు షూటింగ్‌లో భారత్‌కు మూడో పతకం అందించింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో మేహులీ ఘోష్, రమిత జిందాల్, అషీ చోక్సీలతో కూడిన భారత జట్టు రజత పతకం సాధించింది.

**స్వర్ణ విజేత మహిళా క్రికెట్ జట్టు...**

ఆసియా క్రీడల పతకం అంశాలలో తొలిసారిగా ప్రవేశపెట్టిన మహిళా క్రికెట్లో హర్మన్ ప్రీత్‌కౌర్ నాయకత్వంలోని భారతజట్టు బంగారు పతకం గెలుచుకొంది. స్వర్ణపతకం కోసం జరిగిన పోరులో భారత్ 19 పరుగులతో శ్రీలంకను చిత్తు చేసింది టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్ ఎంచుకొన్న భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 116 పరుగులు చేసింది. సమాధానంగా శ్రీలంక 20 ఓవర్లలో 8 వికెట్లకు 97 పరుగులు మాత్రమే చేయగలిగింది.

**రోయింగ్‌లో 5 పతకాలు...**

రోయింగ్ (తెడ్లువేసి పడవలు నడిపే పోటీలు ) పురుషుల డబుల్స్‌లో భారత జోడీ అర్జున్ లాల్ జాట్ – అరవింద్ సింగ్ రజత పతకం సాధించారు. కాక్స్‌డ్–8 టీమ్ విభాగంలో సైతం భారత్‌కు రజత పతకం దక్కింది. భారతజట్టులో నీరజ్, నరేశ్, నితీశ్, చరణ్ జీత్, జస్విందర్, భీమ్, పునీత్ కుమార్, అశీశ్ సభ్యులుగా ఉన్నారు. కాక్స్‌లెస్ పెయిర్స్ విభాగంలో భారతజోడీ బాబులాల్ యాదవ్– లేఖా రామ్ కాంస్య పతకంతో సరిపెట్టుకొన్నారు. ప్రస్తుత ఆసియాక్రీడల రోయింగ్ బరిలో మొత్తం 33 మంది సభ్యుల జట్టుతో భారత్ పోటీకి దిగింది.

**13 ఏళ్ల తర్వాత ఫుట్ బాల్ నాకౌట్ రౌండ్లో భారత్..**

ఆసియాక్రీడల పురుషుల ఫుట్‌బాల్‌లో 9 సంవత్సరాల విరామం తర్వాత పాల్గొంటున్న భారత్ గ్రూప్–లీగ్ ఆఖరి పోటీని డ్రాగా ముగించడం ద్వారా ఆఖరి 16 జట్ల రౌండ్‌కు అర్హత సంపాదించింది. ఆసియాక్రీడల ఫుట్ బాల్ నాకౌట్ రౌండ్‌కు భారత్ 13 సంవత్సరాల విరామం తర్వాత అర్హత సాధించ గలిగింది.

తొలిరౌండ్లో చైనా చేతిలో 1–5తో ఓటమి పొందిన భారత్.. రెండో రౌండ్లో బంగ్లాదేశ్‌ను 1–0 తో అధిగమించడం ద్వారా నాకౌట్ రౌండ్ అవకాశాలను సజీవంగా నిలుపుకొంది. కీలక ఆఖరి రౌండ్ మ్యాచ్‌లో మియన్మార్‌ను 1–1తో నిలువరించడం ద్వారా.. గ్రూపు–ఏ లీగ్‌లో రెండో అత్యుత్తమ జట్టుగా ప్రీ–క్వార్టర్ ఫైనల్ రౌండ్ చేరుకొంది. క్వార్టర్ ఫైనల్లో చోటు కోసం జరిగే నాకౌట్ రౌండ్ సమరంలో సౌదీ అరేబియాతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

2018లో ఇండోనేషియాలోని పాలెమ్ బ్యాంగ్ నగరం వేదికగా ముగిసిన 18వ ఆసియాక్రీడల పతకాల పట్టిక 8వ స్థానంలో నిలిచిన భారత్..2022 ఆసియా క్రీడల్లో మరింత మెరుగైన ప్రదర్శన చేయటానికి వీలుగా అథ్లెట్లను సమాయత్తం చేసింది. భారత అథ్లెట్లు గత ఏషియాడ్ లో 16 స్వర్ణాలతో సహా మొత్తం 70 పతకాలు సాధించ గలిగారు.

ప్రస్తుత క్రీడల కోసం ముందుగా 634 మంది సభ్యుల బృందాన్ని సిద్ధం చేశారు. అయితే..భారత ఒలింపిక్స్ సంఘం సిఫారసు మేరకు 17 మంది సభ్యులకు అదనంగా చోటు కల్పించారు.

పురుషుల జావలిన్ త్రో, పురుషుల హాకీ, పురుషుల క్రికెట్, పురుషుల, మహిళల చెస్ టీమ్, వ్యక్తిగత అంశాలతో పాటు.. కబడ్డీ క్రీడలో సైతం భారత్ బంగారు పతకాలు గెలుచుకోడం ఖాయంగా కనిపిస్తోంది. గత క్రీడల్లో సాధించిన 70 పతకాల రికార్డును భారత్ ప్రస్తుత క్రీడల్లో అలవోకగా అధిగమించే అవకాశం లేకపోలేదు.

**ఒలింపిక్ స్ఫూర్తిని మంటగలిపిన చైనా...**


ఆసియాక్రీడల్లో పాల్గొనటానికి ఎంపికైన భారత బృందంలోని ముగ్గురు అథ్లెట్లకు ఆతిథ్య చైనా వీసాలు నిరాకరించడం ద్వారా క్రీడాస్ఫూర్తిని, ఒలింపిక్ స్ఫూర్తిని మంటగలిపింది. ఉషు జట్టులోని ఈ ముగ్గురు క్రీడాకారులూ అరుణాచల్ ప్రదేశ్‌కు చెందినవారు కావడంతో చైనా వీసాలు నిరాకరించడం విమర్శలకు దారితీసింది. భారత క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ సైతం తన చైనా పర్యటన రద్దు చేసుకోడం ద్వారా తీవ్రస్థాయిలో నిరసన తెలిపారు. క్రీడల్ని రాజకీయాలతో ముడిపెట్టిన చైనాపై అంతర్జాతీయ ఒలింపిక్ సంఘానికి భారత్ ఫిర్యాదు చేయాలని భావిస్తోంది. ★

# అందరి కంటే ఘనుడు

ప్రియమైన ఉదయనిధి స్టాలిన్!

సామాజిక మాధ్యమాల ద్వారా క్రైస్తవంలోకి మారిన తమిళనాడు ముఖ్యమంత్రి కొడుకుగానే తప్ప మీ గురించి నేను ఎక్కువ వినలేదు. దోమలను, డెంగ్యూను, మలేరియాను నిర్మూలించినట్లుగా సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని 'సనాతన రద్దు' సమావేశంలో ప్రకటించిన తర్వాతే మీ గురించి అందరికీ తెలిసింది. సనాతన ధర్మాన్ని అనుసరించే వాళ్లని మూకుమ్మడిగా చంపాలని మీరు పిలుపు ఇవ్వలేదని, సనాతన ధర్మం కులం, మతం ఆధారంగా ప్రజలను విడదీస్తుందని, సమానత్వాన్ని, మానవత్వాన్ని నిలబెట్టాలంటే సనాతన ధర్మాన్ని నిర్మూలించటం అవసరమని మీరు సామాజిక మాధ్యమాల ద్వారా స్పష్టం చేశారు. ఈ గడబిడ తరువాత మీరు సామాన్య వ్యక్తి కాదని, నటుడని, విజయవంతమైన చలనచిత్రాల నిర్మాత అని, మీ తండ్రిగారి మంత్రివర్గంలో మంత్రి అని, లక్షలాది కోట్ల మీ కుటుంబ ఆస్తికి, పరిమితులు లేని అధికారాలకు మీరు వారసుడని నాకు తెలిసింది.

మీకు ఉన్న అపారమైన జ్ఞానంతో కొన్ని విషయాలను అర్థం చేసుకొనేందుకు మాకు సహాయం చెయ్యవలసిందిగా కోరుతున్నాం. ఈనాడు సుమారు 177 దేశాలు ప్రపంచ యోగా దినోత్సవాన్ని జరుపుతున్నాయి. ఐక్యరాజ్య సమితి ప్రకారం రెండు బిలియన్ల మంది, అంటే 200 కోట్ల మంది ప్రపంచ వ్యాప్తంగా యోగా అభ్యసిస్తున్నారు. యోగ సనాతన ధర్మంలో అంతర్భాగం. సనాతన ధర్మం ప్రజలను విడదీసేదే అయితే, ప్రపంచంలో నాల్గవ వంతు జనాభా యోగాను ఎందుకు అనుసరిస్తున్నారు? యోగాను వారి జీవితాలలో ఎందుకు ఒక భాగం చేసుకున్నారు? యోగా క్రైస్తవ వ్యతిరేకమని ప్రకటించిన చర్చిని ధిక్కరించి మరీ పాశ్చాత్య దేశాల క్రైస్తవులు యోగాను అనుసరిస్తున్నారు. అభ్యాసం చేస్తున్నారు. అమెరికాలో 10 శాతం మంది యోగాను క్రమం తప్పకుండా అభ్యాసం చేస్తున్నారు. ఫిటెనెస్ తరగతులలో హైందవేతరులు వారి యోగాభ్యాసాన్ని ఓంకారంతోనూ, నమస్తేతోనూ మొదలు పెట్టి, ఓంకారంతో ముగిస్తున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం ఒక యోగా దినం కూడా వారికి మొదలైంది. ఆ రోజున భజనలు కూడా చేసేవారు. మీ వివేకంతో మీరు గుర్తించిన సనాతన ధర్మం అసలు రంగు గురించి వారికి చెప్పి, ఒప్పించి, వారిని సన్మార్గంలో పెట్టడం అవసరమేమో !



ఆపిల్ కంపెనీ వ్యవస్థాపకులు, గత శతాబ్దపు గొప్ప ఆవిష్కర్తగా పేరు పొందిన స్టీవ్ జాబ్స్ గురించి బహుశ మీకు తెలిసే ఉండవచ్చు. స్టీవ్ జాబ్స్ 'ఒక యోగి ఆత్మకథ' పుస్తకం నుండి ఎంతో స్ఫూర్తిని పొందాడని, సంవత్సరంలో ఒకటికి రెండుసార్లు ఆ పుస్తకాన్ని చదివేవాడని స్టీవ్ జాబ్స్ జీవిత చరిత్ర రాసిన రచయిత పేర్కొన్నాడు. ఆయన చివరిక్షణం వరకు 'ఒక యోగి ఆత్మకథను' తన దగ్గర ఉంచుకొన్నాడని రాశాడు. తన అంత్యక్రియలకు హాజరయ్యే బిలియన్ డాలర్ల కంపెనీల ఉన్నతాధికారులకు పంచటానికి క్యాన్సర్‌తో కొద్ది రోజులలో చనిపోవడానికి ముందు ఆ పుస్తకం 500 ప్రతులను సిద్ధం చేశారు. సనాతన ధర్మం చెడు గురించి మీదగ్గర నేర్చుకొనే అవకాశం స్టీవ్ జాబ్స్‌కు లేకపోయింది. సనాతన ధర్మం గురించి మీరు తెలియచెప్పి ఉంటే, బహుశ ఆయన మరెన్నో ఆవిష్కరణలు చేసి ఉండేవాడేమో!

క్వాంటమ్ భౌతికశాస్త్రవేత్తలు, నోబెల్ బహుమతి గ్రహీతలు ఓపెన్ హైం, హైజన్ బర్గ్, బాం, షూర్టింగర్లకు కనుక సనాతన ధర్మం గురించి మీరు తెలియ చెప్పిఉంటే, వారు ఒక చేతిలో భౌతిక శాస్త్రాన్ని, మరొక చేతిలో భగవద్గీతను అట్టిపెట్టుకొనే వారు కారు. మొట్టమొదటి అణుబాంబును న్యూమెక్సికన్ ఎడారిలో పరీక్షించినప్పుడు, మాన్హట్టన్ ప్రాజెక్టుకు నాయకత్వం వహించిన ఓపైన్ హైం భగవద్గీత 11వ అధ్యాయంలోని శ్లోకాలను ఆప్రయత్నంగా వల్లెవేశారు. పాపం, ఆయన తన జీవిత కాలంలో ఎక్కువ కాలాన్ని సంస్కృతం నేర్చుకోవటంలో గడిపాడు. తన లోతైన అంతర్దృష్టికి భగవద్గీత, సనాతన ధర్మబోధనలే కారణం అని చెప్పుకొన్నారు. సనాతన ధర్మం గురించి మీరు వెలిబుచ్చిన విలువైన అభిప్రాయాలు తెలియక వారు చాలా కోల్పోయారని ఇప్పుడు అనిపిస్తుంది. మీ దగ్గర నేర్చుకోవటానికి వారికి అవకాశం లేకపోయింది పాపం!

విశ్వ రహస్యాలను ఛేదించేందుకు 23 ప్రపంచ దేశాలు జెనీవాలో నెలకొల్పిన CERN ఇనిస్టిట్యూట్ గురించి మీకు బహుశా తెలిసి ఉండవచ్చు. అదొక అరుదైన, గొప్పదైన, అత్యంత ఆధునికమైన అంతర్జాతీయ పరిశోధనా సంస్థ. ఆ సంస్థలో అడుగు పెట్టగానే ఒక పెద్ద నటరాజస్వామి విగ్రహం కన్నుల పండువగా కనపడుతుంది. విశ్వ రహస్యాలను వెలికి తీసే ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్తలు ఆ విగ్రహాన్ని తమ ప్రాంగణంలో ప్రతిష్ఠించుకున్నారు. సనాతన ధర్మానికి నటరాజస్వామి అత్యంత పవిత్ర ప్రతీక. ఆ మూర్తి వారిని కులాలు,మతాలు వారీగా విడదీస్తుందని మీకు తెలిసినంతగా బహుశా వారికి తెలియక పోవటం వల్లనే ఆ విగ్రహాన్ని అక్కడ పెట్టుకున్నారు. ఆ విగ్రహాన్ని అక్కడ నుండి తొలగిం చేందుకు మీరు పూనుకోవాలి. ఆ శాస్త్రవేత్తలకు మీ విజ్ఞానాన్ని పంచి, వారికి తెలియచెప్పే మహత్తర బాధ్యత తలకెత్తుకోవాలి.

ఆ జర్మనీలో 14 అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు సంస్కృతంలో కోర్సులు నిర్వహిస్తున్నాయి. అయినప్పటికి డిమాండ్‌ను తట్టుకోలేకపోతున్నాయి. డిమాండ్‌కు తగ్గట్లుగా సంస్కృత కోర్సులను విస్తరించలేకపోతున్నారు. ఒక దుష్ట మతపు మృతభాషను నేర్చుకొనేందుకు ఎందుకు వారు తహతహలాడుతున్నారు? ఆ సంగతి మీకు తెలిసినంతగా ప్రపంచానికి ఎందుకు తెలియటం లేదు? మీకు ప్రతిభాపాటవాలు ఉన్నాయి. డబ్బు, అధికారం ఉంది. మీరు జర్మనీ వెళ్లి వారందర్నీ సన్మార్గంలో పెట్టవలసినదిగా మనవి.


మీలాంటి మెస్సయ్యను, మేధావిని ప్రపంచం ఎందుకు ఇంతవరకు గుర్తించ లేదోనని నేను ఇప్పుడు మథన పడుతున్నాను. గత శతాబ్దంలో గొప్ప పురాణవేత్త అయిన జోసెఫ్ కాంప్బెల్ 'స్టార్ వార్' వరుస ప్రసారాలకు కారకుడు. ఆయన 'పవర్ ఆఫ్ మిత్' వరుస ప్రసారాల ద్వారా సనాతన ధర్మం గొప్పదనాన్ని చాటాడు. 'స్టార్ వార్' వరుస ప్రసారాల

# 'ఉదయ'

నిర్మాత అయిన జార్జి లూకాస్ ఇంట్లోనే వాటిని చిత్రీకరించారు కూడా. సనాతన ధర్మం గురించి చెప్పటానికి ఆయనకు ఒక చెడ్డమాట కూడా దొరకలేదు. సంస్కృతం ఆయన చదివిన విశ్వ విద్యాలయంలో లేదని ఆ విశ్వవిద్యాలయం నుండి బయటకు వచ్చారు. తన జీవితకాలం అంతా ఆయన ఉపనిషత్తులను అనుసరించారు.

కార్ల్సగన్ ఒక ఆస్ట్రోఫిజిస్టు. ఆయన 'కాస్మోస్' వరస ప్రసారాలను నిర్వహించాడు. విశ్వరహస్యాలు హిందూ పురాణాలలో దాగి ఉన్నాయని బహిరంగంగా ప్రకటించాడు. 60 దేశాలలో 50 కోట్ల మందికి పైగా ఈ ప్రసారాలు చూశారు. రుగ్వేదంలోని 'నాసదీయ సూక్తాన్ని' ఆయన పదేపదే వల్లించేవారు. సృష్టి రహస్యాలకు సంబంధించి మానవ మేధస్సు ఎంతవరకు వెళ్లగలదో, అంతవరకు రుగ్వేదకాలం నాడే మన రుషులు వెళ్లారని ఆయన ప్రసంశించారు. దీనినే సృష్టిసూక్తం అని కూడా అంటారు. రుగ్వేదంలో 10వ మండలంలో 120వ సూక్తం యిది. ఇందులో 7 శ్లోకాలు ఉన్నాయి.

**ఎవరికి తెలుసు ఎవరు చెప్పగలరు**
**ఈ సృష్టంతా ఎలా జరిగిందో**
**అందుచే నిజం వారికి తెలుసా**
**ఎప్పుడు సృష్టి ఆరంభం అయిందో**
**ఎంతో ఎత్తు నుండి దేవలోకం**
**దైవమునకు తెలిసో తెలియదో**
**అక్కడ మరణం లేదు. అమరత్వం లేదు**



**నిరంతమయమైన ద్రవ్యం**
**విశ్వమనసులో అన్నీ వ్యాపించి ఉన్నాయి**
**ఎప్పుడు ప్రారంభం అయింది, ఎప్పుడు ముగుస్తుంది.**
**ఇదంతా ఎప్పుడు వచ్చిందో**
**దేవతలే సృష్టి తరువాతవారు**
**సృష్టికి మొదలు ఎప్పుడో**
**తన సృష్టి తీరు ఇదేనని ఆ దేవునికి తెలుసో, తెలియదో**
**అచట నుండి చూసేను దైవం**
**ఉనికిలేదు. అస్తిత్వం రెండూ లేవు**
**పగలు, రాత్రి లేవు అంత చీకటిలో దాగివున్న చీకటి**
**పదార్థరూపంలో, ఆకృతిరూపంలో బయటకు వచ్చింది.**
**నిజంగా ఎవరికి తెలుసు, ఎవరు ప్రకటించగలరు**

ఆనాటి రుషులు, వారిని ప్రశంసించిన కార్ల్ సాగన్ వంటివారు ఎంతటి మూర్ఖులో కదా! డెంగ్యూ, మలేరియా, కరోనా, దోమలను నిర్మూలించినట్లుగా సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని పిలుపును ఇచ్చిన మీ విజ్ఞత వారికి ఎక్కడిది?

ప్రపంచానికి మీ అవసరం ఇంతకు ముందుకంటే ఇప్పుడు ఎంతైనా ఉంది. మిమ్మల్ని విన్న తర్వాతే, ప్రపంచ ప్రసిద్ధికాంచిన క్రైస్తవ ప్రబోధకుల దుస్థితి నాకు విచారం కల్గచేసింది. ఎక్హార్ట్, మైక్ సింగర్, వీన్ డయ్యర్, స్టీఫెన్వెల్డ్రెర్ వంటి ప్రముఖ క్రైస్తవమత ప్రచారకులకు లక్షలాది మంది అనుయాయులు ఉన్నారు. అయితే ఈ మత ప్రచారకులు హైందవాన్ని, బౌద్ధాన్ని కూడా నమ్ముతారు బైబిలుకి పరిమితం కాకుండా కృష్ణుడి, బుద్ధుడి బోధనలను జోడించి మరీ ఉపన్యసిస్తున్నారు. ఎకోట్ టాల్లు ఆర్షవిన్ ఇంటర్వ్యూ చేసినప్పుడు ప్రపంచ వ్యాప్తంగా 3.5 కోట్ల మంది చూశారు. ఆయన పుస్తకాలు 33 ప్రపంచ భాషలలోకి అనువాదం అయ్యాయి. న్యూస్ వీక్ పత్రికలో లీసామిల్లర్ 2009 సంవత్సరంలో "వుయ్ క్రిస్టియన్స్ ఆర్ ఆల్ హిందూస్ నౌ" అని రాశారు. సనాతన ధర్మానికి సంబంధించి మీకు కల్గిన జ్ఞానోదయం వాళ్లందరకూ ఎందుకు కలుగ లేదంటారు? సనాతన ధర్మం ప్రపంచానికి చేసే కీడు గురించి వీళ్లు ఆలోచించినట్లు లేరు. మీ విజ్ఞతను వారితో తప్పక పంచుకొని, వారిని సరైన మార్గంలో పెట్టే బాధ్యత మీరు తీసుకోవాలి.

కొందరు మతఛాందసవాదులు, సనాతన ధర్మం కారణంగా అనేక ఆవిష్కరణలు జరిగాయని గప్పాలు చెప్పుకుంటున్నారు. 'సున్నా' ను భారతీయులే కనుగొన్నారని, ప్లాస్టిక్ సర్జరీకి ఆద్యులు మనమేనని, చదరంగం, చక్రాలు, ఆయుర్వేదం, చైనీయులు, జపనీయులు అనుసరించే రణవిద్యలకు మూలం భారత దేశం అని, ద్విపద సిద్ధాంతం, అదే బైనామిల్ థీరమ్‌ను కనుగొన్నది కూడా మనమేనని గొప్పలు చెప్పుకుంటున్నారు. వారందరి వాదననీ మీరు తప్పక ఖండించాలి.

అలాగే ఒక సుసంపన్నమైన నాగరికత ఆంగ్లేయులు రాకముందు ఇక్కడ వెల్లివిరిసిందని, 1700 సంవత్సరం నాటికి ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో మూడవ వంతుకు పైగా భారతదేశంలోనే ఉత్పత్తి అయిందని, ఆంగ్ల వలస పాలకులు 45 ట్రిలియన్ డాలర్లు దేశం నుండి దోచుకొని వెళ్లారని, 10 కోట్ల మందిని నిర్దాక్షిణ్యంగా ఆంగ్లేయులు పొట్టన పెట్టుకున్నారని ఏవో అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారు. వారందరూ చెప్పేవి అబద్ధాలని, అర్ధ సత్యాలని మీరు ప్రపంచానికి తెలియచెప్పటం అవసరం.

ఆంగ్ల వలసపాలకుల అంతర్గత నివేదికలు ఆధారంగా 18వ శతాబ్దంలో శూద్రులు అత్యంత సంపన్నవర్గంగా ఉన్నారని, విద్యాపరంగా ఎటువంటి వివక్ష కూడా లేదని వారు చెప్తున్న అబద్ధాలకు అంతే లేకుండా ఉంది. తమిళనాడు పాఠశాలల్లో బ్రాహ్మణ విద్యార్థుల కంటే శూద్రవిద్యార్థులే ఎక్కువ మంది ఉండేవారని కూడా వారు ప్రచారం చేస్తున్నారు. ధర్మపాల్ రాసిన 'ది బ్యూటిఫుల్ ట్రీ' పుస్తకంలో ఈ వివరాలు ఉన్నాయి. నా ఉద్దేశం ప్రకారం ఈ మత ఛాందసవాదులు బ్రిటిషు మ్యూజియంకు వెళ్లి, అక్కడి గణాంకాలను, నివేదికలును తారుమారు చేసి ఉంటారు.

అక్కడితో ఆగక ముఖ్యమైన వెబ్‌సైట్లలో సనాతన ధర్మాన్ని ప్రశంసిస్తూ, అక్షర క్రమంలో ప్రముఖులు ఇచ్చిన వేలాది ఉటంకింపులను చూపిస్తుంటారు. పైపెచ్చు ఆ ప్రముఖులలో ప్రపంచ ప్రసిద్ధిపొందిన

ఈ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించటానికి, దేశాన్ని ముక్కలు చేయాలని, హిందువులను మతం మార్చాలని చెప్పండి. దేవాలయాలను నేలమట్టం చేసి, వారి పవిత్ర గ్రంథాలను తగులబెట్టి, సనాతన ధర్మ ప్రతీకలను ధ్వంసం చేస్తే తప్ప సనాతన ధర్మం అనే వైరసు, నకిలీ దేవతలను అనుసరిస్తున్న లక్షలాది మంది అజ్ఞాన హిందువులను సన్మార్గంలోకి పెట్టలేము. అందుకు మీ తండ్రిగారు తగిన చొరవను ప్రదర్శిస్తున్నారు కూడా! తమిళనాడులోని కొన్ని పురాతన దేవాలయాలను నేలమట్టం చేశారు. అదే సమయంలో ఒక చర్చికి కూడా నష్టం జరగకుండా జాగ్రత్తపడ్డారు.

శాస్త్రవేత్తలు, అధ్యాత్మిక నాయకులు ఉన్నారని కూడా బుకాయిస్తున్నారు. వాటిని మీరు నమ్మకండి. ఇంకా ఈ హిందూ మతఛాందసవాదులు కులవివక్ష అన్ని ఇతర మతాలలో కంటే, క్రైస్తవంలోనే ఎక్కువ ఉందని కూడా ప్రచారం చేస్తున్నారు. కుల వివక్ష సమస్యను చర్చి పరిష్కరించుకోలేక సతమతం అవుతుందని, అందుకోసం సనాతన ధర్మం నుండి క్రైస్తవంలోకి వచ్చిన దళితులకు రిజర్వేషన్లు ఇవ్వాలని కొత్త డిమాండ్‌ను తెర మీదకు తెచ్చిందని ప్రచారం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో పైపైన వెదికితేనే, తమిళనాడులో దళితులపట్ల వివక్ష కొట్టవచ్చినట్లు కన్పడుతుందని ప్రచారం చేస్తున్నారు. కాని ఇవన్ని నిజం ఎట్లా అవుతాయి?

క్రైస్తవ మతవ్యాప్తిని వ్యతిరేకించిన మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ టాగూర్, అంబేడ్కర్, స్వామి వివేకానంద వంటి వారలకు మీకున్నంత విజ్ఞత లేదు. ఉండి ఉంటే మానవత్వాన్ని, సమానత్వాన్ని మంటకలుపుతున్న సనాతన ధర్మాన్ని నిర్మూలించ డానికి పూనుకొన్న క్రైస్తవాన్ని ఎందుకు వ్యతిరేకిస్తారు? మహాత్మాగాంధీ ఏమి చెప్పారో మీకు తెలుసా? "భారతదేశంలో అన్ని మతమార్పిళ్లను ఆపండి, సత్యమనే ఫౌంటెన్లోకి కళ్లకు కనపడకుండా కలుస్తున్న కాలకూట విషం వంటిది మతమార్పిడి". మత మార్పిడి విజాతీయకరణకు దారి తీస్తుందని అంబేడ్కర్ అన్నాడు. మీరు చూడగలిగింది ఆ మహాత్ములు చూడలేక పోయిన కారణంగా వారు మహాత్ములు అని సంబోధించడానికి అర్హులుకారు కదా! మీరు జాతీయ స్థాయికి ఎదిగి, ఈ జాతిని మీ సమర్థమైన నాయకత్వంలో నడిపించి సనాతన ధర్మం నుండి బయట పడవేయుదురు గాక!

పండిట్ జవాహర్ లాల్ నెహ్రూ ఆనాటి తమిళనాడు ముఖ్యమంత్రికి గౌరవనీయులైన పెరియార్ గురించి రాసిన లేఖను మీడియా బయట పెట్టింది. దానిని ఏ మాత్రం పట్టించుకోవద్దని మిమ్ములను కోరుతున్నాను. ఎందుకంటే ఆ లేఖలో పెరియార్ రామస్వామి ఒక నేరస్థుడు (Criminal) అని, పిచ్చాసుపత్రిలో చేర్చవలసిన వ్యక్తి అని ఆయన రాశారు. మీరు ఆ లేఖను పట్టించుకోవద్దు. మీకున్న సినిమా, ధన, మీడియా శక్తితో ఆయనను ఒక దైవ స్థాయికి తీసుకొనివెళ్లి, కశ్మీర్లో వలె తమిళనాడులో కూడ మిగిలిన బ్రాహ్మణులను వెళ్లగొట్టటమో, చంపివేయటమో చేయండి! రామాయణ, మహా భారత మహా కావ్యాల రచయితలు వాల్మీకి, వ్యాసులు శూద్రులని వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బ్రాహ్మణులను తరిమి కొట్టటానికి వారి కులవివక్ష గురించి లేనిపోని కథనాలు సృష్టించి, బ్రాహ్మణ ద్వేషాన్ని రెచ్చగొట్టండి. అయినా మీరు నిర్మాణం చేసిన, నటించిన చలన చిత్రాలు మీకు ఈపాటికి అందుకు శిక్షణ ఇచ్చి ఉంటాయని నా విశ్వాసం.

ఆరు కోట్ల మంది స్థానిక అమెరికన్లను, ఆఫ్రికా తెగలను, దారుణ మారణకాండకు గురిచేసింది, ప్రపంచ ప్రసిద్ధ 'మాయన్ నాగరికతను' ధ్వంసం చేసింది, లక్షలాది నల్ల జాతీయులను అమానుషంగా బానిసత్వంలోకి, నెట్టి, చిత్రవధలకు గురిచేసి, వారి శ్రమను దోచుకున్నది మానవత్వాన్ని పెంపొందించ టానికేనని సనాతనవాదులకు తెలియచెప్ప వలసిందిగా మిమ్ముల్ని కోరుతున్నాను. స్థానిక జాతుల పిల్లలపై మాటలలో చెప్పలేని లైంగిక హింసకు పాల్పడి, చంపి, వారిని మూకుమ్మడిగా పాతిపెట్టిన చర్చి అధికారుల అకృత్యాలు సైతం మానవత్వాన్ని, సమానత్వాన్ని పెంపొందించటం కోసమేనని కూడా వారికి తెలియ చెప్పండి. 60 లక్షల మంది యూదులను, జిప్సీలను నరమేధం చేసింది కూడా అందుకేనని చెప్పండి. రువాండాలో జరిగిన నరమేధం, ఆసియా, ఆఫ్రికా ఖండాలలో తెల్లవలస పాలకులు చర్చి మద్దతుతోనే దోచుకున్నది, దారుణాలు చేసింది సమానత్వాన్ని ప్రతిష్ఠించ టానికేనని ఎలుగెత్తిచాటండి. అన్ని రకాల వివక్షలను సమూలంగా నాశనం చెయ్యటానికే తెల్ల క్రైస్తవ దేశాలు ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకున్నాయన్న వాస్తవాన్ని వారు గుర్తించటంలేదు.

ఈ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించటానికి, దేశాన్ని ముక్కలు చేయాలని, హిందువులను మతం మార్చాలని చెప్పండి. దేవాలయాలను నేలమట్టం చేసి, వారి పవిత్ర గ్రంథాలను తగులబెట్టి, సనాతన ధర్మ ప్రతీకలను ధ్వంసం చేస్తే తప్ప సనాతన ధర్మం అనే వైరసు, నకిలీ దేవతలను అనుసరిస్తున్న లక్షలాది మంది అజ్ఞాన హిందువులను సన్మార్గంలోకి పెట్టలేము. అందుకు మీ తండ్రిగారు తగిన చొరవను ప్రదర్శిస్తున్నారు కూడా! తమిళనాడులోని కొన్ని పురాతన దేవాలయాలను నేలమట్టం చేశారు. అదే సమయంలో ఒక చర్చికి కూడా నష్టం జరగకుండా జాగ్రత్తపడ్డారు. చట్ట విరుద్ధంగా అనేక చర్చిలు వెలసినా, వాటి జోలికి ఆయన పోలేదు. థోరియం నిల్వలు పుష్కలంగా ఉన్న కొండపై వెలసిన చర్చి జోలికి కూడా ఆయన వెళ్లకుండా జాగ్రత్తపడ్డారు. మీ పవిత్ర యుద్ధంలో నేను ఏ విధంగా భాగస్వామిని కాగలనో దయచేసి తెలియచేయండి. ప్రపంచానికి మీలాంటి నాయకుడు అవసరం. ప్రస్తుతం 200 కోట్ల మంది సనాతన ధర్మాన్ని అనుసరిస్తున్నారు. రేపు వీరి సంఖ్య 300 కోట్లు కావచ్చు. కాబట్టి ఈ సనాతన ధర్మం అనే ఈ అమానుష మతాన్ని ధ్వంసం చేసేందుకు మనకు అట్టే సమయం లేదు.

**ఆంగ్లమూలం : సత్య దోసపాటి**

**తెలుగు సేత : డా. బి. సారంగపాణి**

**'కార్టూన్ పోటీ - 2023'లో సాధారణ ప్రచురణకు ఎంపికైనది**





# దక్షిణ తెలంగాణ వరదాయని

## పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలమూరు జిల్లాది ఒక సాచివేత గాథ. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానిది ఒక పోరాట చరిత్ర. 1956లో రాష్ట్రం ఏర్పడటం, తదనంతర పరిణామాల వలన ఉదాసీనతకు గురైన జిల్లా పాలమూరు. ఫజల్ అలీ కమిషన్ సిఫారసుల మేరకు హైదరాబాద్ రాష్ట్రంగా కొనసాగి ఉండి ఉంటే అప్పర్ కృష్ణా, భీమ, తుంగభద్ర ఎడమ కాలువ ద్వారా దాదాపు 7 లక్షల ఎకరాలకు సాగునీరు అంది ఉండేది. ఈ అవకాశం పూర్తిగా పోగొట్టుకున్న జిల్లా పాలమూరు. ఈ జిల్లా మొత్తం విస్తీర్ణం 43.73 లక్షల ఎకరాలు ఉంటే అందులో వ్యవసాయ యోగ్యమైన భూమి దాదాపు 35 లక్షల ఎకరాలు. ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి సౌకర్యం ఉన్న భూమి 4.5 లక్షల ఎకరాలు మాత్రమే. ఇందులో ఒక లక్ష ఎకరాలకు సాగునీరు అందించే జూరాల, 87 వేల ఎకరాలకు బదులు 30 వేల ఎకరాలే పారే రాజోలిబండ మళ్లింపు పథకం, 2.5 లక్షల ఎకరాలకు బదులు 75 వేల ఎకరాలకు సాగునీరు అందించే చెరువులు ఉన్నాయి. జిల్లాలో మొత్తం మీద నికరంగా దాదాపు 2 లక్షల ఎకరాలకే సాగునీరు అందుతున్నది. ఉమ్మడి రాష్ట్రపాలనలో పాలకులకు సాగునీరు అందించే ఆలోచన లేని కారణంగా పాలమూరు ప్రజలకు బతకుదెరువు కోసం వలసలే గతయ్యాయి.

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా పాలమూరు జిల్లా సస్యశామలం అవుతుందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెంది వలసలు తగ్గుముఖం పడతాయని గత పాలకుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా నాటి ఏ ఒక్క నాయకుడు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ ప్రాజెక్టు ప్రారంభానికై టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) పార్టీ ఎప్పటినుంచో ఉద్యమి స్తూనే ఉంది. కానీ అప్పటి కొందరు నాయకులు అడ్డుపడుతూనే వచ్చారు.

**తెలంగాణ ఏర్పడ్డాక.. చకాచకా పనులు పూర్తి..**


తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన వెంటనే చేసిన మొదటి పని- అటక మీద దుమ్ము పట్టిపోతున్న పాలమూరు-రంగారెడ్డి పథకం దస్త్రాన్ని బయటకు తీయించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) వారి అధీనంలో పనిచేస్తున్న ఇంజ నీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ) వారిచే సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను తయారు చేయించడానికి రూ. 5.71 కోట్లను మంజూరు చేస్తూ జీఓ నంబరు 69ని తేదీ 1.8.2014న జారీ చేశారు. 6 నెలల తర్వాత ఈఎస్‌సీఐ వారు తయారు చేసిన ముసాయిదా నివేదికలోని ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి స్థాయిలో ప్రభుత్వ సలహాదారు దివంగత ఆర్. విద్యాసాగర్ రావు, సాగునీటి శాఖ సీనియర్ ఇంజనీర్లు, రిటైర్ట్ ఇంజనీర్లు, ఈఎస్‌సీఐ ఇంజనీర్లతో కూలంకషంగా సమీక్ష జరిగింది. ఆ తర్వాత పనులు ఇక ఎక్కడ ఆగలేదు. మధ్యలో కోర్టు కేసుల రూపంలో కొన్ని ఒడిదుడుకులు ఏర్పడినా సర్కారు వాటిని ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా చూస్తూ ప్రాజెక్టుకు మార్గాన్ని సుగమం చేసింది. అప్పటి నుంచి మొన్నటి ప్రారంభం దాకా పనులన్నీ చకచకా జరిగిపోయాయి. పాలమూరు ప్రజల చిరకాల వాంఛ తీరింది.

**ప్రాజెక్టుకు నికర జలాల కేటాయింపులు:**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఒక్క పాలమూరుకే కాదు, దక్షిణ తెలంగాణకు జీవధార వంటిది. కరువు పీడిత, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు తాగునీరు, సాగునీరు అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టింది. కాళేశ్వరం కార్పొరేషన్‌లో భాగం చేసి బ్యాంక్ లోన్‌ల ద్వారా నిధులు కూడా సమకూర్చింది. అయితే కోర్టు కేసుల ఫలితంగా అనుమతులు పొందాలంటే ప్రాజెక్టుకు నికర జలాల కేటాయింపులు తప్పనిసరి. ప్రభుత్వం ఈ విషయంపై మేధోమథనం చేసింది. ఈ మేరకు నికర జలాల కేటాయింపులపై కేంద్ర జలసంఘానికి, పర్యావరణ మంత్రిత్వ శాఖకు పలు మార్లు నివేదికలు పంపించింది.

**కల సాకారమైన వేళ..**

అన్ని అడ్డంకులను అధిగమించి రాష్ట్ర ప్రభుత్వ మొక్కవోని దీక్ష ఫలితంగా సెప్టెంబర్ 16, 2023న గౌరవ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ఇది తెలంగాణ ప్రజలందరి విజయం కూడా. ప్రాజెక్టు 6 దక్షిణ తెలంగాణ జిల్లాలకు, 19 నియోజకవర్గాలకు, 70 మండలాల్లోని 1226 గ్రామాలకు వరదాయినిగా మారబోతున్నది. 60 ఏళ్ల నీటి గోసకు ప్రాజెక్టు ఒక పరిష్కారంగా సెప్టెంబర్ 16న జాతికి అంకితమైంది. ★



కథ

# సారంగ

కార్వేటి నగరం సంస్థానం
17-18వశతాబ్దం

ఆ రోజు ఉదయం శ్రీనివాసులు శాస్త్రి తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నాడు. తను ఆ పాటికే కార్వేటి నగరంలోని వేణుగోపాలస్వామి గుళ్లో ఉండాలి. అక్కడ ఎంత మంది విద్యార్థులు తన కోసం ఆత్రంగా ఎదురుచూస్తూ ఉన్నారో! ఒకవైపు ఎండెక్కుతోంది. మరోవైపు భార్య పద్మావతమ్మకు సన్నిపాత జ్వరం ఇంకా తగ్గలేదు. అప్పటికే వారం రోజులుగా ఆమెకు ఆచారి గారు మందిస్తూ ఉన్నారు. ఉదయం, సాయంత్రం వచ్చి చూసి ధైర్యం చెప్పి వెళుతూనే ఉన్నారు. అయినా ఇంకా గండం గట్టెక్కలేదు. అంతలో, పడుకుని ఉన్న పద్మావతమ్మ మెల్లగా...

'ఇప్పటికే కాలాతీతమైనట్లుందండీ. అక్కడ గుళ్లో మీకోసం పిల్లలు, గురువులు ఎదురు చూస్తూ ఉంటారు. మీరెళ్లండి నాకేమీ కాదు. మందులు, మంచినీళ్లు అన్నీ మంచం పక్కనే పెట్టారు కదా! సాయంత్రాని కల్లా ఎలాగూ వచ్చేస్తారుగా! మరేం పర్లేదు. త్వరగా బయలుదేరండి. ఎండ కూడా ముదురుతున్నట్లుంది' అంది.

ఆమె నిజానికి చాలా నీరసంగా ఉంది. అందుకే బయలుదేరడానికి శాస్త్రిగారు తటపటాయిస్తున్నారు. ఇటు ప్రియపత్ని అనారోగ్యం. అటు గుళ్లో పరీక్ష నిర్వహించడంకోసం వెళ్లవలసిన గురుతరబాధ్యత. కొంతసేపటికి గుండెదిటవు చేసుకుని భార్యతో...

'పద్మా నేను బయలుదేరుతున్నాను. నీకు ఏదైనా అవసరమైతే పక్కింటి పిన్నిగారిని పిలువు. నేను వాళ్లాయన విష్ణుశర్మగారికి ఓమాట చెప్పి వెళతాను' అని భార్యవైపు దీర్ఘంగాచూసి, చేతిసంచీ అందుకుని, ఎట్టకేలకు నారాయణ కండ్రిగలోని ఇంటి నుంచి బయటపడ్డాడు. కార్వేటి నగరం రెండు కోసుల దూరంలో ఉండడంతో వడివడిగా అడుగు లేస్తున్నాడు.

ఆ రోజు అక్కడికి శ్రీనివాసులుశాస్త్రి నారాయణ కండ్రిగ నుంచి రాబోతున్నందున, కార్వేటి నగరం లోని వేణుగోపాలస్వామి గుడి ఆవరణలో విద్యాబోధన రోజూలాగ ప్రారంభమవ్వలేదు.

మునిరత్నంనాయుడు ఆ విద్యా ప్రాంగణాన్ని జాగ్రత్తగా నిర్వహిస్తూ, బయటి ప్రాంతాల నుంచి అక్కడికి వేదవిద్య, కరణీకము, గణిక శాస్త్రము తదితర అంశాల్లో కార్వేటినగరంలో పరీక్షింపబడి, అర్హతపొందిన వారిని ఉత్తీర్ణులుగా ప్రకటించే ఒక ముఖ్యమైన కార్యక్రమాన్ని కూడా పర్యవేక్షిస్తూ ఉంటాడు. ఇంతకు ముందేసదరువిద్యార్థులు వేరేప్రాంతాల్లోతర్ఫీదుపొందివున్నారు. ఊళ్లోని ఉన్నత, సంపన్న వర్గాలకు చెందిన పిల్లలు ఎక్కువగానూ, మధ్య తరగతికి చెందిన వాళ్ల పిల్లలు మధ్యరకంగానూ, నిమ్నవర్గాలకు చెందిన పిల్లలు అతి స్వల్ప సంఖ్యలోనూ అక్కడవిద్యను అభ్యసిస్తూ ఉంటారు. అక్కడ ఉన్నతవిద్యలో తర్ఫీదు పొంది అర్హతసాధిస్తే, విద్యార్థులు తమ విద్యార్జనలో, ఒక ముఖ్యమైన దశను దాటినట్లే! ఒకవిధంగా జీవితంలో ఒడ్డున పడినట్లు కూడా! అలాఅర్హత సాధించిన వాళ్లకు రాజాస్థానంలో కొలువులు దొరికే అవకాశం మెండుగాఉంది. విద్యార్థులు తాము గరపిన విద్యానుసారం పురోహితులుగా, వైదికకర్మలు చేయించే బ్రాహ్మణులుగా, కరణాలుగా ఇంకా ఇతర వృత్తులను సాధికారంగా చేపట్టే సౌలభ్యం లభిస్తుంది. అక్కడ విద్య నేర్పించే గురువులు పార్థసారథిశర్మ, పరమేశ్వరయాజులు గార్లు. యాజులు గారునాయుడితో

'ఏం నాయుడూ! పరీక్ష కోసం గంటాలు, తాళపత్రాలు, శాస్త్రిగారి కోసం మంచినీళ్ల చెంబు.. అన్నీసిద్ధం చేశావా? ఆయన అన్నీ పద్ధతిగా ఉండడాన్నిష్ట పడతారు తెలుసు కదా! అవునూ... శాస్త్రిగారు ఇంకా రాలేదు. కాలాతీత మౌతున్నట్లుందిగా!" అన్నారు.

'అవును సామీ, వేసవికాలం కదా! దగ్గరలోనే ఉండి ఉంటారు' అన్నాడు నాయుడు. తర్వాత 'ఏం



బూలచ్మీ! గుడంతా సుబ్బరంగా ఊడ్చినావు కదా! పెద్దయ్యోరొచ్చే లోపల ఇంకొన్ని ముగ్గులు పెట్టకూడదా?' అని పురమాయించాడు. అంతలో శాస్త్రిగారు నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చి అరుగు మీద కూలబడ్డారు. ఆయన నుదుటన బాగా చెమట పట్టింది. దాన్ని ఉత్తరీయంతో తుడుచుకుంటూ

'విద్యార్థులందరూ వచ్చారా? ఎండెక్కువగా ఉండడం వల్ల కొంచెమాలస్య మయ్యింది' అన్నారు కొంత పశ్చాత్తాపంతో. చల్లటి మంచినీళ్ల చెంబును పార్థసారథి శర్మగారు ఆయనకందించారు.

'అంతాసిద్ధంగానేవుందిసామీ, పరీక్ష కోసం విద్యార్థులు ఆత్రంగా ఎదురు చూస్తా ఉన్నారు' అన్నాడు నాయుడు కాస్త కంగారుగా. అంతలో శాస్త్రిగారి చూపు అక్కడికి కొద్దిదూరంలో గుంజకు ఆనుకుని నిలబడి తనవంక తదేకంగా చూస్తున్న తొమ్మిదేళ్ల చిన్నవాడిపై పడింది. ఆయన నాయుడితో... 'అవునూ.... ఈ చిన్నపిల్లవాడు ఇక్కడేం చేస్తున్నాడు. కొంపదీసి వీడు కూడా పరీక్షకు కూర్చుంటాడా ఏంటి?!" ఆశ్చర్యంతోఅన్నాడు.

# శాస్త్రి

బి.వి. శివప్రసాద్



'లేదుసామీ, వాడు కమ్మరి పనిచేసే ధర్మరాజులు కొడుకు గోవిందరాజులు. గుళ్లో పనిచేసే బూలచ్మితో బాటు రోజూ ఇక్కడికొస్తాడు. పాటలు, పద్దేలు చాలా బాగా పాడుతాడు. మంచితెలివైనోడు. శర్మగారు చెప్పే పాఠాలు దూరం నుంచే విని చదవడం, రాయడం నేర్చుకున్నాడు.' అని అబ్బురంగా చెప్పాడు.

శాస్త్రిగారు ఆ పిల్లవాడికేసి చూస్తూ, దగ్గరకు రమ్మని చెయ్యి ఊపారు. గోవిందరాజులు కొంచెం భయపడుతూ ఆయనకు కొద్దిదూరంలో రెండు చేతులూ కట్టుకుని నిలబడ్డాడు.

"ఏదీ.. ఒకపాట పాడునాయనా!' అని శాస్త్రిగారు వాత్సల్యంగా అన్నారు. వెంటనే గోవిందరాజులు

'అగ్గితిరుణాలంట అజ్జుని కతలంట
ఔరా ఎంత సోద్దెమే' అంటూ పాడాడు.

'ఎవరి పాట ఇది? అర్థం తెలుసా?' అడిగారు శాస్త్రిగారు.

'ఇది దరమరాజులకతలోనిది. సారంగపాణి అయ్యగారిపాట' బదులిచ్చాడు పిల్లవాడు. తర్వాత మరికొంత వివరంగా ఆ పద్యంలోని భావాన్ని వివరించాడతను. చిన్నచిరునవ్వు శాస్త్రిగారి మొహమ్మీద లిప్తకాలం పాటు మెరిసింది. మనసులోనే తనగురువు గారైన సారంగపాణికి గౌరవ వందనం చేసుకున్నారు. ఒకపక్క పరీక్షకు సమయం దాటిపోయింది. అయినాచిన్నవాడి చురుకుదనం ఆయన్నాశ్చర్య పరచింది.

'సరే.. నేనొకపద్యం మొదటి పాదం మాత్రం చదువుతాను. మిగతాది నువ్వు తొందరగా పాడి వినిపించి అర్థం కూడా చెప్పాలి సరేనా?' గంభీరంగా అన్నారు. చిన్నవాడు తలూపాడు. అప్పుడు శాస్త్రిగారు 'బాలరసాల సాల నవపల్లవ కోమల...' అనిఆపారు. గోవిందరాజులు వెంటనే ఆ పద్యం మొత్తం పాడి దాని అర్థం కూడా చకచకా వివరించాడు. 'వీడు సామాన్యుడు కాడు. బాలమేధావి' అని శాస్త్రిగారు పసిగట్టారు. ఆయనిలో వెంటనే ఒక ఆలోచన మెరిసింది. అయితే దాన్ని వెలిబుచ్చకుండా, పిల్లవాణ్ణి మెచ్చుకుని ఆశీర్వదించి పంపారు. తర్వాత తాను నిర్వహించ వలసిన పరీక్ష కార్యక్రమాన్ని మొదలు బెట్టారు.

* * *

పక్కరోజు మునిరత్నంనాయుడు గోవింద రాజులతో

ఏందబ్బయా! నువ్వు బయంగియం లేకుండా అయ్యోరితోటి అట్టమాటాడి నావు. ఆయనెవరను కున్నావు? సారంగపాణి గురువు గారికి ఇష్టమైన శిష్యుడు శ్రీనివాసులుశాస్త్రిగారు. పెద్ద పేరున్న పండితుడు' అన్నాడు నాయుడు.

ఇంటికెళ్లిన శాస్త్రిగారికి గోవిందరాజుల ముద్దుమొహమే తరచుగా గుర్తుకొస్తూ ఉంది. ఆయన భార్య నుదిటిమీద నెమ్మదిగా చెయ్యివేసి చూసారు. ఆమె పరిస్థితి కొంతమెరుగైనట్లే ఉంది. కొంచెం స్థిమితపడ్డారు. అయినా పరాకుగానే ఉన్నారు శాస్త్రి గారు.

శాస్త్రిగారు, పద్మావతమ్మా ఒకరంటే ఒకరు చాలా ప్రేమగా ఉంటారు. అయితే పిల్లల్లేకపోవడం ఒకటే కొరత. పెళ్లయి పదేళ్లయినా పద్మావతమ్మ కడుపు పండలేదు. తనలో ఏదో లోపముందని ఆమె అభిప్రాయం. లోపం ఆమెలో ఉందో, ఆయనలో ఉందో కార్వేటినగరంలో కొలువైన వేణుగోపాల స్వామికే ఎరుక!

మరునాటి రాత్రి ఆయన భార్యతో 'పద్మా! నన్నొక చిన్నపిల్లవాడి మొహం నిన్నటి నుంచి వెంటాడుతూ ఉంది. వాడి పేరు గోవిందరాజులు. వాడిమొహంలో ఏదో తేజస్సుంది. వాడికి వాక్శుద్ధి కూడా ఉంది. బాలమేధావి! వాడు మన కొడుకైతే ఎంత బాగుంటుందో అని నాకు మళ్లా మళ్లా అనిపిస్తూవుంది' అన్నాడు.

'మీ బాధనాకర్థమైందండీ. ఐతే ఎవరి బిడ్డో మన పిల్లవాడెట్లౌతాడు?' సందేహం వెలిబుచ్చిందామె'

'వాణ్ణి మనం దత్తత తీసుకుంటే!?' అన్నారు శాస్త్రి గారు.

'అదెలా కుదురుతుంది. మనవేమెవో బ్రాహ్మణులం. వాడికులం, గోత్రం మనకు తెలీదు

కదా! పైగా వాళ్లు మనవాళ్లే అయినా వాళ్లమ్మా, నాన్న అందుకొప్పు కుంటారా?" అందిపద్మావతమ్మ.

'కులందేముంది పద్మా? ఈ తేడాలన్నీ మనం పెట్టుకున్నవే కదా! నావరకు నాకు ఏ కులమైనా పర్వాలేదు. రేపు మునిరత్నం గారిని ఆ పిల్లవాడి గురించి వివరాలడుగుతాను' అని కొంచెం సేపట్లోనే నిద్రకు పక్రమించారు శాస్త్రి గారు.

అయితే ఆయన మనసుని, గతంలోని కొన్ని ఆలోచనలు తేనెటీగల్లా ముసురుకున్నాయి. 'గురువు సారంగపాణి గారికితాను ప్రియశిష్యుడు. చిన్నతనంలోనే అమ్మా, నాన్నలనుకోల్పోయిన అనాథ కార్వేటినగరంలో తన మేనమామ దగ్గర కష్టాలు పడుతుంటే, ఆ విషయం తెలుసుకున్న గురువు గారు తనను శిష్యుడిగా అక్కున చేర్చుకున్నారు. తను కవిత్వం రాయడంతో బాటు, గురువు దగ్గర నాట్యం కూడా నేర్చుకున్నాడు. గురువుగారు తనను కన్నకొడుకులా చూసుకున్నారు. ఆయనకు చాలా కాలానికి కూతురు పుట్టినా..అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ తనే ఆయనకు ప్రియపుత్రుడు!'



శ్రీనివాసులుశాస్త్రి... ధర్మరాజులు, అతని భార్య మంగమ్మకు మునిరత్నం నాయుడి ద్వారా తన అభిప్రాయం చెప్పారు. మంగమ్మ ససేమిరా అంది. కొడుకునొదులుకోవడానికి ఆమె ఒప్పు కోలేదు. ఐతే ధర్మరాజుల అభిప్రాయం వేరుగా ఉంది. తమది రెక్కాడితేగానీ డొక్కాడని బతుకు. ఎలాగూ తమకు కూతురు కూడా ఉంది. కొడుకు పెద్దింట్లోకి పోతే వాడిబతుకు చాలా బాగుంటుందని అతను నమ్మాడు. అందుకని గోవిందరాజులను శాస్త్రిగారింటికి పంపడానికి చివరకు భార్యను ఒప్పించాడు.

శ్రీనివాసులుశాస్త్రి గతంలోంచి బయటకొచ్చారు. ఎలాగైనా గోవిందరాజులును తన ఇంటికి తెచ్చుకోవాలని, వాడికి తనకు తెలిసిన విద్యలన్నీ నేర్పించాలనీ చాలా ఆశగా ఉంది. సానబెడితే పిల్లవాడు వజ్రంలా మెరుస్తాడనీ, కళారంగంలో మంచి పేరు సంపాదించుకుంటాడనీ నమ్మకంగా ఉంది. తన ఆలోచనలు ఒక స్పష్టమైన రూపం పొందాక ఆయన ప్రశాంతంగా నిద్రపోయారు.

* * *

శ్రీనివాసులుశాస్త్రి... ధర్మరాజులు, అతని భార్య మంగమ్మకు మునిరత్నం నాయుడి ద్వారా తన అభిప్రాయం చెప్పారు. మంగమ్మ ససేమిరా అంది. కొడుకునొదులుకోవడానికి ఆమె ఒప్పు కోలేదు. ఐతే ధర్మరాజుల అభిప్రాయం వేరుగా ఉంది. తమది రెక్కాడితేగానీ డొక్కాడని బతుకు. ఎలాగూ తమకు కూతురు కూడా ఉంది. కొడుకు పెద్దింట్లోకి పోతే వాడిబతుకు చాలా బాగుంటుందని అతను నమ్మాడు. అందుకని గోవిందరాజులను శాస్త్రిగారింటికి పంపడానికి చివరకు భార్యను ఒప్పించాడు.

ఇప్పుడు గోవిందరాజుల నివాసం శాస్త్రిగారి ఇంట్లోకిమారింది.

గోవిందరాజులుకు అంతా కొత్తగా ఉంది. ఇదివరకు వాడున్నది పూరిగుడిసెలో. ఇప్పుడేమో పెద్దఇల్లు. శ్రీనివాసులుశాస్త్రి వాడికి ఉండడానికీ, పడుకోవడానికీ మంచిచోటు చూపించాడు. తన ఇంట్లో ఎక్కువగా రాగి సంకటి, వేరుశనక్కాయల ఊరుబిండితో తినేవాడు. లేదంటేరాగిజావ తాగేవాళ్లు.

ఇప్పుడు గురువుగారి భార్య విసుక్కుంటూనే అయినా పెట్టే మినుముల చింతపండు, చింతకాయ, గోంగూర పచ్చళ్లతోబాటు రకరకాల కూరలు, పులుసులతో అన్నం తింటున్నాడు.

శాస్త్రిగారువాడికి నాలుగు కొత్త పంచెలిచ్చి, అందుకు సరిపడే అంగీలు కుట్టించారు. వాడు అప్పుడప్పుడూ తన ఇంటికి పోయి అమ్మానాన్నలతో కొంత సమయం గడిపివస్తున్నాడు.

శ్రీనివాసులుశాస్త్రి వాడికి సాయంత్రంపూట సంగీత పాఠాలు చెబుతున్నాడు. పద్మావతమ్మకు ఇదంతా కంపరం పుట్టిస్తూఉంది. ఆమెకు గోవిందరాజులు తక్కువ కులం వాడన్న భావం బలంగా ఉంది. అతన్ని అంగీకరించక పోవడానికి అదే ప్రధానకారణం.అయితే శాస్త్రిగారు వాడిని ఎంతో ఇష్టపడి ఇంటికి తెచ్చుకున్నారు కాబట్టి వాడి పట్ల తనకోపాన్ని మరీ ఎక్కువగా బయటకు చూపకుండా గుంభనంగా నెట్టుకొస్తూ ఉంది. శాస్త్రిగారు శిష్యుడికి మంచి శిక్షణ ఇస్తున్నారు. మామూలుగా ఐతే పద్మావతమ్మ వాళ్లు సంగీత సాధనలో ఉన్నప్పుడు తన గది తలుపు గడియ పెట్టుకుని లోపల ఉండిపోతుంది.

ఒకరోజు పనిమీద బయటకువచ్చిన ఆమెకు ఇంటి ముందు అరుగు మీద కూర్చుని సంగీత సాధనలో మునిగిపోయిన గురుశిష్యులు కనిపించారు. గోవిందరాజులు శ్రుతిపక్కంగా కీర్తనొకటి పాడుతున్నాడు. భర్త తన్మయత్వంతో తాళం వేస్తున్నాడు. వారిద్దరూ ఈ లోకంలోనే లేరు. సంగీత ప్రపంచంలో ఓలలాడుతున్నారు. పద్మావతమ్మ ఒకవారగా నిలబడి పాటవింది. గోవిందరాజులు పాడేటప్పుడు అతని మొహం తేజస్సుతో వెలిగి పోతూన్నది. ఆమె గుండె ఆ క్షణాన ఆర్ద్రతతో తడిసింది.

'పిల్లవాడిలో ఉన్న సహజవిద్వత్తుకు వాడి కులం అడ్డురాలేదుకదా! 'అని ఆమె ఆలోచనలో పడింది. వాడిమీద ఆమెలో గూడుకట్టుకు పోయిన ద్వేషం విరగడమనే ప్రక్రియ నెమ్మదిగా ప్రారంభమయ్యింది. వాళ్ల సాధన ముగుస్తున్న సమయానికి మెల్లగా అక్కడి నుంచి తన గదిలోకి వెళ్లిపోయింది.

ఇప్పుడు శాస్త్రిగారికి సంస్థానం నుంచి చాలా తరచుగా పిలుపులు అందుతున్నాయి. అందువల్ల ఆయన తన మకాం నారాయణకండ్రిగ నుంచి కార్వేటినగరానికి మార్చారు. దాదాపు ప్రతిరోజూ సంస్థానానికి వెళ్లి వస్తున్నారు. అందుకని మునిరత్నం నాయుడికి చెప్పి గోవిందరాజులను వేణుగోపాల స్వామి ఆవరణలోని పాఠశాలలో చేర్పించారు.

గోవిందరాజులుకు గురుపత్ని అంటే వల్లమాలిన ప్రేమ, గౌరవం.

ఆమె తనను దూరంగా ఉంచడం వాడికర్థ మయ్యింది గానీ ఎందుకు ఆమె అలా చేస్తుందో బోధపడలేదు. అయితే వాడు ఇప్పుడు ఇంట్లో పనులు కూడా చేస్తున్నాడు. ఆమెకు వాడిమీద పుత్రవాత్సల్యం నెమ్మదిగా ఏర్పడింది. ఒకరోజు యధావిధిగా గురుశిష్యులు సాధనలో మునిగిపోయారు. అప్పుడు పద్మావతమ్మ కొద్దిదూరంలో కూర్చుని పిల్లవాడి పాటలు వింటూఉంది. అంతలో శాస్త్రిగారు గోవిందరాజులతో...

'ఏమొయ్యువ్వు ఈ పాటపాడు' అనివాడికి పల్లవిలోని మొదటి పదం చెప్పారు. తర్వాత పద్మావతమ్మను ఓరగాచూశాడు.శిష్యుడు వెంటనే ఆనందంగా

"లాలనుచువూచేరులలనలింపునను
శ్రీలచెన్నలరునుయ్యలపాన్పునను–"

అని తన్మయత్వంతో పాడాడు. వారిద్దరూ సమయం గురించి స్పృహలో లేరు. చీకట్లు ముసురుకున్నాయి. అది సారంగపాణి రచించి స్వరపరచిన పాట. ఆ పాటలోని లాలిత్యానికి, భావానికి పద్మావతమ్మ ముగ్ధురాలయ్యింది. మైమరచి పోయింది. ఆమెలో మాతృసంబంధమైన ప్రేమ ఉప్పొంగింది. ఉయ్యాలలో తన స్వంత కొడుకును పడుకోబెట్టి తాను జోల పాడుతున్నట్లు ఒక భావన కలిగింది. ఆ కొడుకు బుల్లిపాపడైన గోవిందరాజులే అయితే ఎలావుంటుందో ఒక్క క్షణం ఊహించు కుంది. ఆమె తన్మయత్వంతో కొన్ని క్షణాల పాటు ముందు గోవిందరాజులను, తర్వాత శాస్త్రిగారి కేసి చూసింది. ఆయనకు ఆమె భావం అర్థమయ్యింది. బదులుగా కన్నకొడుకు ప్రతిభను చూసి ఉప్పొంగి పోయిన తండ్రిలా చిన్నగా నవ్వుతూ ఆమెను చూశాడు. ఆమెకు ఆయన పితృవాత్సల్యం స్ఫుటంగా

ఆ నవ్వులో, ఆయనచూపులోకనబడింది. ఆ క్షణంలో ఆ దంపతుల జన్మధన్యమయ్యింది. వెంటనేఆమె 'ఏమండీ! భోజనం వేళ మించి పోయింది. పిల్లవాడు అంతంత సేపు ఆకలితో ఉండకూడదు. కాళ్లు కడుక్కుని రండి. ఇద్దరికీ భోజనం వడ్డిం చేస్తాను' ఆప్యాయంగా అంది.

ఈ మార్పు కోసం, అలాటి రోజు కోసమే శ్రీనివాసులు శాస్త్రి చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు ఆనందంతోఉప్పొంగి పోయాడు. అలా గోవిందరాజులు ఆ కుటుంబ సభ్యుడిగా మారిపోయాడు. ఒకసారి గోవింద రాజులకు ఆటలమ్మ సోకింది. ఒళ్లంతా పొక్కులు తేలాయి. ఒళ్లు జ్వరంతో కాలిపోతూ ఉంది.

వాడు పొద్దెక్కినా లేవకుండా తనగదిలో నిద్రపోతున్నాడు. అది చూసిన పద్మావతమ్మ 'గోవిందా! లేనాయనా' అనిప్రేమగా, ఆదుర్దాగా పిలిచింది.

'అమ్మా!' అని పిల్లవాడు మూలిగాడు. పద్మావతమ్మ వాడి నుదిటిమీద చెయ్యివేసి చూసింది. ఒళ్లు కాలిపోతూ ఉంది. వాడు కప్పుకున్న దుప్పటి నెమ్మదిగా తొలగించింది.

మెడ, చేతుల మీద దద్దుర్లు కనిపించాయి. అతనికి ఆటలమ్మ సోకిందని ఆమెకర్థమయ్యింది. వాణ్ణిమెల్లగాఒడిలోకి తీసుకుని కొంచెం మంచినీళ్లు తాగించింది.వెంటనే భర్తతో

'ఏమండీ! బిడ్డకు అమ్మవారు సోకింది. వెంటనే ఆచారిగారికి కబురుపంపండి. ఆలస్యమైతే ఏం ప్రమాదం ముంచుకొస్తుందో!' అంది. ఆ సమయంలో ఆమె పిల్లవాడి మీద, ప్రేమతో, వాడి స్థితిని చూసి ఆదుర్దాతో తల్లడిల్లింది. ఆచారిగారొచ్చి మంత్రంవేసి చెయ్యాల్సిన ఉపశమన చర్యలు గురించి, పథ్యం గురించి చెప్పారు. ఆయన చెప్పినట్లుగా ఆమె గోవిందరాజుల ఒళ్లంతా శుభ్రంగా తుడిచి వేపాకునూరి వాడి ఒంటికి రాసింది. వేపాకు ఉండలుగా చేసివాడి చేత మింగించింది. అలా ఆటలమ్మ తగ్గేవరకు వాడిని పద్మావతమ్మ సొంతబిడ్డ కంటే ఎక్కువగా చూసుకుంది. అప్పుడుగానీఆమె మనసు కుదుట పడలేదు. శ్రీనివాసులుశాస్త్రి తన కార్యక్రమాలున్నప్పుడు గోవిందరాజులను సంస్థానానికి తనతోబాటు తీసుకుపోతున్నాడు. అలాంటి ఒకరోజు శాస్త్రిగారు అలవాటు ప్రకారం సాంప్రదాయ వస్త్రధారణలో ఉన్నారు. గోవింద రాజులు సాధారణ పంచె, అంగీ తొడుక్కున్నాడు. అప్పుడు పద్మావతమ్మ శాస్త్రిగారితో..

'అదేంటండీ! రాజాస్థానికి పోతూ మనబ్బాయి ఇలాంటి మామూలు బట్టలు వేసుకున్నాడు. అక్కడ ఎందరో పెద్దపెద్దవాళ్లుంటారు కదా! పట్టుపంచె కట్టుకొని, దానికి దీటుగా అంగీ, ఉత్తరీయం వేసుకుంటే బాగుంటుంది కదా! ఉండండి' అని తాను



**ఏమండీ! బిడ్డకు అమ్మవారు సోకింది. వెంటనే ఆచారిగారికి కబురుపంపండి. ఆలస్యమైతే ఏం ప్రమాదం ముంచుకొస్తుందో!' అంది. ఆ సమయంలో ఆమె పిల్లవాడి మీద, ప్రేమతో, వాడి స్థితిని చూసి ఆదుర్దాతో తల్లడిల్లింది. ఆచారిగారొచ్చి మంత్రంవేసి చెయ్యాల్సిన ఉపశమన చర్యలు గురించి, పథ్యం గురించి చెప్పారు. ఆయన చెప్పినట్లుగా ఆమె గోవిందరాజుల ఒళ్లంతా శుభ్రంగా తుడిచి వేపాకునూరి వాడి ఒంటికి రాసింది. వేపాకు ఉండలుగా చేసివాడి చేత మింగించింది.**

స్వయంగా కొత్తబట్టలు తెచ్చిచ్చి గోవిందరాజులును తొడుక్కోమంది. ఆ వాత్సల్యానికి గోవిందరాజుల కళ్లు చెమ్మగిల్లాయి.

విజయనగరసామ్రాజ్యంలో కృష్ణదేవరాయల ఆస్థానంలో కొలువైన ఎనమండుగురు కవుల మాదిరే, కార్వేటినగరసంస్థానలో అష్టదిగ్గజ కవులు బుగ్వేది వెంకట నారాయణ కవి, పోలిపెద్ది వెంకటరాయుడు, పాలమంగలము అప్పయ్య కవి, శ్రీశైల కవి, సారంగపాణి, ముదుంబై అప్పయా చార్యులు, రాయభట్టు వీరరాఘవ కవి, అనంతరాజు సుబ్బరాయ కవి ఉన్నారు. వారు ఆనాటి సభను తమ కవితా పాటవంతో రంజింపచేశారు.

భోజనానంతర సభలో నాట్య కార్యక్రమం ఏర్పాటయ్యింది. అదొక నృత్య రూపకం.అందులో శ్రీదేవి ప్రధాననర్తకి. ఆమె తన అద్వితీయ రూప లావణ్యాలను, అంతకుమించి నాట్య కౌశలాన్నీ కలబోసి సభికులను మంత్రముగ్ధులను చేసింది. కార్యక్రమం ముగియగానే అందరూ ఆనందంతో లేచి నిలబడి కరతాళ ధ్వనులతో సభను హోరెత్తిం చారు. గోవిందరాజులకు నాట్యమంటే విపరీతమైన మక్కువ కలిగింది. ఎంతగా అంటే.. తను కూడా నృత్యం నేర్చుకోవాలనుకేంత! ఒకరోజు గురువుగారికి తన కోరికను విన్నవించాడు. గోవిందరాజులుకు చక్కటికనులు, ముక్కుతీరు, స్ఫురద్రూపం ఉన్నాయి. శాస్త్రి గారికిశిష్యుడి తపన అర్థమయ్యింది. అప్పటి నుంచి గోవిందరాజులుకు సంగీతంతో బాటు నాట్యసాధన మొదలయ్యింది. పాలమంగలము అప్పయ్య కవి, శ్రీనివాసులుశాస్త్రి గార్ల మధ్య మంచి సాన్నిహిత్యం ఉంది.

ఒకరోజుఅప్పయ్యకవి 'మీగురువుగారైన సారంగపాణి పదాలు ఆణిముత్యాల్లాంటివి. దేవాలయాలు, బిచ్చగాళ్లు, ముసలమ్మలలోకి కూడా అవి పాకినాయి. వారంతా ఆ పదాలను పదే పదే పాడుకుంటున్నారు. అంతేకాక ఎక్కడో ఉన్న బొబ్బిలి ప్రాంతాల్లో కూడా ప్రజలు పాడుకుంటున్నారట. ఎక్కడి కార్వేటినగరం? ఎక్కడి బొబ్బిలి?' అన్నారు. శాస్త్రిగారు బదులుగా చిన్నగా నవ్వారు. ఆరోజు భోజనానంతరం సభలో పెరుమాళ్లు రాజుగారు, శాస్త్రిగారిని ప్రత్యేకంగా పిలిపించుకుని..

'మీకు తెలుసుకదా! సారంగపాణిగారు వానప్రస్థంలోకి త్వరగా వెళ్లబోతున్నట్లు ఇటీవలే సూచించారు.అందుచేత ఆయనకు మనం ఘనంగా సత్కారం చెయ్యాలి. వచ్చే శుక్రవారము మీ ప్రత్యేక కార్యక్రమం కోసం మూడు గంటల సమయము కేటాయిస్తున్నాము. మీ విద్వత్తునంతా రంగరించి మంచి సాహిత్య, సంగీత, నాట్య ప్రక్రియలతో కూడుకున్న ప్రదర్శననివ్వండి. అది మీ గురువు, మాకత్యంత ఇష్టులైన సారంగపాణి గారిని మనం సముచిత రీతిని సత్కరించుకునే కార్యక్రమం. ఆసాంతం'నభూతో నభవిష్యతి' అన్నట్లుగా ఉండాలి. అది ఆయనకు ఆనంద, విస్మయాల్నికలిగించాలి. మరపురానిదిగా ఉండాలి. ఇక మీ ఏర్పాట్లు మొదలుపెట్టండి." అనిఆజ్ఞాపించారు.

శాస్త్రిగారికి ఆమాట విన్నవెంటనే గురుభక్తి, విస్మయము, సంతోషంతో కూడిన ఒకవింతైన భావన కలిగింది. అది ఒక అపురూప అవకాశం. తన ప్రియ శిష్యుడైన గోవిందరాజుల ద్వారా తన ఇష్టగురువుకు నీరాజనం అర్పించే ఒక అద్భుతమైన, అరుదైన అవకాశం అనేకుంటూ...తన ప్రదర్శనను సిద్ధం చేసుకోవడానికి ఉపక్రమించారు. గోవిందరాజులు మరింత ప్రత్యేక శ్రద్ధతో సాధనలో మమేకమయ్యాడు.

అప్పుడప్పుడూ తనే ఆ కార్యక్రమంలో నర్తకి అయినట్లుగా కూడా ఊహించుకున్నాడు. ప్రదర్శన చేసే శుభసందర్భం ఆసన్నమయ్యింది. నిండుసభ కొలువుతీరింది. రాజకుటుంబీకులతో, ఆహ్వానితులైన పొరుగున ఉన్న సంస్థానాధీశులతో, పురప్రముఖు లతో ఆ ప్రాంతం పండుగ వాతావరణాన్ని తలపిస్తూ ఉంది.

ముందుగా కవిసమ్మేళనం ప్రారంభమయ్యింది. శాస్త్రిగారు తాను కొత్తగా రచించిన పదమొకటి పాడాడు. ఆతరువాత పాలమంగలము అప్పయ్యకవి 'శరసంధాన బలక్షమాది...' అను అల్లసాని పెద్దన పద్యమును చదివి, దీనికి కృష్ణరాయలు నాలుగువేల వరాలిచ్చెను," అన్నారు. అందుకు ఆస్థానామాత్యులు రామకృష్ణమరాజుగారు...

'పెద్దనవలె కవిత్వము చెప్పువారు కలరా?' అని అడిగారు.



'ఏమండీ మన గోవిందరాజులను చూస్తుంటే నాకు కన్నులపండుగగా వున్నది. శ్రీదేవి అతనికి సరైన జోడీ అని నాకనిపిస్తూ ఉంది. వారిద్దరికీ పెళ్లి చేస్తే ఎలా ఉంటుంది? ముఖ్యంగా సారంగపాణిగారి కళావారసత్వం మీకు, మీ ద్వారా ఆయన ప్రశిష్యులైన శ్రీదేవి, గోవిందరాజులుకు వచ్చింది. వీరిద్దరికి పెళ్లయితే వీళ్లకు పుట్టే నా మనవలు, మనవరాళ్ల ద్వారా, ఇది పదికాలాల పాటు కులమతాలకు, వర్ణ భేదాలకుఅతీతంగాసాగుతూ ఉంటుందన్న ప్రగాఢ విశ్వాసం నాకు కలుగుతూ ఉన్నది. మీరేమంటారు?' అంది.

"కృష్ణరాయలు వలె నిచ్చువారున్నచో పెద్దనవలె కవిత్వము చెప్పువారు కలరు' ని అదరు బెదరు లేక బదులిచ్చాడు అప్పయ్యకవి. దీనిని విని రాజసము మూర్తికట్టిన రాజుగారు కొంత కోపముతో...

'రాయలిచ్చినరీతినిత్తుము, పెద్దన చెప్పిన పద్యమును బోలిన పద్యమును చెప్పువారిని చూపుము' అని గద్దించారు. అప్పుడప్పయ్య కవి..

'వసు సంపత్తి, సువృత్తి, భూభృతి, దయావైదగ్ధ్య ముల్ గల్గి మేష సదుచ్చత్వ ఖగత్వ జాడ్య బుధశిక్షా చౌర్యముల్ మానినన్...' అని అశువుగా చదివారు. అప్పుడు శ్రీనివాసులుశాస్త్రి...

'ఇప్పుడు ఈ పద్యాని కర్థాన్ని నా శిష్యుడైన గోవిందరాజులువివరిస్తాడు' అని ప్రకటించారు. గోవిందరాజులు ముందుకొంత సంశయించినా వెంటనే తేరుకుని, తనకంచుకంఠంతో అర్థాన్ని చక్కగా వివరించాడు. రాజుగారికి, సభలోనున్న యావన్మందికీ గోవిందరాజులప్రతిభ అర్థమయ్యింది.

వాళ్లు 'ఇతను గురువుకు తగినశిష్యుడే!'అని అనుకోవడం కొంచెం గట్టిగానే ఆ సభలో వినిపించింది. పద్యంలో ఉన్న కల్పనా చమత్కృతిని, శిల్పసంపత్తిని రాజావారు మెచ్చి నన్నూరు (నాలుగు వందలు) వరహాలను అప్పయ్యకవికి బహుమతిగా ఇచ్చారు. సభంతా చప్పట్లతో మారుమోగిపోయింది.

గోవిందరాజులుకు కళలకు తమ సంస్థానంలో ఇచ్చే విలువ ఎలాంటిదో అర్థమయ్యింది.

మరుసటి అంశంగా శాస్త్రిగారి కార్యక్రమం ఉంది. అది అతి ముఖ్యమైనది. సారంగపాణికి అది 'జీవన సాఫల్యపురస్కార'కార్యక్రమం. అందుచేత ఆయన కూడా ఒకింత ఉద్వేగము, ఉత్సాహము, రవ్వంత ఆందోళన కలగలసిన భావావేశస్థితిలో ఉన్నారు. అయితే, ప్రధాననర్తకి శ్రీదేవి, ఆ ఉదయమే ఆమె తండ్రి హృద్రోగంతో మరణించడంతో సభాస్థలికి చేరుకో లేకపోయింది.

ఇంకొంచెంసేపట్లో రూపకం మొదలవ్వాలి. శాస్త్రిగారు కుదేలైపోయారు. ఆయన మనసు మనసులో లేదు. విషయం తెలియగానే కాలుగాలిన పిల్లిలా కాసేపు అటూ, ఇటూతిరిగారు. కొంచెంసేపు తనలోతానే తర్జనభర్జనపడ్డారు.

కొంచెం సేపట్లోనే నృత్య కార్యక్రమం మొదలయ్యింది. శాస్త్రిగారి కంటే ఎక్కువగా సారంగపాణి గారి మనసు కుదుటపడింది. శాస్త్రితానే వ్యాఖ్యానం, నట్టువాంగం చేస్తున్నారు. ముందుగా శంకరాభరణ రాగంలో, త్రిపుటతాళంతో

'ఇంత మోహమేమిరా ఇందరి కన్న ఇంతి చక్కని దెమి అను... సుంతసేపు దాని చూడకుండ గలెవు అంతరంగము తెలుపవది యేల వేణుగోపాల– ఇంత–'

అంటూ రాగ, తాళ, నృత్యభరితంగా ప్రారంభించారు. కొన్ని నిమిషాలపాటు సభికులను ఆ పదముతో మంత్రముగ్ధుల్నిచేశాడు. తదుపరి భైరవి రాగం, ఆదితాళంలో

'భక్తితో పిలిచి పెటియన్నము పట్టెడైన చాలు....' అనేభక్తి, వైరాగ్యములతో కూడిన కీర్తనను ఆలపించారు.. తదుపరి ఇంకొన్ని సారంగపాణి కీర్తనల తర్వాత, చివరిగా, 'ఎంతపేదవాడే– వేణుగోపాలుడెంత పేదవాడే, తర్వాత

'అక్షయ పాత్రకు పోతే – కలదని
ఒక భిక్షమువేయరయా' అన్న పదాన్ని ప్రదర్శించాడు.

అన్నిపదాలకు నర్తకి అద్భుతమైన భావప్రకటనతో, లయవిన్యాసాలతో, నవరసాలను తన నయనాలతో ప్రస్ఫుటంగా వ్యక్తపరుస్తూ నృత్యం చేసింది. అయితే ఆమెను ఇదివరకూ ఎవరూ సంస్థానంలో, కార్యక్రమాల్లో చూడలేదు. కార్యక్రమాలను ఆసాంతం అపురూపంగా తిలకిస్తున్న పద్మావతమ్మ మాత్రం

'ఈమెను ఎక్కడో చూసినట్లుగా ఉంది, ఎవరో చాలా సన్నిహితురాలిలాగా తోస్తూ ఉంది!' అని గుర్తుతెచ్చుకోవడానికిప్రయత్నించింది. అంతలో అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తూ ఆ నర్తకి తన తలపైనున్న కేశాలంకరణను తొలగించింది. అంతే! రాజుగారు, సభాసదులు సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయారు. ఆమె ఎవరో కాదు, అందాకా స్త్రీ వేషంలో అద్భుతంగా నర్తించిన శ్రీనివాసులుశాస్త్రి ప్రియ శిష్యుడైన నవయవ్వన గోవిందరాజులే! అప్పుడు సభికులు రాజుగారితో పాటు ఒక అవ్యక్తమైన అనుభూతికి లోనయ్యారు. పద్మావతమ్మ సంభ్రమాశ్చరాల్లో మునిగి ముగ్ధురాలయ్యింది.

ఒకింత గర్వంతో కూడుకున్న ఆనందవీచిక ఆమెలోఒక్కక్షణం కదలాడింది. సభలోనే ఉన్న సారంగపాణి కూడా తన ప్రశిష్యుడి (శిష్యుని శిష్యుడు) ప్రజ్ఞకు మురిసిపోయారు. ఆనందంతో కళ్లు చెమర్చాయి. ఆయనకు తాను గతంలో స్త్రీవేషం కట్టిసభికులను రంజింప చేసిన సందర్భాలు లీలగా గుర్తుకొచ్చాయి. రాజుగా రితో కూడుకున్న ఆ నిండు సభ, ఆ మూడుగంటల ప్రదర్శనానికి పులకించిపోయింది. సారంగపాణిగాకి కళ్లలో ఆనందాశ్రువులు ఊరాయి. తన జన్మ తనశిష్య, ప్రశిష్యుల మహాద్భుత ప్రదర్శన ద్వారా సార్థకమైన అనుభూతి ఆయనకు కలిగింది. పెరుమాళ్లు రాజుగారు తన సంస్థానము లోని దుర్గరాజపురమును శ్రోత్రియ గ్రామమును సారంగపాణి కవివర్యులకు బహుమతిగా ప్రకటించారు.

కాలక్రమంలో శ్రీనివాసులుశాస్త్రి కూడా పెద్ద వయసులోకిప్రవేశించాడు. గోవిందరాజుల కళా ప్రాభవం కొనసాగుతూ ఉంది. అతను 'సారంగపాణి సంగీత నృత్యకళాశాల' స్థాపించి శిష్యులకు వర్ణ, మత బేధాల కతీతంగా సంగీతంలో, నాట్యంలో శిక్షణ నిస్తున్నాడు.

పద్మావతమ్మ శాస్త్రిగారితో ఒకరోజు..

'ఏమండీ మన గోవిందరాజులను చూస్తుంటే నాకు కన్నులపండుగగా ఉన్నది. శ్రీదేవి అతనికి సరైన జోడీ అని నాకనిపిస్తూ ఉంది. వారిద్దరికీ పెళ్లి చేస్తే ఎలా ఉంటుంది? ముఖ్యంగా సారంగపాణిగారి కళావారసత్వం మీకు, మీ ద్వారా ఆయన ప్రశిష్యులైన శ్రీదేవి, గోవిందరాజులుకు వచ్చింది. వీరిద్దరికి పెళ్లయితే వీళ్లకు పుట్టే నా మనవలు, మనవరాళ్ల ద్వారా, ఇది పదికాలాల పాటు కులమతాలకు, వర్ణ భేదాలకుఅతీతంగాసాగుతూ ఉంటుందన్న ప్రగాఢ విశ్వాసం నాకు కలుగుతూ ఉన్నది. మీరేమంటారు?' అంది.

శాస్త్రిగారు ఒక్క నిమిషం కళ్లు మూసుకుని, జరగబోయే ఘట్టాలను ఊహించుకుని, ఆపై నెమ్మదిగా కళ్లు తెరిచి, భార్యకేసి సాభిప్రాయంగా చూసి, ఒక చిరుమందహాసం చేశారు.

తొందరలోనే గోవిందరాజులు, శ్రీదేవి కుల, మతాలకతీతంగా వివాహబంధంలో ఒక్కటయ్యారు. వారిద్దరూ సారంగపాణిసాహితీ, సంగీత, నృత్య సంపదను విరివిగా ప్రచారం చేస్తూ ఉన్నారు. కార్వేటి నగరం కోవెలలోని శ్రీ వేణుగోపాలస్వామి తన చల్లాని చూపులను పాలకులపైన, సామాన్యుల పైన ప్రసరిస్తూ ఉన్నాడు. గోవిందరాజులు, శ్రీదేవి ద్వారా అసంఖ్యాక శిష్య పరమాణువులకు – కళా వారసత్వం, దేశానికే తలమానికమైన గురుశిష్య పరంపర, కొనసాగుతూ ఉంది!!! ★

యాభై ఓవర్ల వన్డే క్రికెట్లో మరో ప్రపంచకప్‌నకు భారత్ వేదికగా రంగం సిద్ధమయ్యింది. అక్టోబర్ 5 నుంచి నవంబర్ 19 వరకూ జరిగే ఈ 10 జట్ల సమరానికి... రెండుసార్లు విజేత, ప్రపంచ నంబర్ వన్ ర్యాంకర్ భారత్ సన్నద్ధమైంది. రోహిత్ శర్మ నాయకత్వంలోని 15 మంది సభ్యుల భారత జట్టు మూడోసారి విశ్వవిజేతగా నిలవాలన్న పట్టుదలతో టైటిల్ వేటకు సిద్ధమయ్యింది... ఇన్‌స్టంట్ వన్డే క్రికెట్లో మరో ప్రపంచకప్ సమరానికి అంతర్జాతీయ క్రికెట్లోని అగ్రశ్రేణి జట్లన్నీ సకల అస్త్రశస్త్రాలతో సిద్ధమయ్యాయి. భారతగడ్డపై పుష్కరకాల విరామం తరువాత జరుగనున్న 2023 సమరానికి దేశంలోని 10 వేదికలు ఆతిథ్యమివ్వనున్నాయి. అక్టోబర్ 5 నుంచి నవంబర్ 19 వరకూ.. ప్రపంచకప్‌ను మొత్తం 48 మ్యాచ్‌లుగా నిర్వహించడానికి నిర్వాహక సంఘం విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేసింది.

ICC MEN'S CRICKET WORLD CUP INDIA 2023

# భారతగడ్డపై ప్రపంచకప్ సంరంభం!

ఈ భూఖండంలో అత్యధిక మంది క్రికెట్ అభిమానులున్న ఏకైక దేశం భారత్ నాలుగోసారి ఐసీసీ వన్డే ప్రపంచకప్‌నకు ఆతిథ్యమిస్తోంది. 1987, 1996, 2011 సంవత్సరాలలో ప్రపంచకప్‌ను విజయవంతంగా నిర్వహించిన బీసీసీఐ 12 సంవత్సరాల విరామం తర్వాత మరోసారి ఆతిథ్య దేశంగా బాధ్యతలు స్వీకరించింది.

అక్టోబర్ 5 నుంచి 46 రోజులపాటు సాగే ఈ 48 మ్యాచ్‌ల సమరంలో వెస్టిండీస్, జింబాబ్వే మినహా మిగిలిన ప్రముఖ జట్లన్నీ ఢీ కొనబోతున్నాయి.

వన్డే ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక టైటిల్స్ విజేత ఆస్ట్రేలియా, రెండుసార్లు విన్నర్ భారత్, ఇంగ్లండ్, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్, సౌతాఫ్రికా, పాకిస్థాన్, నెదర్లాండ్స్ జట్లు టైటిల్ వేటకు దిగుతున్నాయి.

తొలిదశ 10 జట్ల రౌండ్ రాబిన్ లీగ్‌లో ఒక్కో జట్టు తొమ్మిది మ్యాచ్‌లు చొప్పున ఆడనుంది. రౌండ్ రాబిన్ లీగ్ మొదటి నాలుగు స్థానాలలో నిలిచిన జట్లు సెమీఫైనల్స్ నాకౌట్ రౌండ్లో పోటీపడతాయి.

నవంబర్ 15న ముంబై వేదికగా తొలి సెమీఫైనల్స్, నవంబర్ 16న కోల్ కతా వేదికగా రెండో సెమీఫైనల్స్ నిర్వహిస్తారు. నవంబర్ 19న అహ్మదాబాద్ నరేంద్రమోదీ స్టేడియం వేదికగా టైటిల్ సమరం నిర్వహించనున్నారు. సెమీఫైనల్స్ నుంచి




ప్రతి మ్యాచ్‌కూ రిజర్వ్ డే సదుపాయం కల్పించారు.

**అత్యంత పటిష్టంగా భారత్.....**

వన్డే క్రికెట్లో నంబర్ వన్ ర్యాంక్ జట్టుగా ఉన్న భారత్ సొంత గడ్డపై అత్యంత సమతూకంతో పటిష్టంగా కనిపిస్తోంది. డాషింగ్ ఓపెనర్ రోహిత్ శర్మ నాయకత్వంలోని భారతజట్టుకు కుదురైన బ్యాటింగ్, పదునైన బౌలింగ్, చురుకైన ఫీల్డింగ్ ఉన్నాయి. ప్రపంచకప్‌నకు సన్నాహకంగా జరిగిన ఆసియాకప్‌తో పాటు.. ఆస్ట్రేలియాతో జరిగిన తీన్మార్ సిరీస్‌ను సైతం భారత్ అలవోకగా నెగ్గడం ద్వారా అసలు సిసలు సమరానికి సిద్ధమయ్యింది.

10 జట్ల రౌండ్ రాబిన్ లీగ్ దశలో భారత్ తన ప్రారంభమ్యాచ్‌ను అక్టోబర్ 8న చెన్నై చెపాక్ స్టేడియం వేదికగా ఐదుసార్లు విన్నర్ ఆస్ట్రేలియాతో ఆడనుంది. అక్టోబర్ 11న అఫ్ఘనిస్థాన్, 14న పాకిస్థాన్, 19న బంగ్లాదేశ్, 22న న్యూజిలాండ్, 29న ఇంగ్లండ్, నవంబర్ 2న శ్రీలంక, 5న దక్షిణాఫ్రికా, నవంబర్ 12న నెదర్లాండ్స్ జట్లతో భారత్ పోటీపడ నుంది.

**భారత ప్రపంచకప్ 'కల' నెరవేరేనా?**

ఐసీసీ ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో భారత్ ఇప్పటి వరకూ 1983, 2011 వన్డే ప్రపంచకప్‌లతో పాటు 2007 టీ-20 ప్రపంచకప్‌ను మాత్రమే సాధించింది. గత దశాబ్దకాలంగా ఐసీసీ టోర్నీలలో దారుణంగా విఫలమవుతూ వస్తున్న ప్రపంచ నంబర్ వన్ భారత జట్టు ప్రస్తుత 2023 ప్రపంచకప్‌ను గెలుచుకొని తీరాలన్న పట్టుదలతో ఉంది.

పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ, హిట్ మ్యాన్ రోహిత్ శర్మ, మహ్మద్ షమీ, రవీంద్ర జడేజా లాంటి అపార అనుభవం కలిగిన ఆటగాళ్లతో పాటు.. శుభ్ మన్ గిల్, ఇషాన్ కిషన్, మహ్మద్ సిరాజ్ లాంటి యువ క్రికెటర్లు, శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్, కుల్దీప్ యాదవ్ లాంటి సెమీ సీని యర్లతో భారతజట్టు అత్యంత పటిష్టంగా కనిపిస్తోంది. ఆరు నూరైనా ప్రపంచ కప్‌ను మూడోసారి నెగ్గితీరాలన్న కసితో ఉంది.

**విజేత జట్టుకు 33 కోట్ల రూపాయల నజరానా!**

ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధిక మొత్తంలో ప్రైజ్ మనీని ప్రస్తుత టోర్నీలోనే అందచేయనున్నారు. విజేతగా నిలిచిన జట్టుకు ఐసీసీ ట్రోఫీతో పాటు 33 కోట్ల 25 లక్షల 84వేల (40 లక్షల డాలర్లు) రూపాయలు నజరానాగా ఇవ్వనున్నారు.

రన్నరప్‌గా నిలిచిన జట్టుకు 16 కోట్ల 62 లక్షల 54వేల 200 రూపాయలు (2 మిలియన్ డాలర్లు) అందచేస్తారు. సెమీఫైనల్స్‌లో పరాజయం పొందిన రెండు జట్లకు 6 కోట్ల 65 లక్షల రూపాయల చొప్పున, రౌండ్ రాబిన్ లీగ్ నుంచి నిష్క్రమించిన 6 జట్లకు 83 లక్షల రూపాయల చొప్పున చెల్లిస్తారు.

రౌండ్ రాబిన్ లీగ్ దశలో నెగ్గిన ప్రతిమ్యాచ్ లోనూ విజేత జట్టుకు 66 లక్షల రూపాయల చొప్పున ఇస్తారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మొత్తం 83 కోట్ల 13 లక్షల 10వేల 500 రూపాయల మొత్తాన్ని ప్రైజ్ మనీగా ఐసీసీ కేటాయించింది.

ఏడు వారాల పాటు విశ్వక్రికెట్ అభిమానులను ఓలలాడించే ఈ ప్రపంచకప్ సమరంలో భారత్ విజేతగా నిలవాలని శతకోటి అభిమానులతో పాటు మనమూ కోరుకొందాం.! ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

# ప్రత్యక్షరం

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులుగా, జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షులుగా, ఆర్షగురుకుల విద్యాపీఠ స్థాపకులుగా, విశ్వహిందూపరిషత్ ఉపాధ్యక్షులుగా, శ్రీ సరస్వతీ విద్యాపీఠం విద్వత్ పరిషత్ సభ్యులుగా, ఆర్యసమాజ్ సిద్ధాంతాల ప్రచారకునిగా, రాందేవ్ బాబా పతంజలి యోగ విద్యా ప్రచారకులుగా, జానపద విజ్ఞాన శాస్త్రవేత్తగా విశిష్ట సేవలందించిన ఆచార్య రఘుమన్న, తాము స్థాపించిన గురుకుల ఆశ్రమంలో సెప్టెంబర్ 10వ తేదీన పరమపదించారు. ఎనభై నాల్గు సంవత్సరాల వయస్సులోనూ వారు నిరంతరం వేదధర్మ ప్రచారంలోనే ఉండేవారు. 'పల్లెల్ల పొద్దు పొడిసింది, ముత్తిపదాలు, అకాల జ్ఞానతత్త్వాలు, రామబాణం, పల్లెపదాల్లో ప్రజాజీవనం, కవిశాసనం, స్త్రీయే బ్రహ్మ, యోగమే సంపూర్ణ సమాధానం, వేదమే సంపూర్ణ సమాధానం...' వంటి 16 గ్రంథాలు వారు ప్రచురించారు.

---

'నేను ఇనిస్పెక్టర్ను సర్! మీ ఆశ్రమం దగ్గరి గ్రామాల వాళ్లు నామీద పైవాళ్లకు ఫిర్యాదు చేశారు. నా ఉద్యోగం పోతది సర్! పెద్దలు మీరు చెబితే వాళ్లు వాపస్ తీసుకుంటారు సర్! మీరే నాకు దిక్కు సర్!" అంటూ దగ్గరికి వచ్చి దండం పెట్టుకోబోయాడు ఆ ఇనిస్పెక్టర్.

"అట్ల కుర్సీల కూసోండి! దండం దస్కాలు ఏమీ వద్దు. నువ్వు తప్పు చెయ్యక పోతే నీకు ఏమీ కాదు. తప్పు చేసిన ప్రతివాడూ శిక్షననుభవించాల్సిందే! నాకు తెల్సింది... చిన్న పంచాయితీతో రెండు కుటుంబాల వాళ్లు నీదగ్గరికి వస్తే సర్దిచెప్పటానికి మారుగా అందరినీ బూతులుతిడుతూ పది మందిని కొట్టావు. అట్లే నీ వీపు పలగాలి బిడ్డా! నువ్వు ప్రజలను రక్షించేవాడవా! నీకు శిక్ష తప్పదు..." అన్నాడు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షస్థానంలో ఉన్న జాతీయ విప్లవకవి, కవిశాసన పండిత రఘుమన్న.

"నా బతుకు తెరువు.. నా ఉద్యోగం... సర్" అన్నాడు దీనంగా ఇనిస్పెక్టర్.

"లేవకు... దగ్గరికి రాకు... నా దగ్గరికి వస్తూ కూడా నీవు తాగి వచ్చినవు. ఇంతదాక వాసనొస్తుంది. నువ్వేం రక్షకుడవయ్యా... ఛీ... ఛీ..." విసుక్కొన్నాడు రఘుమన్న.

"తప్పయింది సర్. ఇప్పట్నుంచి తాగను సర్! ఒట్టేసి చెబుతున్నా! వాళ్లందరి ముందు తప్పయ్యిందని తలవంచుకొంటా సర్!" అని లేచి నిలబడ్డారు ఇనిస్పెక్టర్.

"మంచిది! సాయంకాలం నేను ఆశ్రమానికి వస్తున్నా! ఆ ప్రజల ముందుకే నిన్ను పిలిపిస్తా! ప్రజలతోటే నీకు శిక్ష పడేట్టు చేస్తా! తాగొద్దు! అక్కడికి తాగి రావొద్దు! వెళ్లు" అన్నాడు రఘుమన్న. అతను తలవంచి దండం పెట్టుకొంటూ వెళ్లిపోయాడు. దీనికి ఈ వ్యాసకర్తే సాక్షి.

రఘుమన్న సిద్దిపేట డిగ్రీ కళాశాల వార్షికోత్సవానికి వక్తగా వెళ్లారు. విద్యార్థుల్లోని మరో వర్గం విరసం విప్లవకవిని పిలిపించుకొంది. ఉపన్యాసాలై




నాయి. రాత్రి 8 గంటలకు భోజనాలు చేశారు. ఆ విప్లవకవి సగం తిని దాదాపు సగం వదిలేశాడు. ప్లేటును చెత్తలో పెట్టేశాడు.

"నువ్వూ ఇయ్యల్దగ్గర శ్రమజీవుల గురించి మాట్లాడినవు గదా! మరి గంతన్నం పారేసిన వేంది! శ్రమజీవుల ఒక్కొక్క నెత్తుటి బొట్టు నుంచి ఒక్కొక్క మెతుకు పుట్టింది తెలుసా!" అన్నాడు రఘుమన్న. అతను తలవంచుకొని వెళ్లిపోయాడు. అక్కడున్న వాళ్లందరూ ఆశ్చర్యపోయారు, అవాక్కయ్యారు. ఆ ఉత్సవానికే మరో వక్తగా వెళ్లిన ఈ వ్యాసకర్తే దీనికి కూడా సాక్షి.

రఘుమన్న తెలుగు శాఖ అధ్యక్షులుగా ఉన్నా, ఆచార్యులుగా ఉన్నా తరగతి గదికి వెళ్లి పాఠం చెప్పడానికి ముందు, పాదరక్షలు తన గదిలోనే వదిలి వెళ్లేవారు. ఏనాడూ చెప్పులతో పాఠాలు చెప్పలేదు. ఆ శాఖలోనే విరసం భావాలున్న ఓ ఉపన్యాసకులు రఘుమన్న పాదరక్షల్ని ఆయన కుర్చీ మీద పెట్టి ఫొటో తీయించి, తన భావాలతో నడుస్తున్న ఓ దినపత్రికకు వార్తా సహితంగా పంపించాడు. మరుసటి రోజు ఆ దినపత్రికలో 'చెప్పుల పాలైన తెలుగుశాఖ అధ్యక్ష పీఠం' అనే శీర్షికతో ఫొటోసహా వార్తా కథనం వచ్చింది.

ఇంత మంచి అయిడియా మీకెలా వచ్చింది అని అతని మిత్రులు అడిగితే "శ్రీరాముని పాదుకలను భరతుడు తెచ్చాడు గదా! అది విమర్శిస్తూ చెప్పుల పాలైన సింహాసనం అని విషవృక్షంలో ఆ రచయిత్రి రాసింది కదా! అదీ నాకు స్ఫూర్తినిచ్చింది" అన్నాడట ఆ విశ్వవిద్యాలయ పంతులుగారు.

పత్రికలో వచ్చిన ఈ విషయం రఘుమన్నగారితో ప్రస్తావిస్తే, 'మేధావులు, క్షత్రియులు, ఉత్పత్తిదారులు, శ్రామికులు వరుసగా ప్రపంచ పాలకులవుతారని వివేకానందస్వామి యెప్పుడో అన్నాడు. ఇప్పుడు శ్రామికులయ్యారంతే" అన్నారట నవ్వుతూ. దటీజ్ రఘుమన్న!

మరొక్కటి సంఘటనను ఉదాహరిస్తాను.

రఘుమన్న జీవితంలో స్థిరపడ్డప్పటి నుండి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్కు, విశ్వ హిందూ పరిషత్తుకు, సరస్వతీ విద్యాపీఠానికి, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తుకు సన్నిహితులయ్యారు. ఆర్యసమాజ సిద్ధాంతాలను సంపూర్ణంగా విశ్వసించి అందులో గురుస్థానానికి ఎదిగారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠంలో ఆచార్య లకు, విద్యార్థులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విద్యాపీఠం నిర్మాత శ్రీమాన్ శఠగోపం లక్ష్మీనరసింహాచార్యుల వారికి రఘుమన్నగారు సన్నిహితులయ్యారు. శ్రీమాన్ ఆచార్యులవారు ఆయనను ఆయా పాఠశాలలకు, వసతి గృహాలకు పర్యవేక్షణ నిమిత్తం, విద్యార్థులకు సంస్కారాలందించే నిమిత్తం పంపించేవారు. అలా పర్యవేక్షించి, విద్యాపీఠం ఉన్న శారదా ధామంలో ఓ గదిలో ఉన్నారు. ఆ పక్క గదిలోనే ఆచార్యుల వారు, నేనూ, మరి కొందరం కూచున్నాం. మాటల్లో ఆశ్రమ వసతి గృహాల విషయం చర్చకు వచ్చింది.

''ఏం చేయాలో యేమో! మాకో అపర దయానంద సరస్వతుల వారు దొరికారు. పర్యవేక్షణకు వెళ్లిన ఆయన ఆ పాఠశాలల మంచీ చెడ్డలు విచారించకుండా, అక్కడి విద్యార్థులకు వంకాయ కూరపెట్టరాదని, పిల్లలు వంకాయ కూరే తినరాదని, మీరుగాని వండితే జాగ్రత్త అని హెచ్చరించి, వంట చేయించే వాళ్లను భయపెట్టి వచ్చాడు. ఏం చేయాలో యేమో ఈ దయానందుల వారితో కష్టం వచ్చి పడింది" అన్నారు ఆచార్యుల వారు నవ్వుతూనే.

# 'రామ'శరం

"అనండి! అనండి!... నేను వింటున్నా వింటున్నా" అన్నారు రఘుమన్నగారు ఆ పక్క గది నుండే బిగ్గరగా.

"మీరు వినాలనే నేను అంటున్నా అంటున్నా" అని బిగ్గరగా నవ్వారు ఆచార్యులవారు.

మేం ఇద్దరి వ్యక్తిత్వాలకు దండం పెట్టుకొన్నాం. ఏమీ ఆచార్యుల వారు? ఏమి రఘుమన్న గారు? అలా ఆ ఇద్దరు మాబోంట్ల మనస్సులలో నిలిచిపోయారు.

వారి సన్నిహితుల నుండి సేకరిస్తే ఇలాంటి ఓ వంద సంఘటనలైనా లభి స్తాయి. వారి జీవితచరిత్ర రచనకు ఎవరైనా పూనుకొంటారని ఆశిద్దాం!

**ఏకోపాధ్యాయ బడి నుంచి విశ్వవిద్యాలయం వరకు**

రఘుమన్నగారి స్వగ్రామం యె(వె)ల్దండ. ఇప్పుడది నాగర్‌కర్నూలు జిల్లాలోని మండల కేంద్రం. పూర్వం పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి తాలూకాలో ఉండేది. వారిది వ్యవసాయ కుటుంబం. తాను చదివే కాలంలోనే వ్యవసాయం చేశారు.

కల్వకుర్తిలోని ఉన్నత పాఠశాలలో చదివేప్పుడు అధ్యాపకులు సరిగా లేరని విద్యార్థుల చేత ఉద్యమాలు నిర్వహించిన విద్యార్థి నాయకులు వారు. ఉన్నత పాఠశాల విద్య పూర్తి అయిన తర్వాత, కడ్తాల గ్రామ సమీపంలోని బంజారా తండాలో ఏకోపాధ్యాయ పాఠశాలలో పనిచేశారు. ఆ తర్వాత కొన్ని పరీక్షలిచ్చి, ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి ఉన్నత పాఠశాలల్లో పనిచేశారు. సెలవు పెట్టి ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఎం.ఏ. పూర్తిచేశారు. అప్పుడే ఆచార్య బి.రామరాజుగారికి సన్నిహితులయ్యారు. జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకులుగా చేరారు. ఆచార్య రామరాజుగారి పర్యవేక్షణలో 'జానపద సాహిత్యంలో పల్లె పదాల్లో ప్రజాజీవనం' అనే అంశంపై పరిశోధన చేశారు. ఆ సందర్భంగా ఎన్నో జానపద గేయాలు వారు సేకరించారు. అవి ఈనాటికీ అముద్రితాలే.

వారు డిగ్రీ కళాశాల ఉపన్యాసకులుగా ఉన్నప్పుడే పరిశోధక విద్యార్థులకు పర్యవేక్షకులుగా బాధ్యత నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో చేరిన పిదప పద్యం, జానపదం, సంస్కృతీచరిత్ర తదితర అంశాలు బోధించారు. వారి ఆధ్వర్యంలో ఎందరో పరిశోధనలు చేశారు.

ఈ మధ్యకాలంలోనే ఇంతకుపూర్వం మనం చెప్పుకొన్న అన్ని సంస్థల ఉత్సవాల్లో, శిక్షణ తరగతుల్లో, ఇతర కళాశాలల విద్యార్థుల సమ్మేళనాల్లో ధర్మం, సంస్కృతి, నైతిక విలువలు, భారతీయ విద్యావిధానం, దేశభక్తి, దేశరక్షణలో యువత పాత్ర.... తదితర అనేక అంశాలపై వేలసార్లు ప్రసంగించారు. ఈ మధ్యకాలంలోనే జాతీయ దృక్పథంతో, ఆర్షధర్మ దృష్టితో అనేక గ్రంథాలు ప్రచురించారు.


**రఘుమన్న సాహిత్యం**

తొలిదశలో వారు జానపద బాణీలో ముత్తి పదాలు, పల్లెల్ల పొద్దు పొడిసింది, అకాల జ్ఞానతత్త్వాలు, రామబాణం తదితర గ్రంథాలు ప్రచురించారు. ఇందులోని కొన్నిటిని జాతీయవాద సంస్థలన్నీ తమతమ సమ్మేళనాల్లో ఉపయోగించు కొన్నాయి. అకాల జ్ఞానతత్త్వాల్లో తమ ధ్యేయాన్ని...

"కవిగా కాలాన్ని పరీక్షించినాను. నా మాట పలికినాను. సూటిగా తేటగా మాటలో మలక పెట్టినాను. గుణం సూటి గురిపెట్టినాను. నిజం చెప్పటంలో నాకు నిర్భయం. సత్యం చాటటంలో నాకు సంతృప్తి. కాలానికి వెనుక ముందులు వివేచించి శ్రేయోమార్గాన సమాజాన్ని నడిపిస్తాను. దేశాన్ని కొలిపిస్తాను. విశ్వశ్రేయస్సుగా మలిపిస్తాను." (పుట:V)అని వివరించారు. "కాదనువాడెవడున్నా కదనానికి రమ్మన్నా!" అని సభల్లో ఛాలెంజ్ చేసి చెప్పేవారు.

ఈ తత్త్వాలను శివాజీ, గురుగోవిందు, దేశబంధు, లోకమాన్యులు, వివేకానంద, దయానంద, అరవిందులు, భగత్ సింగ్, ఆజాద్, సావర్కర్‌లకు అంకితమిచ్చారు. వారి రామబాణం గ్రంథాన్ని దయానందులకు, డాక్టర్జీలకు అంకితమిచ్చారు.వారికి అంకితమెందుకు? అని ఒకరు ప్రశ్నిస్తే...'దేశానికి ఆర్ష ధర్మమంత్ర శక్తి దయానందులందించారు. దేశరక్షణకు వీర జాతీయ యంత్రశక్తిని పూజనీయ డాక్టర్జీ అందించారు. వారి మార్గాన నడిస్తే దేశముంటుంది. లేకుంటే దురాక్రమణదారుల పాలైతది' అన్నారు జాతీయ విప్లవకవి రఘుమన్న.

పైన చెప్పుకొన్న నాలుగు గ్రంథాలే కాక వారు మరో పది గ్రంథాలు ప్రచురించారు. వారి సిద్ధాంత గ్రంథం 'జానపద సాహిత్యంలో పల్లె పదాల్లో ప్రజాజీవనం' జానపద పరిశోధకులకు కరదీపికగా నిలిచింది. వేదమే సంపూర్ణ సమాధానం, కవి శాసనం, స్త్రీయే బ్రహ్మ, యోగమే సంపూర్ణ సమాధానం వంటి గ్రంథాలన్నీ భారతీయ సంస్కృతీ వికాసానికి దోహదం చేసేవే. వారిప్పుడు లేరు. కాని వారి గ్రంథాలన్నీ భారతీయులకుపాథేయాలుగా నిలుస్తాయి. దేశంతో మమేకమయ్యే దేశభక్తిని కలిగిస్తాయి. ★



**ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి**

## కవి రఘుమన్నకు శ్రద్ధాంజలి

వేదధర్మం, భారతీయ సంస్కృతీ వికాసం నిమిత్తం నిరంతరం పరిశ్రమించిన కవిశాసన రఘుమన్న గారికి విశ్వ హిందూపరిషత్ కార్యాలయంలో సెప్టెంబర్ 24వ తేదీన శ్రద్ధాంజలి ఘటించింది. వారి సంతానానికి, పరివారంలోని అందరికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేసింది.

* కవిశాసన, ఆచార్య పండిత రఘుమన్న
* జాతీయ విప్లవకవి డాక్టర్ యెల్దండ రఘుమన్న
* గండిపేట వేదసాగర్‌లో ఆర్షవేద గురుకుల నిర్మాత రఘుమన్న
* 'మానవతకు మసిపూస్తే మరో ప్రపంచమవు తుంది, మానవతను నిర్మిస్తే మహా ప్రపంచ మవుతుంది' అని నినదించిన జాతీయ కవి రఘుమన్న
* అత్యవసర పరిస్థితిపై జాతీయ విప్లవ శంఖం పూరించిన రఘుమన్న
* తాను ప్రబోధించిన కవిత్వాంశాల్ని కాదనువాడే వడున్నా కదనానికి రమ్మన్నా అని సవాల్ విసిరిన రఘుమన్న,
* ఆయన లేరుగాని ఆయన ప్రబోధించిన జాతీయ భావ విప్లవం పూర్ణకాంతి వెదజల్లుతూనే ఉంది.
* ఆ కాంతిలోనే ఆయన పాట

**'పల్లెపల్లెలను లేపి - గుండె గుండెను ఊపి**
**నిండు శక్తిని చూపి**
**దుంకూ దుంకర దుంకు**
**దుర్గా దుంకిన దుంకు అని ముందుకు సాగుదాం'**

అన్న పాటల్లోని పరమార్థాల్ని తెలుసుకొని జీవిద్దాం!




## తెలుసుకుందాం

# సీతారామచంద్ర స్వామి ఆలయం- ఇల్లందకుంట



తెలంగాణ రాష్ట్రం, కరీంనగర్ జిల్లా, ఇల్లందకుంట గ్రామంలో ఈ ఆలయం కొలువుదీరింది. శ్రీరాముడు తన అరణ్యవాసంలో భాగంగా ఇక్కడ 13 రోజులు గడిపారని స్థానికుల విశ్వాసం. ఏటా శ్రీరామ నవమి సందర్భంగా ఇక్కడ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటారు.

## కథ | చిన్నారి స్నేహం



అనగనగా ఒక అడవిలో రెండు పిల్ల ఏనుగులు ఉండేవి. అవి చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులు. అన్ని పనులూ కలిసే చేసేవి. ఎక్కడికెళ్లినా రెండూ కలిసే వెళ్లేవి.

ఒకరోజు కొంతమంది ఏనుగులను ఎత్తుకెళ్లేందుకు అడవికి వచ్చారు. వారిని గమనించిన పెద్ద ఏనుగులు పారిపొమ్మని మిగిలిన పిల్ల ఏనుగులను హెచ్చరించాయి.

దీంతో అవన్నీ తలో దిక్కుకు వెళ్లిపోయాయి.

స్నేహితులైన పిల్ల ఏనుగులు రెండూ కలిసి ఒకే దిక్కుకు వెళ్లాయి. చాలా దూరం వెళ్లిన తర్వాత వాటికి దారి తప్పామని అర్థమైంది. తిరిగి తిరిగి బాగా అలసిపోయాయి. బాగా దాహం వేస్తోంది. ఎంత వెతికినా ఒక చుక్క నీరు కూడా కనిపించలేదు.

నీటి కోసం వెతుకుతూ వెతుకుతూ ఇంకా ముందుకు వెళ్లాయి. ఒకచోట ఒక గుంట కనిపించింది. కానీ దాంట్లో నీళ్లు చాలా తక్కువగా ఉన్నాయి. ఆ గుంటలో ఉన్న నీళ్లన్నీ తాగినా ఒక్క ఏనుగుకు కూడా సరిపోవు. అప్పుడు మొదటి ఏనుగు 'ఈ నీటిని నువ్వు తాగు. నాకు దాహం ఎక్కువగా లేదు.' అని రెండో దాంతో చెప్పింది. రెండో ఏనుగు 'కాదు.. కాదు.. నువ్వే తాగు. నీకే ఎక్కువ దాహం ఉందని ఇందాక చెప్పావు కదా..' అని మొదటి దాంతో చెప్పింది.

చాలా సేపు రెండూ వాదించుకున్నాయి. చివరికి అవి రెండూ ఒకేసారి నీళ్లు తాగాలని నిర్ణయించు

## పద్యం

అనువుగానిచోట నధికులమనరాదు
కొంచెముండుటెల్ల కొదువ గాదు
కొండ అద్దమందు కొంచమై యుండదా?
విశ్వదాభిరామ! వినుర వేమ!

**భావం :** మనకు తగని ప్రదేశంలో గొప్పవారమని, ఎక్కువ అని అనుట మంచిది కాదు. మనకు గల గొప్పతనమును, ఆధిక్యతను ప్రదర్శించక పోయినంత మాత్రాన మన ఔన్నత్యమునకు భంగం కలగదు. కొండ ఎంత పెద్దదైననూ అద్దములో చూచినపుడు చిన్నదిగానే కనిపించును గదా! అని అర్థం.

## శ్లోకం

'విద్యాహీనా నశోభంతే'

'రూప యౌవన సంపన్నాః
విశుద్ధ కుల సంభవాః
విద్యాహీనా నశోభంతే
నిర్గంధా ఇవ కింశుకాః'

**భావం :** రూప యౌవన సంపన్నులై, ఉత్తమ కులంలో పుట్టినప్పటికీ విద్యలేని వారు శోభించరు. మోదుగపూలు ఎర్రగా ఎంత అందంగా ఉన్నా, వాసనలేక పోవడం వల్ల అలంకారానికి దూరమవుతున్నాయి కదా!

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| హైదరాబాద్ | హుగ్లీ |
| ఢిల్లీ | తపతి |
| కోల్‌కతా | మూసీ |
| నాసిక్ | గంగ |
| సూరత్ | యమున |
| హరిద్వార్ | గోదావరి |

**జవాబులు :** హైదరాబాద్–మూసీ; ఢిల్లీ–యమున; కోల్‌కతా–హుగ్లీ; నాసిక్–గోదావరి; సూరత్–తపతి; హరిద్వార్–గంగ.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### సుధాన్షు బిస్వాస్




పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. 1917లో జన్మించారు. బిస్వాస్ రామకృష్ణ పరమహంసకు భక్తుడు. బ్రిటీష్ వారి అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి అనేక సార్లు జైలుకి వెళ్లారు. పేదలు, అనాథ పిల్లల కోసం అనాథాశ్రమాలను స్థాపించారు. ఈయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 2018లో పద్మశ్రీ అవార్డును ప్రకటించింది.

## జనరల్ నాలెడ్జ్

1. కేంద్ర పత్తి పరిశోధన సంస్థ ప్రధాన కార్యాలయం ఎక్కడుంది?
2. చేపలను చూసి భయపడే ఫోబియాను ఏమని పిలుస్తారు?
3. హిందూస్తాన్ షిప్‌యార్డ్స్ లిమిటెడ్ ఎక్కడుంది?

సమాధానాలు : 1. నాగపూర్, 2. ఇక్తిథోఫోబియా; 3. విశాఖపట్టణం



కున్నాయి. తొండాలు నీటిలో పెట్టాయి. ఎంతసేపటికీ గుంటలో నీళ్లు తగ్గడం లేదు.

ఈ లోగా చిన్న ఏనుగులను వెతుక్కుంటూ పెద్ద ఏనుగులు అక్కడికి చేరకున్నాయి. తొండాలు నీటిలో ఉంచిన పిల్ల ఏనుగులను చూశాయి.

చిన్న ఏనుగులు నీటిలో తొండాలు పెట్టాయి కానీ నీళ్లను తాగడం లేదని అర్థమైంది. 'మీరు నీళ్లు ఎందుకు తాగడం లేదు?' అని అడిగాయి.

'నేను నీళ్లు తాగితే నా స్నేహితుడికి నీళ్లు సరిపోవని, తాగడం లేదు' అని రెండూ ఒకేసారి చెప్పాయి. 'మీరు ఒకరి కోసం మరొకరు త్యాగాలు చేసుకున్నారు. స్నేహితులంటే మీలాగే ఉండాలి' అని పెద్ద ఏనుగులు వాటిని మెచ్చుకున్నాయి.

గుంటలోని నీళ్లు చెరిసగం తాగమని వాటికి సలహా ఇచ్చాయి. నీళ్లు తాగాక అన్నీ కలిసి అడవిలోని తమ ప్రాంతానికి వెళ్లిపోయాయి. ★

## మెదడుకు మేత

కాళ్లు లేవు కానీ నడుస్తుంది.. కళ్లు లేవు కానీ ఏడుస్తుంది?

జవాబు : మేఘం

## మంచిమాట

**జీవితం అనేది గమ్యం కాదు, గమనం మాత్రమే.. ఎన్నిసార్లు ఓడినా గెలవడానికి అవకాశం ఉంటుంది.**



# వారఫలాలు

02 -08, అక్టోబర్ 2023

## మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

కొత్త కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేస్తారు.స్థిరాస్తి వివాదాలు పరిష్కారదశకు చేరతాయి. ప్రముఖులతో పరిచయాలు. సమాజంలో విశేష కీర్తి పొందుతారు. వ్యాపారులకు పెట్టుబడుల్లో ఆటంకాలు తొలగుతాయి. ఉద్యోగులకు కొన్ని మార్పులు జరుగుతాయి. రాజకీయవేత్తలకు మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. 7,8తేదీల్లో స్నేహితుల నుంచి ఒత్తిడులు. విలువైన వస్తువులు జాగ్రత్తగా. ఆదిత్య హృదయం పఠించండి.

## వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆదాయం మరింత సంతృప్తినిస్తుంది. అనుకున్న కార్యక్రమాలలో కొంత ఆలస్యమైనా పూర్తి చేస్తారు. కోర్టు వ్యవహారాలలో కొంత అనుకూలత ఉంటుంది. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. ఉద్యోగులకు ఊహించని మార్పులు సంతోషం కలిగిస్తాయి. కళాకారులు, క్రీడాకారులకు విజయాలు వరిస్తాయి. 2,3తేదీల్లో కుటుంబంలో సమస్యలు. రాఘవేంద్ర స్తోత్రాలు పఠించండి.

## మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఆదాయం మరింత మెరుగ్గా ఉంటుంది. వ్యతిరేక పరిస్థితులు సైతం అనుకూలిస్తాయి. కొన్ని సమస్యలు ఎట్టకేలకు పరిష్కరించుకుంటారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు. కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు చేపడతారు. పరిశోధకులు, కళాకారులు కొత్త ఆశలతో ముందుకు సాగుతారు. 6,7 తేదీలలో కష్టానికి ఫలితం కనిపించదు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

## కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

ఆదాయం గతం కంటే మరింత ఆశాజనకంగా ఉంటుంది. కాంట్రాక్టర్ల యత్నాలు సఫలం. వివాహ, ఉద్యోగయత్నాలు కలిసివస్తాయి. గృహం, వాహనాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు సమస్యల నుంచి విముక్తి. రాజకీయవేత్తలకు నూతనోత్సాహం. రచయితలు, క్రీడాకారులకు అరుదైన పిలుపు రావచ్చు. 7,8 తేదీల్లో వృథా ఖర్చులు. స్నేహితులతో వివాదాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

## సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఆదాయం మెరుగుపడుతుంది. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఇంతకాలం పడిన శ్రమ కొలిక్కి వస్తుంది. నిరుద్యోగులు అవకాశాలు పెరుగుతాయి. ఇళ్లు, వాహనాలు కొంటారు. రాజకీయ వేత్తలకు కొత్త ఆశలు చిగురిస్తాయి. క్రీడాకారులు, పరిశోధకులకు అనుకోని ఆహ్వానాలు రాగలవు. 3,4 తేదీల్లో కుటుంబంలో తగాదాలు. గణేశ్‌స్తోత్రాలు పఠించండి.

## కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

ఏ కార్యక్రమమైనా సమయానికి పూర్తి చేస్తారు. ఇంటిలో శుభకార్యాలపై చర్చిస్తారు. సేవా కార్యక్రమాలు చేపడతారు. విద్యార్థులకు నూతనోత్సాహం. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారులకు తగినంత లాభాలు దక్కుతాయి. పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ పరంగా ఆహ్వానాలు అందుకుంటారు. రచయితలు, క్రీడాకారుల అంచనాలు ఫలిస్తాయి. 4,5 తేదీల్లో శారీరక రుగ్మతలు. శ్రీరామరక్షాస్తోత్రం పఠించండి.

## తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు


మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో అధిగమిస్తారు. రాబడి సంతృప్తికరంగా ఉంటుంది. గృహ నిర్మాణయత్నాలు ముమ్మరం చేస్తారు. దేవాలయాలు, ఆశ్రమాలు సందర్శిస్తారు. విద్యార్థులకు అనుకున్న అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగులు విధుల్లో ప్రతి బంధకాలు అధిగమిస్తారు. 5,6 తేదీల్లో కుటుంబ సభ్యులతో తగాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. విష్ణుధ్యానం చేయండి.

## వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. దేవాలయాలు సందర్శిస్తారు. కొన్ని కార్యక్రమాలు సమయానికి పూర్తి కాగలవు. వ్యాపారులకు మరింతగా లాభాలు దక్కవచ్చు. ఉద్యోగులు విధుల్లో అవాంతరాలు అధిగమిస్తారు. రచయితలు, క్రీడాకారులకు నూతనోత్సాహం. 6,7తేదీల్లో బంధు విరోధాలు. లక్ష్మీస్తోత్రాలు పఠించండి.

## ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

కష్టసాధ్యమైన కార్యక్రమాలను సైతం అవలీలగా




సింహంభట్ల సుబ్బారావు

6300674054


పూర్తి చేస్తారు. రాబడి అనూహ్యంగా పెరిగి రుణ బాధల నుంచి విముక్తి పొందుతారు. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. విద్యార్థుల యత్నాలలో అనుకూలత. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు అనుకూల మార్పులు. రాజకీయ వేత్తలు అనుకున్నది సాధిస్తారు. 2,3 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. హనుమాన్ ఛాలీసా పఠించండి.

## మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలలో జాప్యం జరిగినా పట్టుదలతో పూర్తి చేస్తారు. అనుకున్న లక్ష్యాలను సాధిస్తారు. భూవివాదాలు కొలిక్కి వచ్చి ఊపిరి పీల్చుకుంటారు. గృహ నిర్మాణయత్నాలలో కొంత పురోగతి సాధిస్తారు. నిరుద్యోగులకు ఉద్యోగయోగం. వ్యాపారులకు లాభసాటిగా ఉంటుంది. రచయితలు, క్రీడాకారులకు పిలుపు రావచ్చు. 4,5 తేదీల్లో స్నేహితుల నుంచి ఒత్తిడులు. దుర్గా స్తోత్రాలు పఠించండి.

## కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

కొన్ని అవాంతరాలు, ఇబ్బందులు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తారు. ఆస్తుల విషయంలో బంధువులతో ఒప్పందాలు చేసుకుంటారు. ఇంటి నిర్మాణయత్నాలు చేస్తారు. ఉద్యోగాలలో ఎదురయ్యే ఇబ్బందులు అధిగమించి దూసుకు వెళతారు. రాజకీయవేత్తలకు ఉత్సాహవంతంగా ఉంటుంది. కళాకారులు, 5,6తేదీలలో బంధువర్గంతో తగాదాలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

## మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు తప్పవు. నిరుద్యోగులకు ఉద్యోగయత్నాలు అంతగా కలసిరావు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులు లాభనష్టాలు సమానంగా భరించాల్సిన సమయం. రాజకీయవేత్తలకు గందరగోళంగా ఉంటుంది. కళాకారులు, క్రీడాకారుల కృషి ఫలించదు. 7,8తేదీలలో శుభవర్తమానాలు. ధనలబ్ధి. పరిచయాలు పెరుగుతాయి. సుబ్రహ్మణ్య స్తోత్రాలు పఠించండి.

# పదరసం-435

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | 4 | | ✠ | 5 |
| | ✠ | | ✠ | | ✠ | | ✠ | ✠ | |
| | ✠ | | ✠ | ✠ | 6 | 8 | | 7 | |
| 8 | | | 9 | | | ✠ | ✠ | | ✠ |
| | ✠ | ✠ | | ✠ | 10 | | | | ✠ |
| ✠ | 11 | | | | | ✠ | ✠ | 12 | |
| 13 | | ✠ | | ✠ | ✠ | 14 | | | ✠ |
| ✠ | | ✠ | 15 | | | | ✠ | ✠ | 16 |
| 17 | | 18 | | ✠ | ✠ | | ✠ | ✠ | |
| | ✠ | | ✠ | ✠ | 19 | | | | |

**పదరసం – 435**

పేరు : ..........................................................................................

చిరునామా:......................................................................................

...................................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ......................................................

## ఆధారాలు

**అడ్డం**

1. జననీ జన్మభూమిశ్చ..... (8)
6. ఎర్రని గ్రహం (5)
8. ధర్మో..... అనేది చాలా ప్రసిద్ధి (6)
10. ప్రప్రథమ కర్ణాటక సంగీత విద్వాంసుడు.... దాసు (4)
11. శ్రీ రంగంలో కొలువైనవాడు అటునుంచి (5)
12. ఒక నక్షత్రం (2)
13. .... గానం శ్రీకృష్ణునికి చాలా ఇష్టం (2)
14. ఉత్కృష్టమైన, అపరుజి (3)
15. విడిచి వెళ్లిపోవడం (4)
17. మంత్రాన్ని లేదా గ్రంథాన్ని ఒక నియమానుసారం చదవడం (4)
19..... పల్కు నాడంబరముగాను (5)


**నిలువు**

1. ఈ ఉద్యమం చెత్తలేని దేశం కోసం (5)
2. నలమహారాజు భార్య (4)
3. పితృకార్యాలకు ప్రసిద్ధి (2)
4. పాటలు పాడే స్త్రీ సరిగా లేదు (2)
5. దుర్యోధనుని మీద పగ తీర్చుకున్నవాడు (3)
6. రాణివాసపు స్త్రీలు ఉండేచోటు (4)
7. పళనిలో కొలువైన దేవుడు (5)
9. కోటి... నా తెలంగాణ అని కవి దాశరథి అన్నాడు.
11. లంకేశుడు తలక్రిందులైనాడు (4)
14. నిద్రలేపడం (4)
16. అహల్య, గౌతముల కుమారుడు (3)
17. కాపాడు, రక్షించు... మా(2)
18. ఛందస్సుకు చెందినది అవధూత కూడా (2)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

**సమాధానాలను** పైగడులలో పూరించి,కత్తిరించి కవర్‌పై పదరసం నెం.వేసి 2023 అక్టోబర్ 16 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

**పదరసం - 431 సమాధానాలు**



**విజేతలు:** టి.స్వాతి,లింగేశ్వరరావు, కొండుపర్తి కాంతామణి, జన్ను జయంత్, వారణాసి సరస్వతి, నేమాని బాలశైలజ, వి.పద్మారంగనాథ్, రాయవరపు శేషు, శ్రీధర్‌కులకర్ణి, తిరుమల విద్యానాథ్, కొల్లూరి వెంకట రమణమూర్తి, సిహెచ్.గీతాస్రవంతి, నేమాన సుభాష్‌చంద్రబోస్, వై.రాధాకిషన్, శ్రీరాముల విజయకుమార్, కె.శ్రీనిధి, టి.యశస్వి, కె.స్వప్న, కె.వి.ఎస్.ఎన్. గణేష్ కుమార్, వనమాల రామలింగాచారి, కె.అల్లీరాణి, నాయని రాములు, మత్స్యరాజ విజయలక్ష్మి, కొన్నె ప్రశాంత్, పి.శాంతకుమారి, ఎ.ప్రదీప్‌కుమార్, ప్రదీప్, పులికంటి రాజేశ్వరరావు, డా. బి.ధన్వంతరి, ఉడాల భాస్కరయ్య, రుద్రభట్ల సుగుణ రాజారాం, కన్నెకంటి విష్ణుప్రసాద్, దాసరి లక్ష్మణరావు, గండ్లూరి ఫణికుమార్, వై.హనుమంతరావు, బాచిరాజు సుధాకరరావు.

**ఈ వారం విజేత : కాశీభట్ల సూర్యప్రభ, అశోక్‌నగర్, అనంతపురం జిల్లా**

అరుణ



కన్నడ డబ్బింగ్ చిత్రాలు తెలుగులో ఆడటం చాలా కష్టం అనే భావన కొన్నేళ్లుగా ఉంది. అలానే కన్నడ చిత్రాలను తెలుగులో రీమేక్ చేసి నష్టపోయిన నిర్మాతలూ చాలామందే ఉన్నారు. తమిళ చిత్రాలతో పోల్చితే తెలుగులోకి అనువాదమైన కన్నడ చిత్రాలు తక్కువే. అయితే... ఇప్పుడు ఆ వాతావరణం మారింది. కన్నడనాట కూడా భారీ బడ్జెట్ చిత్రాలు తెరకెక్కుతున్నాయి. అలానే సున్నితమైన అంశాలతో కథాబలం ఉన్న సినిమాలూ రూపుదిద్దుకుంటున్నాయి.



# పాత బాటలోనే 'సప్త సాగరాలు దాటి...'

కరోనా కారణంగా సినిమా రంగానికి సంబంధించినంతవరకు హద్దులు వేగంగా చెరిగిపోయాయి. ఇవాళ ఓటీటీలో సినిమాలను నాలుగైదు భాషల్లో స్ట్రీమింగ్ చేస్తున్నారు. అందువల్ల పరభాషా చిత్రాలను చూడటం సర్వసాధారణమై పోయింది. ఇదే నేపథ్యంలో కొన్ని భారీ చిత్రాలతో పాటు సెన్సిబుల్ మూవీస్‌ను మన నిర్మాతలు పనిలో పనిగా డబ్ చేసి, థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. అలా తెలుగువారి ముందుకు వచ్చిన తాజా కన్నడ చిత్రం 'సప్త సాగరాలు దాటి...'. రక్షిత్ శెట్టి, రుక్మిణి వసంత్ జంటగా నటించిన ఈ ప్రేమకథా చిత్రం సెప్టెంబర్ 1వ తేదీ కన్నడలో 'సప్తసాగర దాచే ఎల్లో' పేరుతో విడుదలై మంచి విజయాన్ని సాధించింది. దాంతో వెనువెంటనే ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టి.జి. విశ్వప్రసాద్ దీన్ని తెలుగులో డబ్ చేసి విడుదల చేయడానికి సన్నాహాలు చేశారు. ఆ రకంగా సెప్టెంబర్ 22న ఇది రెండు తెలుగు రాష్ట్రాలలో విడుదలైంది. చిత్రమేమంటే... కన్నడ వారికి ఈ కథలో కొత్తదనం కనిపించి ఉండొచ్చు కానీ తెలుగు వారికి మాత్రం ఇది పాత బాటలో సాగినట్టే అనిపిస్తుంది. ఎందుకంటే ఈ బ్యాక్‌డ్రాప్‌లో ఇప్పటికే కొన్ని తెలుగు సినిమాలు, తమిళ అనువాద చిత్రాలు వచ్చాయి.

కథ విషయానికి వస్తే మను (రక్షిత్ శెట్టి) ఓ పెద్ద పారిశ్రామికవేత్త దగ్గర డ్రైవర్. కాలేజీలో చదువుకునే సింగర్ ప్రియతో అతను ప్రేమలో పడతాడు. త్వరలోనే పెళ్లి చేసుకొని, కాపురం పెట్టడం కోసం అద్దెఇంటి కోసం వెదుకుతూ ఉంటారు. సాగరతీరంలో ఇల్లు కట్టుకోవాలన్నది చిన్నప్పటి నుండీ ప్రియ కోరిక. పెళ్లి తర్వాత ఆమె కోరిక తీర్చడం కోసం మంగళూరులో ఇల్లు కట్టాలని మను అనుకుంటాడు. అదేసమయంలో అతను పనిచేసే సంస్థ ఓనర్ కొడుకు ఓ యాక్సిడెంట్ చేస్తాడు. ఆ నేరాన్ని తనపైన వేసుకుంటే డబ్బులు వస్తాయని, తద్వారా ప్రియ ఇంటి కోరిక నెరవేర్చవచ్చని మను భావిస్తాడు. ఆమెను ఒప్పించి జైలుకు వెళతాడు. అక్కడే కథ అడ్డం తిరుగుతుంది. ఎవరిని నమ్మి అయితే మను జైలుకు వెళ్లాడో ఆయన గుండెపోటుతో చనిపోతాడు. భార్యాపిల్లలు విదేశాలకు వెళ్లిపోతారు. మధ్యవర్తిగా ఉండి మనుతో ఈ పనికి ఒప్పించిన మేనేజర్ స్వార్థంతో పలాయనం చిత్తగిస్తాడు. కాబోయే భర్త చేయని నేరానికి జైలుకు వెళ్లడంతో అతన్ని విడిపించడానికి ప్రియ ఎలాంటి ప్రయత్నాలు చేసింది? జైలులోని రెండు వర్గాల మధ్య పోరులో అడకత్తెరలో పోకచెక్క మాదిరి మను ఎలా ఇబ్బందులు పడ్డాడు?పదేళ్ల జైలుశిక్షను అనుభవించి అతను బయటకు వచ్చే వరకూ ప్రియ పెళ్లి చేసుకోకుండా వేచి ఉందా? అనేదే మిగతా కథ.

చిత్రం ఏమంటే... ఈ కారాగారవాస నేపథ్య ప్రేమకథా చిత్రాన్ని దర్శకుడు హేమంత్ రావ్ రెండు భాగాలుగా తీశారు. ఇదంతా మొదటి భాగం మాత్రమే. ఈ సినిమా రెండో భాగం షూటింగ్ ఇప్పటికే పూర్తయ్యింది. అది మరో నెల రోజుల తర్వాత వస్తుంది. దాదాపు ఐదు గంటల పాటు సినిమా తీయడంతో చాలా సంఘటనలు నత్తనడకన సాగాయి. స్లో నెరేషన్‌తో ఆడియెన్స్‌కు గుడ్ ఫీల్ కలుగుతుందని దర్శకుడు భావించి ఉండొచ్చు, కానీ కొన్ని సందర్భాలలో అసహనం కలిగే పరిస్థితి ఏర్పడింది. చాలా సీన్స్ రిపీట్ కావడం, కథ ఎంతకూ ముందుకు వెళ్లకపోవడంతో బోర్ ఫీల్ అయ్యారు. ఓ చిన్న పాయింట్‌ను తీసుకుని దర్శకుడు దృశ్య, శ్రవ్య కావ్యంగా మలచాలని చూశారు. ఎక్కడా అశ్లీలతకు, అసభ్యతకు తావు లేకుండా క్లీన్ మూవీగా తీయడం వరకూ అభినందించాల్సిందే. కానీ కథనాన్ని ఆకట్టుకునేలా తెరకెక్కించడంలో విఫలమయ్యారు.

నటుడు రక్షిత్ శెట్టి 'అతడే శ్రీమన్నారాయణ', '777 చార్లీ' వంటి డబ్బింగ్ సినిమాలతో తెలుగువారికి సుపరిచితుడే. అలానే అతని కన్నడ సినిమాలు కొన్ని తెలుగులోనూ రీమేక్ అయ్యాయి. అయితే మనవాళ్లు అతన్ని ఇంకా ఓన్ చేసుకోలేదు. అతను తన పాత్రను సమర్థవంతంగా పోషించాడు. హీరోయిన్ రుక్మిణి వసంత్ కూడా పాత్రలో ఒదిగిపోయింది. ఆమె తల్లిగా పవిత్రా లోకేష్, మేనేజర్‌గా అచ్యుత్ కుమార్, ఓనర్‌గా అవినాశ్, జైలులో రెండు వర్గాల ప్రతినిధులుగా శరత్ లోహితాశ్వ, రమేశ్ ఇందిర నటించారు. చరణ్‌రాజ్ పాటలు ఏమంత గొప్పగా లేకపోయినా.. నేపథ్య సంగీతం బాగుంది.

'సప్త సాగరాలు దాటి' ద్వితీయభాగంలో శిక్ష పూర్తి చేసుకుని బయటకు వచ్చిన మను... ప్రియ ప్రేమను తిరిగి పొందడానికి చేసే ప్రయత్నంతో పాటు, తను జైలులో పదేళ్లపాటు మగ్గేలా చేసిన వ్యక్తుల మీద కూడా పగ తీర్చుకుంటాడని ఎండ్ టైటిల్ కార్డ్స్‌లో వేసిన విజువల్స్‌తో అర్థమౌతోంది. అదే జరిగితే మాస్ ఆడియెన్స్‌ను సెకండ్ పార్ట్ ఆకట్టుకునే ఆస్కారం ఉంది. వచ్చే నెలలోనే అది కూడా వచ్చేస్తుంది కాబట్టి ఎలాంటి ఫలితం దక్కుతుందో చూడాలి. మొదటి భాగం చూసిన వారికి రెండో భాగం చూడాలనే భావనైతే దర్శకుడు కలిగించాడు. సో... ఎలాంటి అంచనాలు పెట్టుకోకుండా థియేటర్‌కు వెళితే ఓ మాదిరిగా నచ్చే ఆస్కారం ఉంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



# పర్యావరణం కోసం చిన్నారుల చొరవ

పర్యావరణం గురించి పెద్ద వయస్సు వాళ్లు కొంత చొరవ చూపటం చూస్తుంటాం. కానీ బడికి వెళుతున్న చిన్నారులే ముందుకు వచ్చి పర్యావరణం గురించి పని చేయటం ఆసక్తిదాయకం. విద్యాభారతికి అనుబంధంగా ఉండే భారతీయ విజ్ఞాన కేంద్రం.. బీవీకే స్కూల్స్ ఈ దిశగా చొరవ తీసుకొన్నాయి. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లో అనేక చోట్ల బీవీకే స్కూల్స్ సేవాభావనతో నడుస్తున్నాయి. ఈ క్రమంలో బంగాళాఖాతం తీరం వెంబడి అనేక గ్రామాల్లో సాగర తీర శుభ్రతా దివస్ కార్యక్రమాన్ని చేపట్టారు. అనకాపల్లి జిల్లాలోని ముత్యాలమ్మ పాలెం, వడ చీపురుపల్లి, దిబ్బపాలెం, తిక్కవానిపాలెం, వడనరసాపురం, కొత్తపాలెం గ్రామాల్లో దీనిని నిర్వహించారు. ఇదే ప్రాంతంలోని గునిపూడి, బంగారయ్య పేట, రాజయ్యపేట, ములపర్రు, పెంటకోట వంటి గ్రామాల్లో శుభ్రత కార్యక్రమం చేపట్టారు. బీవీకే పాఠశాలల విద్యార్థులు, ఆచార్యులు పెద్దఎత్తున సముద్రతీరానికి చేరుకొని అక్కడ పేరుకొని పోయిన చెత్తను తొలగించారు. మత్స్యకార గ్రామాలకు మేలు చేసేందుకు ఇంతటి చొరవ తీసుకొన్న బీవీకే విద్యార్థులు, ఆచార్యులను గ్రామస్తులు అభినందించారు. కాకినాడ జిల్లాలోని పెరుమాళ్లపురం, హేమవరం, చింతకాయల పేట, సాల్మన్ పేట, తాళ్లతంటి పేటలో సాగర శుభ్రత కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. శ్రీకాకుళం జిల్లాలోని చిక్కారిపాలెం, బత్తివాని పాలెం, పెదకారివానిపాలెం వంటి చోట్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదే స్ఫూర్తితో తర్వాత కాలంలో సాగరతీరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పనిచేయాలని తీర్మానించారు. మారుమూల పల్లె ప్రజలకు మేలు చేసేందుకు ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించిన బీవీకే సేవా సంస్థల్ని అంతా అభినందించారు. ★



From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 50

